RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు


విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 194 | శనివారం 08 - 02 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

## తెలంగాణలో 'బ్రూసెల్లా ఇథిపికల్' వైరస్ కలకలం.. కుక్కలతో జాగ్రత్త



తెలంగాణలో వీధికుక్కల బెడద పెరిగిపోతోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్దులపై వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఎక్కువ శాతం ఈ దాడులు హైదరాబాద్ లోనే జరుగుతున్నాయి. ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ఒకవైపు ఈ దాడుల ఘటనలతో ప్రజలు సతమతం అవుతుంటే.. మరోవైపు తెలంగాణలో మరో కొత్త వైరస్ కలకలం రేపింది. కుక్కల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకుతుందని వైద్యులు నిర్ధారించారు. దీంతో ఈ వైరస్ ఇష్యూ రాష్ట్ర వ్యాప్తంగా కలకలంగా మారింది.

## ఢిల్లీలో హైడ్రామా... కేజ్రీవాల్ ఇంటికి ఏసీబీ అధికారులు



రేపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

ఫలితాలకు ముందే తమ అభ్యర్థులను కొనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న కేజ్రీ

బీజేపీపై సంచలన ఆరోపణలు చేసిన మాజీ సీఎం

ఏసీబీ విచారణకు ఆదేశించిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్

## చొరబాట్లకు యత్నించిన పాకిస్థాన్ ఉగ్రవాదులు

కశ్మీర్ లో భారత భద్రతా బలగాలకు విజయం



జమ్ము కశ్మీర్ లో భారత భద్రతా బలగాలకు భారీ విజయం చేకూరింది. సరిహద్దులో చొరబాట్లకు పాల్పడుతున్న ఏడుగురు పాకిస్థాన్ జాతీయులను భారత సైన్యం మట్టుబెట్టింది. వారిలో ఇద్దరు ముగ్గురు పాక్ సైనికులు ఉండొచ్చని సైన్యం భావిస్తోంది. ఫిబ్రవరి 5వ తేదీని పాక్ కశ్మీర్ సంఘీభావ దినంగా పాటిస్తోంది.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు.. సీఎం రేవంత్‌పై హరీష్‌రావు ధ్వజం



- సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రేవంత్ ప్రభుత్వంపై హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం
- వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం

హైదరాబాద్: గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు బాధాకరమని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి,


# కేబినెట్ పై కాదు కార్యవర్గంపై కసరత్తు

రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతలతో కేసీ వేణుగోపాల్ విడివిడిగా చర్చలు

కానీ ఇప్పుడే విస్తరణకు అవకాశం మాత్రం లేదంటూ నేతలు ఈ సందర్భంగా స్పష్టం

కేబినెట్ లో ఆమోద ముద్ర వేసినట్లు పార్టీ అధిష్టానానికి వీరు సోదాహరణగా వివరించారు.

కేబినెట్ పై కాదు కార్యవర్గంపై కసరత్తు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల ఢిల్లీ పర్యటన బిజీ బిజీగా




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 07: పీసీసీ కార్యవర్గం కూర్పుపై తెలంగాణ అగ్రనేతలతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సుదీర్ఘ చర్చలు జరుపుతోన్నారు. అందులోభాగంగా రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతలతో కేసీ వేణుగోపాల్ విడివిడిగా చర్చలు జరుపుతోన్నారు. ఆ క్రమంలో ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డితో కేసీ వేణుగోపాల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీసీసీ కార్యవర్గాన్ని ఒకటి లేదా రెండో రోజుల్లో ప్రకటించే అవకాశమున్నట్లు సమాచారం. మరోవైపు పీసీసీలో నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు ఉండ వచ్చన్న కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేశాయి. వీరి నియామకాల్లో సామాజిక సమతుల్యం పాటించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నలుగురిలో ఒకరు మాదిగ, ఒకరు ముస్లిం, ఒకరు లంబాడి, ఒకరు రెడ్డి వర్గాలకు కేటాయించాలని భావిస్తున్నట్లు సమాచారం. అలాగే 15 నుంచి 20 మందిని పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించే అవకాశముంది. అదే విధంగా పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులపై కూడా నేతలు ఈ సందర్భంగా కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ సమావేశంలో కేబినెట్?లో మార్పులపై ఎలాంటి సమాలోచనలు జరపలేదని తెలుస్తోంది. ప్రస్తుతానికి మంత్రి వర్గ విస్తరణ లేదని

## రేవంత్ కేబినెట్ లోకి ఆ అయిదుగురు

కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో హైకమాండ్ అలర్ట్

నామినేటెడ్ పెండింగ్ పదవులను ఖరారు చేయాలని రేవంత్ భావిస్తున్నారు.



ఢిల్లీ కేంద్రంగా కీలక మంత్రాంగం కొనసాగుతోంది. ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ.. పీసీసీ కొత్త కార్యవర్గం.. నామినేటెడ్ పోస్టుల భర్తీ పైన హైకమాండ్ కసరత్తు చేస్తోంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు.. కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో హైకమాండ్ అలర్ట్ అయింది. దీంతో, పదవుల విషయంలో కీలక నిర్ణయానికి సిద్దమైంది. మంత్రి పదవుల ఖరారు పైన కొత్త ఫార్ములా అమలు చేస్తోంది. అందులో భాగంగా పార్టీ నేతలకు కీలక సూచనలు చేసింది. హైకమాండ్ తో చర్చలు ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ ముఖ్యులతో కలిసి ఢిల్లీ వెళ్లారు. పార్టీ నేత కేసీ వేణుగోపాల్ లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. కుల గణన పైన నివేదికను సమర్పించారు. కాగా, మంత్రివర్గ విస్తరణ.. పీసీసీ కార్యవర్గంతో పాటుగా నామినేటెడ్ పదవుల పైన చర్చ చేసారు. దీంతో, హైకమాండ్ తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాల పైన ఆరా తీసినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలు.. హామీల అమలు గురించి చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో మంత్రివర్గం విస్తరణ కోసం ఆశావాహులు చాలా కాలంగా నిరీక్షిస్తున్న విషయం పైన చర్చ జరిగింది. 'తండేల్'ను నిలబెట్టింది నాగ చైతన్య కాదు అతనే.. లేదంటే సినిమా గల్లంతే.. ! ప్రతిపాదనలు సిద్దం పార్టీ ముఖ్య నేతలు చర్చించి.. తమకు ప్రతిపాదనలు ఇవ్వాలని కోరినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తో పాటుగా పార్టీ ఇంఛార్జ్ సైతం

## సీఎం రేవంత్ రెడ్డికి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదు: కేటీఆర్ ఆగ్రహం..

- "పేదల గూళ్లపై బుల్డోజర్లు పంపడంలో ఉన్న ప్రేమ.. బడిపిల్లలకు బుక్కెడు బువ్వపెట్టడంలో లేదా?.
- ఢిల్లీకి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ చిన్నపిల్లలకు భోజనం అందించడంలో సీఎంకు లేదంటూ
- మీ ఢిల్లీ బాసులు.. మీ గల్లీ దోస్తుల ఆకలి తీర్చడం కాదు రేవంత్..
- నాణ్యమైన భోజనం అందించడం లేదని, పిల్లలను పస్తులు ఉంచుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం,

ఇది ప్రజాపాలన కాదు.. ప్రజలను వేధించే పాలన" అంటూ ట్వీట్




ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సరిగా అందడం లేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. నాణ్యమైన భోజనం అందించడం లేదని, పిల్లలను పస్తులు ఉంచుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే విద్యార్థులుఆకలితో అలమటి స్తున్నారంటే,

## ట్రంప్‌తో మోదీ మీటింగ్ ఫిక్స్..



- ఫిబ్రవరి 12-13 తేదీల్లో మోదీ అమెరికాలో పర్యటిస్తారని
- ట్రంప్ ప్రమాణస్వీకారం అనంతరం మొదటగా కలుసుకోనున్న కొద్ది మంది ప్రపంచ నేతల్లో మోదీ ఒకరు"
- డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకరాం చేపట్టిన తర్వాత మోదీ జరుపుతున్న తొలి పర్యటన

న్యూఢిల్లీ: ప్రధాన నరేంద్ర మోదీ అమెరికా పర్యటన తేదీలు ఖరారు అయ్యారు. ఫిబ్రవరి 12-13 తేదీల్లో మోదీ అమెరికాలో పర్యటిస్తారని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శుక్రవారంనాడు తెలిపారు.

## మీ పని బాగుంది.. అధికారులను ప్రశంసలతో ముంచెత్తిన పవన్ కల్యాణ్

ఎర్రచందనం సంరక్షణపై కీలక నిర్ణయాలు

విజయం భవిష్యత్ తరాల వారికి మన అడవులను సంరక్షించేలా చేస్తాయని పవన్ కల్యాణ్



అమరావతి: ఎర్రచందనం ఒక అరుదైన జాతి, దాని పరిరక్షణ చాలా ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఎర్రచందనం సంరక్షణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. 195 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో ఏపీ అటవీ శాఖ, రెడ్ శాండల్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషించారని అన్నారు. అక్రమ స్మగ్లింగ్ చేస్తున్న 8 మంది నేరస్తులను పట్టుకున్న అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ ఆపరేషన్‌తో ఎంతో విలువైన సహజ సంపదను అధికారులు రక్షించారని చెప్పారు. అధికారుల తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్య కలాపాలను అరికట్టడంలో మీ అంకితభావం, వేగవంతమైన చర్యలు తీసుకున్న అధికారులను అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వన్యప్రాణులు, అటవీ నేరాలను అరికట్టేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలకు అండగా నిలుస్తోందని ప్రశంసించారు. ఈ విజయం భవిష్యత్ తరాల వారికి మన అడవులను సంరక్షించేలా చేస్తాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## తల్లికి వందనం, రైతులకు భరోసా అమలు



- సూపర్ సిక్స్ పథకాల అమలు పైన మంత్రివర్గ భేటీలో చర్చించారు.
- హామీ ఇచ్చిన విధంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం

అమరావతి : ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సూపర్ సిక్స్ పథకాల అమలు పైన మంత్రివర్గ భేటీలో చర్చించారు. నాలుగు నెలల కాలంలో మూడు హామీల అమలుకు నిర్ణయించారు. అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ అమలు చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తున్నారు. కాగా, తాజాగా తల్లికి వందనం తో పాటుగా అన్నదాత సుఖీభవ పథకాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేయాలని

## జగన్‌కి ఊహించని షాక్.. ఆ ఐదుగురు జంప్ !

అసెంబ్లీకి వెళ్లి అధ్యక్ష అనలేని పరిస్థితి వీరిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నట్లు

అదీకాక వై నాట్175 ? అంటూ అధికారంలో ఉండగా వైసీపీ అధినేత వైఎస్ జగన్..

2024 ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ కేవలం 11 సీట్లు మాత్రమే దక్కించుకొంది.

ఏదీ ఏమైనా ఈ శివరాత్రి నాటికి వీరంత తమ నిర్ణయాన్ని ప్రకటిస్తారనే చర్చ సైతం ఊపందుకొంది.




వైఎస్ జగన్ కు మరో భారీ షాక్ తగలనుందనే ఓ చర్చ అయితే పోలిటికల్ సర్కిల్?లో వైరల్?గా మారింది. ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యేల్లో.. ఐదుగురు పార్టీ వీడేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా రిజర్వుడ్ స్థానాల నుంచి గెలిచిన వారిని సమాచారం. ఎమ్మెల్యేగా గెలిచినా.. అసెంబ్లీకి వెళ్లి అధ్యక్ష అనలేని పరిస్థితి వీరిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీకి రాజీనామా చేసి.. అసెంబ్లీకి వెళ్లాలని వారు ఓ నిర్ణయానికి వచ్చారు. అయితే 2014, 2019 ఎన్నికల అనంతరం ఎమ్మెల్యేలు పార్టీలు మారడం.. ఈ సందర్భంగా చోటు చేసుకున్న

## అదే నేను విశ్వసిస్తా... టీం స్పిరిట్‌తో పనిచేయండన్న సీఎం చంద్రబాబు

ప్రతి ఒక్కరు టీం స్పిరిట్‌తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే మా ఆలోచన

- ప్రజలు అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికల్లో 93 స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక తీర్పును ఇచ్చి గెలిపించారని
- గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు యశక్తులా కష్టపడుతున్నామన్నారు.
- సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు.




అమరావతి, ఫిబ్రవరి 7: రాష్ట్ర మంత్రులను పనితీరును ఉద్దేశిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. వేగవంతమైన పనితీరుతో సత్వర ఫలితాలు సాధిద్దామంటూ మంత్రులకు సూచించారు ముఖ్యమంత్రి. ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రజలు అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికల్లో 93 స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక తీర్పును ఇచ్చి గెలిపించారని తెలిపారు. వారి ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు తొలిరోజు, తొలిగంట నుంచి ప్రయత్నం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను

తెలంగాణ సేన



## మద్యం కుంభకోణం వ్యవహారంలో ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.స్వామినాథన్, ఎ.జనార్ధన్ రావు, ఇన్స్పెక్టర్‌లు వైకుంఠరావు, దుర్గా ప్రసాద్, రమేష్, శేషయ్య, శ్రీనుబాబు, రమణలను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది ప్రభుత్వం. వీరందరినీ వెంటనే రిలీవ్ చేసి విజయవాడ సీపీ రాజశేఖర్ బాబుకు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. మద్యం కుంభకోణంపై నియమించిన సిట్ బృందం సీఐడీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాలని.. ప్రతీ 15 రోజులకు ఒకసారి నివేదికను రూపొందించి సీఐడీ చీఫ్ ద్వారా ప్రభుత్వానికి అందించాలని గతంలోనే ఆదేశించింది. ఎవరినైనా అరెస్ట్ చేసే అధికారం సిట్‌కు ఉంటుందంటూ వారికి పోలీస్‌స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేసి.. అధికారాలను కట్టబెట్టింది కూటమి ప్రభుత్వం. తాజాగా మద్యం కుంభకోణంపై విచారించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా అవసరం అవుతారని ప్రభుత్వం భావించింది. దీంతో ఎక్సైజ్ అధికారుల సహకారం తీసుకునేందుకు ఆ డిపార్ట్‌మెంట్‌లో కొంతమంది అధికారులను సిట్ బృందంలో నియమించాలని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు ప్రభుత్వానికి వినతి చేశారు.

### మహాకుంభమేళాకు వెళ్తూ రైల్లో అమ్మాయిల పిచ్చి వేషాలు.. చివరికి..

సపోర్టింగ్ స్టాఫ్‌లాగా వీరందరినీ నియమిస్తూ ప్రభుత్వం ఆర్డర్స్ పాస్ చేసింది. సిట్ బృందంలో ఇప్పటికే రాజశేఖర్ బాబుతో పాటు ఎస్పీలు, అడిషినల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలను నియమించారు. ఇప్పుడు తాజా వీరికి సహకరించేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్లను, ఇన్స్పెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బృందం అంతా కూడా మద్యంపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందానికి సహకరించాలని తెలిపారు. అలాగే సిట్ బృందం అడిగిన వివరాలను సంబంధిత శాఖలు వెంటనే ఇవ్వాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

## ఢిల్లీలో హైడ్రామా... కేజ్రీవాల్ ఇంటికి ఏసీబీ అధికారులు

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ పీఠం ఎవరిదో రేపటితో తేలనుండగా... నేడు హైడ్రామా నెలకొంది. ఫలితాలకు ముందే ఆప్ అభ్యర్థులను కొనేందుకు బీజేపీ యత్నిస్తోందని కేజ్రీవాల్ ఆరోపించడం... కేజ్రీ ఆరోపణలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందించి ఏసీబీ విచారణకు ఆదేశించడం హస్తిన రాజకీయాల్లో కాకపుట్టించింది. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారులు కేజ్రీవాల్ నివాసానికి చేరుకున్నారు. అయితే, ఏసీబీ అధికారుల బృందాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు అడ్డుకున్నారు. దాంతో అక్కడ ఇరు వర్గాల మధ్య వాగ్యుద్ధం జరిగింది. ఇవాళ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలతో ఢిల్లీ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేగింది. ఈ క్రమంలో ఢిల్లీ ఎన్నికల్లో పోటీ చేసిన 70 మంది ఆప్ అభ్యర్థులు, పార్టీ నేతలు కేజ్రీవాల్ నివాసానికి చేరుకున్నారు. ఆ తర్వాత కాసేపటికి ఏసీబీ అధికారులు రావడంతో, కేజ్రీ నివాసం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు.. సీఎం రేవంత్‌పై హరీష్‌రావు ధ్వజం

మొదటి పేజి తరువాయి

విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని చెప్పారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రేవంత్ ప్రభుత్వంపై హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒకటి కాదు రెండు కాదు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వందల్లో నమోదయ్యాయని అన్నారు. వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు.అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గురుకులాల తీరు ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప కూడా దాటదు అనేందుకు గురుకులాల దీన స్థితే నిదర్శనమని అన్నారు. ఆస్పత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## రేవంత్ కేబినెట్ లోకి ఆ అయిదుగురు

ఢిల్లీలోనే ఉన్నారు. సామాజిక - ప్రాంతీయ సమీకరణాలతో కూర్పు దిశగా కసరత్తు జరుగుతోంది. రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో ముస్లిమ్ మైనారిటీ వర్గం నుంచి ఎవరు ఆమాత్యులుగా లేరు. ఈ సారి మంత్రివర్గంలో మైనారిటీ వర్గం నుంచి ఒకరికి మంత్రి పదవి దక్ ఛాన్స్ కనిపిస్తోంది. అదే విధంగా ఎస్సీ ల నుంచి మాల, మరో రెడ్డితో పాటు ఒక బీసీలకు దక్కే అవకాశాలు ఉన్నాయి. బీసీ వర్గానికి డిప్యూటీ సీఎం అంశం ప్రస్తుతం తెర మీదకు వచ్చింది. కీలక మంత్రాంగం ఇక, పీసీసీ కార్యవర్గం కూర్పులోనూ హైకమాండ్ అభిప్రాయ సేకరణ చేస్తోంది. వర్కింగ్ ప్రెసిడెం ట్స్ నియామకంలో మైనార్టీ- ఎస్సీ- ఎస్టీ సమీకరణం పరిగణలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. నామినేటెడ్ పెండింగ్ పదవులను ఖరారు చేయాలని రేవంత్ భావిస్తున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన తరువాత జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో రేవంత్ సమావేశం అయ్యే అవకాశం ఉంది. ఈ నెల 15 తరువాత స్థానిక సంస్థల ఎన్నికల పైన నిర్ణయం ఉంటుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. దీంతో, ఈ రోజు ఢిల్లీలో పార్టీ అధినాయకత్వంతో జరుగుతున్న మంత్రాంగం పార్టీ - కేబినెట్ లో కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉందని సమాచారం.

## చొరబాట్లకు యత్నించిన పాకిస్థాన్ ఉగ్రవాదులు

ఈ సందర్భంగా భారత్ లో చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు ప్రయత్నించారు. జమ్ము కశ్మీర్ లోని పూంచ్ సెక్టార్ లో కృష్ణా ఘాటి వద్ద టెర్రరిస్టుల చొరబాటు యత్నాన్ని భారత జవాన్లు భగ్నం చేశారు. ఉగ్రవాదులు చొరబడేందుకు వీలుగా భారత సైన్యం దృష్టి మరల్చేందుకు పాక్ బోర్డర్ యాక్షన్ టీమ్ (బీఏటీ) కాల్పులకు తెగబడింది. ఓ భారత సైనిక పోస్టుపై కాల్పులు జరిపింది. ఈ కాల్పులను భారత సైన్యం దీటుగా తిప్పికొట్టింది. ఈ ఘటనలోనే ఏడుగురు పాకిస్థానీలు హతమయ్యారు. మృతుల్లో పలువురు అల్ బదర్ ఉగ్రవాద గ్రూపుకు చెందిన వారు ఉన్నట్టు భావిస్తున్నారు.

## తల్లికి వందనం, రైతులకు భరోసా అమలు

నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంత్రులకు విధి విధానాల ఖరారు బాధ్యతలను అప్పగించారు. జూన్ లో తల్లికి వందనం తాజాగా జరిగిన ఏపీ మంత్రివర్గ భేటీలో సంక్షేమ పథకాల అమలు పైన చర్చ జరిగింది. అందులో భాగంగా సంక్షేమ పథకాలు హామీ ఇచ్చిన విధంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసారు. అమలు కార్యాచరణ ఖరారు చేసారు. ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న కొత్త ఆర్ధిక సంవత్సరంలో ఒక్కొక్కటిగా అమలుకు నిర్ణయించారు. జూన్ నుంచి ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం వేళ తల్లికి వందనం ఇవ్వాలని డిసైడ్ అయ్యారు. విద్యా సంవత్సరం ప్రారంభం వేళ ఈ పథకం అమలుకు నిర్ణయం తీసుకున్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఈ పథకం కింద తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ 15 వేలు చొప్పున జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు జూన్ లో ఈ పథకం అమలు చేయాలని నిర్ణయించారు. హిట్ కొట్టామనే ఆనందం నాగ చైతన్యకు ఒక్కరోజు కూడా మిగల్చలేదే..! మే లో అన్నదాత సుఖీభవ అదే విధంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతీ రైతుకు ఏటా రూ 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ నిధుల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం కింద ఇస్తున్న రూ 6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ 14వేలు కలిపి రూ 20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని తొలుత నిర్ణయించారు. నిధుల లభ్యత చూసుకొని మూడు విడతల్లో అమలు చేసే ఆలోచన పైనా చర్చ జరిగింది. అయితే, వచ్చే ఆర్ధిక సంవత్సరంలోనే ఈ పథకం కూడా అమలు చేయాలని తాజాగా నిర్ణయం తీసుకున్నారు. మే నెలలో రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం కింద నిధులు జమ కానున్నాయి. ఏప్రిల్ - మే నెలల్లో మత్స్యకార నిధులను విడుదల చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. కీలక నిర్ణయాలు రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి ఏం చేయాలన్న దానిపై కేబినెట్‌లో చర్చ తరువాత కీలక నిర్ణయం తీసుకున్నారు గతంలో ఆర్డీవో స్థాయిలోనే అప్పీల్ చేసుకునే అధికారం ఉండేదని అధికారులు వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో ఆర్డీవోను పక్కన పెట్టి డీఆర్వో కు ఆ బాధ్యతలు అప్పగించారని వెల్లడించారు. దీని కారణంగా డీఆర్వోలపై పనిఒత్తిడితో రెవెన్యూ ఫైళ్లు భారీగా పేరుకుపోతున్నాయని అభిప్రాయం వ్యక్తం అయింది. దీంతో, గతంలో మాదిరి ఆర్డీవో కే అప్పీల్ చేసుకునే అధికారాన్ని కట్టబెట్టాలని నిర్ణయించారు. టీడీపీ హయాంలో 2014-19 మధ్య నీరు-చెట్టు పనులు చేసిన టీడీపీ సానుభూతిపరుల బిల్లులు చెల్లింపుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. 2019 నాటికి ఉన్న ఇళ్ల బకాయిలు కూడా క్లియర్ చేయాలని నిర్ణయించారు.

## ట్రంప్‌తో మోదీ మీటింగ్ ఫిక్స్..

**తన పర్యటనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను మోదీ కలుసుకుంటారు.**

**రాతపూర్వకంగా స్పందిస్తాం.. రాహుల్ ఆరోపణలపై ఈసీ**


"ఫిబ్రవరి 12,13 తేదీల్లో ప్రధాని మోదీ అమెరికాలో అధికారిక పర్యటిస్తారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకరాం చేపట్టిన తర్వాత మోదీ జరుపుతున్న తొలి పర్యటన ఇది. ట్రంప్ ప్రమాణస్వీకారం అనంతరం మొదటగా కలుసుకోనున్న కొద్ది మంది ప్రపంచ నేతల్లో మోదీ ఒకరు" అని మిడియా సమావేశంలో మిస్రీ తెలిపారు. అమెరికా అధ్యక్షుడిని వచ్చేవారంలో కలుసుకునేందుకు మోదీని ఆహ్వానించినట్టు వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు ఇటీవల ప్రకటించిన క్రమంలో మోదీ పర్యటన తేదీలు ఖరారయ్యారు.



భారత ప్రధానమంత్రికి తాను ఆతిథ్యం ఇవ్వనున్నట్టు ట్రంప్ గత నెలలో ప్రకటించారు. "చాలాకాలం తర్వాత ఈరోజు ఉదయం ఫోనులో మాట్లాడాను. బహుశా ఫిబ్రవరిలో ఆయనకు శ్వేతసౌధానికి వచ్చే అవకాశం ఉంది" అని ట్రంప్ తెలిపారు. గత జనవరి 27న ట్రంప్‌తో మోదీ ఫోనులో సంభాషించారు. అంతర్జాతీయ శాంతి, భద్రత, టెక్నాలజీ-ట్రేడ్-డిఫెన్స్ రంగాల్లో అడ్వాన్స్‌డ్ కోఆపరేషన్‌కు తీసుకోవాల్సిన చర్యలపై ఉభయులూ చర్చించారు. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పెంచుకోవడంతో పాటు దేశంలోని స్కిల్డ్ వర్కర్లకు వీసాల మంజూరును సులభతరం చేయాలని ప్రధానంగా ఈ పర్యటనలో ట్రంప్ దృష్టికి మోదీ తీసుకువచ్చే అవకాశాలున్నాయి.

# కేబినెట్ పై కాదు కార్యవర్గంపై కసరత్తు

మొదటి పేజి తరువాయి



ఆ పార్టీ ముఖ్య నేతలు సైతం పేర్కొంటున్నారు. మరోవైపు మంత్రివర్గం కూర్పుపై తెలంగాణ నేతల అభిప్రాయాలను సైతం పార్టీ అధిష్టానం నేతలు సేకరిస్తున్నట్లు ఓ చర్చ అయితే జరుగుతోంది. సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమర్ రెడ్డిలతోపాటు తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు దీపాదాస్ మున్షిలతో ఆ పార్టీ అధిష్టానం ఒక్కొక్కరితో చర్చించి.. అభిప్రాయాలను సైతం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం అభిప్రాయాన్ని మాత్రమే తీసుకుందని.. కానీ ఇప్పుడే విస్తరణకు అవకాశం మాత్రం లేదంటూ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నట్లు సమాచారం.

శంషాబాద్ ఎయిర్?పోర్ట్ లో సెలబ్రిటీస్ వెయిటింగ్

ఫిబ్రవరి 06వ తేదీ సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు దీపాదాస్ మున్షీ ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అధిష్టానంతో వారు సమావేశమయ్యారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే నివేదికను సైతం ఆ పార్టీ అధిష్టానానికి అందజేసినట్లు సమాచారం. ఈ నివేదికను శాస్త్రీయంగా, సమగ్రం రూపొందించామని వివరించారు. అలాగే ఎస్సీ వర్గీకరణ అంశంపై సబ్ కమిటీ, జ్యూడిషియల్ కమిటీ ఆమోదించిన తర్వాతే.. కేబినెట్ లో ఆమోద ముద్ర వేసినట్లు పార్టీ అధిష్టానానికి వీరు సోదాహరణగా వివరించారు. ఇంకోవైపు ఎస్సీ వర్గీకరణ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. అందుకోసం లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధ్యక్షతన ఈ సభలు జరిగేలా ఆ పార్టీ నేతలు ప్రణాళిక బద్దంగా ముందుకు వెళు_న్నారు. కేబినెట్?పై కాదు కార్యవర్గంపై కసరత్తు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల ఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. ఇప్పటికే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో వారు వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ భేటీ మరి ముఖ్యంగా పీసీసీ కార్యవర్గంపై జరుగుతున్నట్లు తెలుస్తోంది.

కేబినెట్ పై కాదు కార్యవర్గంపై కసరత్తు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 07: పీసీసీ కార్యవర్గం కూర్పుపై తెలంగాణ అగ్రనేతలతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సుదీర్ఘ చర్చలు జరుపుతోన్నారు. అందులోభాగంగా రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతలతో కేసీ వేణుగోపాల్ విడివిడిగా చర్చలు జరుపుతోన్నారు. ఆ క్రమంలో ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డితో కేసీ వేణుగోపాల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీసీసీ కార్యవర్గాన్ని ఒకటి లేదా రెండో రోజుల్లో ప్రకటించే అవకాశమున్నట్లు సమాచారం. మరోవైపు పీసీసీలో నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు ఉండ వచ్చన్న కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేశాయి. వీరి నియామకాల్లో సామాజిక సమతుల్యం పాటించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నలుగురిలో ఒకరు మాదిగ, ఒకరు ముస్లిం, ఒకరు లంబాడి, ఒకరు రెడ్డి వర్గాలకు కేటాయించాలని భావిస్తున్నట్లు సమాచారం. అలాగే 15 నుంచి 20 మందిని పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించే అవకాశముంది. అదే విధంగా పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులపై కూడా నేతలు ఈ సందర్భంగా కసరత్తు చేస్తున్నారు.

అయితే ఈ సమావేశంలో కేబినెట్?లో మార్పులపై ఎలాంటి సమాలోచనలు జరపలేదని తెలుస్తోంది. ప్రస్తుతానికి మంత్రి వర్గ విస్తరణ లేదని ఆ పార్టీ ముఖ్య నేతలు సైతం పేర్కొంటున్నారు. మరోవైపు మంత్రివర్గం కూర్పుపై తెలంగాణ నేతల అభిప్రాయాలను సైతం పార్టీ అధిష్టానం నేతలు సేకరిస్తున్నట్లు ఓ చర్చ అయితే జరుగుతోంది. సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమర్ రెడ్డిలతోపాటు తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు దీపాదాస్ మున్షిలతో ఆ పార్టీ అధిష్టానం ఒక్కొక్కరితో చర్చించి.. అభిప్రాయాలను సైతం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం అభిప్రాయాన్ని మాత్రమే తీసుకుందని.. కానీ ఇప్పుడే విస్తరణకు అవకాశం మాత్రం లేదంటూ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నట్లు సమాచారం.

### శంషాబాద్ ఎయిర్?పోర్ట్ లో సెలబ్రిటీస్ వెయిటింగ్

ఫిబ్రవరి 06వ తేదీ సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు దీపాదాస్ మున్షీ ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అధిష్టానంతో వారు సమావేశమయ్యారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే నివేదికను సైతం ఆ పార్టీ అధిష్టానానికి అందజేసినట్లు సమాచారం. ఈ నివేదికను శాస్త్రీయంగా, సమగ్రం రూపొందించామని వివరించారు. అలాగే ఎస్సీ వర్గీకరణ అంశంపై సబ్ కమిటీ, జ్యూడిషియల్ కమిటీ ఆమోదించిన తర్వాతే.. కేబినెట్ లో ఆమోద ముద్ర వేసినట్లు పార్టీ అధిష్టానానికి వీరు సోదాహరణగా వివరించారు. ఇంకోవైపు ఎస్సీ వర్గీకరణ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. అందుకోసం లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధ్యక్షతన ఈ సభలు జరిగేలా ఆ పార్టీ నేతలు ప్రణాళిక బద్దంగా ముందుకు వెళు_న్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదు: కేటీఆర్ ఆగ్రహం..

మొదటి పేజి తరువాయి

ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదని ధ్వజమెత్తారు. ఢిల్లీకి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ చిన్నపిల్లలకు భోజనం అందించడంలో సీఎంకు లేదంటూ విమర్శించారు. ఇదేనా ప్రజాపాలన అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎద్దేవా చేశారు.

**అసలు విషయం ఇదే..**


కాగా, మహబాబ్‌నగర్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం నాచారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అందించడం లేదంటూ పలు వార్తపత్రికలు ప్రచురించాయి. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికలకు వివాదం తలెత్తడంతో పిల్లలకు అన్నం పెద్దలేదన్న వార్తలు వెలువడ్డాయి. కొన్ని నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులకు కార్మికులు అరకొరగా భోజనం అందిస్తున్నారు. కొన్ని రోజులుగా ఆహారం నాణ్యతా లోపించడంతో వారి పస్తులు ఉంటూ తిరిగి ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నారు. మరోవైపు నిన్న(శుక్రవారం) పాఠశాల ప్రిన్సిపల్, మధ్యాహ్న భోజన కార్మికులకు మధ్య వివాదం నెలకొంది. దీంతో విద్యార్థులకు నిన్న భోజనం అందించలేదు. దీనిపై చిన్నారులు తమ తల్లిదండ్రులకు విషయం చెప్పగా ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న డీఈవో నేరుగా పాఠశాల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ప్రిన్సిపల్, వంట ఏజెన్సీ కార్మికలపై సీరియస్ అయ్యారు. దీనికి సంబంధించిన వార్తా పత్రికల క్లిపింగులను కేటీఆర్ తన ట్వీట్‌కు జత చేశారు.

కేటీఆర్ ట్వీట్..

అమృత్ స్కీమ్‌ను అప్పనంగా బామ్మర్దికి కట్టబెట్టడంలో ఉన్న తెలివి, బుక్కెడు బువ్వకు అలమటిస్తున్న పసిపిల్లల కడుపు నింపడంలో లేదా?. పారిశ్రామికవేత్త అదానీకి తెలంగాణ వనరులు దోచిపెట్టడంలో ఉన్న శ్రద్ధ.. ప్రభుత్వ పాఠశాలల దీనస్థితిపై లేదా?. మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు కట్టి ఢిల్లీకి కట్టలు పంపడంలో ఉన్న ప్రేమ.. భవిష్యత్ భారతావని వారసులైన పసిపిల్లల ఆకలి కేకలపై లేదా?. మంత్రుల సంగతి దేవుడెరుగు, ముఖ్యమంత్రి ఇలాకాలోనే పిల్లల పస్తులు ఉంటున్నారు. మీ ఢిల్లీ బాసులు.. మీ గల్లీ దోస్తుల ఆకలి తీర్చడం కాదు రేవంత్.. ముందు మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టు. ఒక్కపూట ఫొటోలకు ఫోజులిచ్చి గప్పాలు కొట్టడం కాదు. నిత్యం గుప్పెడు అన్నం అందుతుందో లేదో సమీక్ష చేసి చూడు. ఇది ప్రజాపాలన కాదు.. ప్రజలను వేధించే పాలన" అంటూ ట్వీట్ చేశారు.

## అదే నేను విశ్వసిస్తా... టీం స్పిరిట్‌తో పనిచేయండన్న సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి






గాడిలో పెట్టేందుకు యశక్తులా కష్టపడుతున్నామన్నారు. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు వంటి పథకాలతో సంక్షేమం అమలు చేస్తూనే... మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సాధనతో అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నామన్నారు. ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. అయితే ఈ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు.

### ఎవరినీ తక్కువ చేయం...

"టీమ్ వర్క్‌గా పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని నేను విశ్వసిస్తాను. అసాధారణ, వేగవంతమైన పనితీరు చూపితే తప్ప... విధ్వంస రాష్ట్రంలో పునర్నిర్మాణ ఫలితాలను ప్రజలకు చూపలేం. అందుకే ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరు టీం స్పిరిట్‌తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే మా ఆలోచన. అందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చాం. దస్త్రాల పరిష్కారంలో నిన్న విడుదల చేసిన ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి కాదు.. ఎవరినీ తక్కువ చేయడానికి కాదు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడటంతో పాటు, ఒకరితో ఒకరు పోటీ పడి పనిచేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నమే ఇది. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో నేను కూడా నా స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉంది 'పీపుల్ ఫస్ట్' విధానంతో నేను, నా కేబినెట్ సహచర మంత్రులంతా పనిచేస్తున్నాము. లక్ష్యాల సాధనకు అడుగులు వేస్తున్నాము. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగి నుంచి సీఎం వరకు అంతా కష్టపడి సమిష్టిగా పనిచేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి... సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలం. ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో శాఖల్లో అత్యున్నత ప్రతిభ చూపిస్తారని ఆశిస్తున్నాను" అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

### మంత్రులకు ర్యాంకులు...

కాగా.. నిన్న ఏపీ కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో సీఎం చంద్రబాబు విడిగా సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రుల ఫైల్స్ క్లియరెన్స్‌పై పెర్ఫార్మెన్స్‌ను సీఎం చదివి వినిపించారు. అలాగే ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు ప్రకటించారు. ఏ మంత్రికి ఏ ర్యాంక్ వచ్చింది.. చివరగా ర్యాంక్ ఎవరికి వచ్చిందనే వివరాలను తెలిపారు సీఎం. మొదటి స్థానంలో ఎన్ఎండీ ఫరూఖ్ ఉండగా.. చివరి స్థానంలో మంత్రి వాసంశెట్టి శుభాష్. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరవ స్థానంలో నిలిచారు. ఇక కందుల దుర్గేష్ 2వ స్థానం, కొండపల్లి శ్రీనివాస్ 3వ స్థానం, నాదెండ్ల మనోహర్ 4వ స్థానం, డోలా బాల వీరాంజనేయులు 5వ స్థానం, సీఎం చంద్రబాబు 6వ స్థానం, సత్యకుమార్ 7వ స్థానం, లోకేష్ 8వ స్థానం, బీసీ జనార్థన్ రెడ్డి 9వ స్థానం, పవన్ కల్యాణ్ 10వ స్థానం, సవిత 11వ స్థానం, కొల్లు రవీంద్ర 12వ స్థానం, గొట్టిపాటి రవికుమార్ 13వ స్థానం, నారాయణ 14వ స్థానం, టీజీ భరత్ 15వ స్థానం, ఆనం రాంనారాయణరెడ్డి 16వ స్థానం, అచ్చెన్నాయుడు 17వ స్థానం, రాంప్రసాద్ రెడ్డి 18వ స్థానం, గుమ్మడి సంధ్యారాణి 19వ స్థానం, వంగలపూడి అనిత 20వ స్థానం, అనగాని సత్యప్రసాద్ 21వ స్థానం, నిమ్మల రామానాయుడు 22వ స్థానం, కొలుసు పార్థసారథి 23వ స్థానం, పయ్యావుల కేశవ్ 24వ స్థానంలో ఉండగా.. ఇక చివరి 25వ స్థానంలో వాసంశెట్టి సుభాష్ నిలిచారు.

# జగన్‌కి ఊహించని షాక్.. ఆ ఐదుగురు జంప్ !

మొదటి పేజి తరువాయి



పరిణామాలను సైతం వారు పరిశీలించి ఆచీ తూచీ అడుగులు వేసేందుకు ఆ ఐదుగురు.. తమ తమ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని ప్రచారం సైతం సాగుతోంది. అదీకాక వై నాట్175 ? అంటూ అధికారంలో ఉండగా వైసీపీ అధినేత వైఎస్ జగన్.. తన పార్టీ శ్రేణులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ కేవలం 11 సీట్లు మాత్రమే దక్కించుకొంది. దీంతో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా సైతం దక్కలేదు. ఈ హోదా కేటాయించాలంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. స్పీకర్ కు లేఖ రాశారు. కానీ సంఖ్య బలం లేదంటూ స్పీకర్ స్పష్టం చేయడంతో.. వైఎస్ జగన్ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు.

### కేబినెట్?పై కాదు కార్యవర్గంపై కసరత్తు

దీంతో గత ఎన్నికల్లో ఓటమి పాలై ఇంట్లో ఉన్న వారికి గెలిచి అసెంబ్లీకి వెళ్లలేక ఇంట్లో ఉండే తమకు ఏ మాత్రం తేడా లేకుండా పోయిందంటూ వైసీపీలోని పలువురు ఎమ్మెల్యేలు కేడర్ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో పార్టీకి రాజీనామా చేయాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. మరోవైపు వైసీపీ ఎమ్మెల్సీలంతా శాసన మండలికి వెళ్తున్నారు. కానీ మన పరిస్థితి ఏమిటని వారు ఒకరినొకరు ప్రశ్నించుకొంటున్నట్లు సమాచారం.

### 100 మంది అమ్మాయిలు.. రూ.333 కోట్లు..

### బత్తుల టార్గెట్ తెలిస్తే దిమ్మ తిరగాల్సిందే

ఈ ఎన్నికల ముందే కాదు.. ఆ తర్వాత సైతం.. అంటే పార్టీ ఓటమితో పలువురు కీలక నేతలు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్యలు తమ రాజ్యసభ స్థానాలకే కాదు... పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు. ఇక వైఎస్ జగన్ కు అత్యంత నమ్మకస్తుడైన విజయసాయిరెడ్డి సైతం పార్టీకే కాదు.. రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పేశారు. ఇలా చెప్పుకొంటూ పోతే.. చాలా మందే వైసీపీని అధికారికంగా, అనధికారికంగా రాజీనామాలే కాదు.. దూరంగా ఉంటున్నారు. దీంతో పార్టీలో కేడర్ కు దిశా నిర్దేశం చేసే నాయకులే లేకుండా పోయారు. ఇటువంటి వేళ.. భవిష్యత్తులో రాజకీయాల్లో మనగలగాలంటే.. వైసీపీకి గుడ్ బై చెప్పడం ద్వారా అసెంబ్లీలో అడుగు పెట్టాలనే భావనలో ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏదీ ఏమైనా ఈ శివరాత్రి నాటికి వీరంత తమ నిర్ణయాన్ని ప్రకటిస్తారనే చర్చ సైతం ఊపందుకొంది.

# చదువు అందరికీ తరగనీ గని - డాక్టర్ అంజయ్య



కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల మునుగోడులో





జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొంపల్లిలో



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పలివెలలో

**మునుగోడు, ఫిబ్రవరి 7, తెలంగాణ సేన న్యూస్ :** ప్రతి ఒక్కరికి తమ జీవితానికి చదువు అనేది అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నదని, విద్య తరగతి గని వంటిదని ప్రముఖ ఎముకల వైద్యులు డా. అంజయ్య అన్నారు. శుక్రవారం మునుగోడు మండలంలోని కొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మునుగోడు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పలివెలలో పదవ తరగతి విద్యార్థులకు పి ఆర్ ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులకు లాస్ట్ మినిట్ రివిజన్ బుక్ పరీక్షలకు ఉపయోగపడే విధంగా పి ఆర్ ఆర్ ఫౌండేషన్ స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో గత స్మృతులను గుర్తు చేసుకుని అవకాశాన్ని కల్పించిన పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావు కు ప్రత్యేక ధన్యవాదాలు నేడు బాబాసాహెబ్ అంబేద్కర్ గారి సతీమణి అయిన రామా బాయ్ జయంతి సందర్భంగా జ్ఞానం వర్ధిల్లాలని విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజికంగా చైతన్యం చేస్తూ విద్యతో పాటు సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని మార్పు దిశగా ప్రయత్నం చేస్తున్న పాండురంగారావు కృషి అభినందనీయమని ఆయన ప్రశంసించారు. నేటి సమాజంలో కోట్ల రూపాయలు సంపాదించి విలాసవంతమైన జీవితం గడిపేవారు చాలామంది ఉన్నారు కానీ సొసైటీ కోసం విద్యార్థులకు జ్ఞానం కోసం సమాజ మార్పు కోసం ప్రయత్నించే వారు అరుదుగా ఉంటారు అందులో పి ఆర్ ఆర్ చైర్మన్ చేల్లం పాండురంగారావు ముందు వరుసలో ఉంటారని ఆయన కొనియాడారు. కొంపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పలివెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి మాట్లాడిన సందర్భంగా వారిలో చురుకుదనం నైపుణ్యత చాలా కనిపించాయని వారికోసం భవిష్యత్తులో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పరోక్షంగా మా సాయి సంజీవని హాస్పిటల్ పాత్ర వైద్యంతో పాటు విద్యారంగంలో కూడా ఉంటుందని ఆయన అన్నారు. పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి విద్యాభివృద్ధికి నా వంతుగా తోడ్పాటునందించాలని లక్ష్యంతో డబ్బులు ఉన్న లేకున్నా ఎలాంటి ఆస్తులు లేకుండా ఒక ఆశయం కోసం పని చేస్తే ఖచ్చితంగా ఆశయం నెరవేరే విధంగా ఉంటుందని విద్యార్థులకు అందించిన మెటీరియల్ ద్వారా వచ్చిన స్పందన ద్వారా నాకు రెట్టింపు ఉత్సవం కలుగుతుందని ఈ సంవత్సరం కూడా నల్గొండ రంగారెడ్డి మేడ్చల్ హైదరాబాద్ జిల్లాలలో సుమారు 3000 పైగా మెటీరియల్ అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు సాయి సంజీవని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అంజయ్య ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావు ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గండికోట రాజేష్ చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్ నారాయణ ఎండి రఫీ రేణుక దత్తీశ్వర్ యాదయ్య వెంకటేశ్వర్లు సంజీవ ఆంజనేయులు గిరి తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర కలిగిన ఆలయ పునర్నిర్మాణం



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** పట్టణ యందు ఈరోజు భూనీలా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం నర్సంపేట యందు ఆలయ చైర్మన్ ఎర్ర జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పునః నిర్మాణ శంకుస్థాపన ఏర్పాటు చేయగా అర్చకులు ముడుంబై వంశస్థులు కృష్ణమాచార్యులు వెంకటాచార్యులు మాధవాచార్యులు రామానుజా చార్యులు గ్రానైట్ కళశంతో కలుషాభిషేకంలో జ్యోతి ప్రశ్నలు వెలిగిస్తూ పసుపు కుంకుమ పువ్వులు పాలు పెరుగు నెయ్యి చక్ర కనక అభిషేకా పలు అభిషేకాలు చేయగా పూర్వ గర్భ గుడి ఎదురుగా 9 ఫీట్ల భూగర్భంలో తాంత్రిక పూజా విధానంలో అలంకరించిన వెండి ప్లేటు పలు యంత్రాలతో సిబ్బందించగా భూ సమర్పణ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాట్లాడుతూ 1979 లో నిర్మించిన వెంకటేశ్వర స్వామి దేవస్థానము పునర్నిర్మాణం ముడుంబై రంగాచార్యులు పుర ప్రముఖులు డాక్టర్ ఉపేందర్ రావు వారి కమిటీ బృందం చేత 1979 లో పునః ప్రతిష్ట చేశారు అప్పటినుండి ఆలయము దినదిన ప్రవర్తమానముగా స్వామివారికి అన్ని రకాలుగా కార్యక్రమాలు జరుగుతూ అధ్యయన బ్రహ్మోత్సవాలు చేస్తూ నిత్య కళ్యాణం పచ్చుతరణంగా నాలుగు దశబ్దలపై ముడుంబై వంశస్థులు దేవాలయాన్ని కనుల పండుగగా అర్చకత్వం చేస్తూ కానీ కాకరమైన దేవాలయం పక్కన ఉన్నటువంటి వీధుల కంటే లోపటికి అవడం వలన ఆలయం కూడా జీర్ణం అవడం వలన తిరిగి ఆలయాన్ని పునర్నిర్మానం చేయాలని సంకల్పం చేసుకున్నాము నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి కృషితో ప్రభుత్వ నిధులు కేటాయించగా ఒక్కరోజు పది లక్షల నగదు రూపలతో దాతలు సహకరించగా మూడు కోట్ల రూపాయల నిధితో 07 ఫిబ్రవరి 2025 శుక్రవారం రోజున దివ్య ముహూర్తం ఉదయం 11 26 నిమిషాలకి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన ముహూర్తమును ఆలయం కిక్కిరిసిపోగా భక్తుల సమూహంలో వెంకటేశ్వర స్వామి కీర్తనలతో ఘనంగా జరపడం జరిగింది ఈరోజు శంకుస్థాపన సందర్భంగా కమిటీ సభ్యులు 2010 నుండి చైర్మన్ ఎర్ర జగన్మోహన్ రెడ్డి వారి బృందం సంపత్ ముడుంబై వంశస్థులు అనువంశిక అర్చకులు కృష్ణమాచార్యులు వెంకటాచార్యులు మాధవాచార్యులు రామానుజాచార్యులు ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని వేద పండితులైన శ్రీధర్ ఆచార్యులు సంతోష్ కుమార్ ఆచార్యులు వేదమంత్ర పట్టణముతో ఈ కార్యక్రమాన్ని మహా వైభవముగా శంకుస్థాపన కార్యక్రమాన్ని పూర్తి చేశారు దీనిలో భాగంగా ఈరోజు ఆలయ నిర్మాణంలో దాతలుగా ముందుకు వచ్చారు స్వామి వారి ఆలయపున నిర్మాణ లో భాగంగా పూర్వ ప్రముఖులు భక్తులు ఆలయానికి స్థలదాతలుగా ఆలయ నిర్మాణానికి ద్రవ్య దాతలుగా నిలిచి వారి యొక్క సంకల్పాన్ని చెప్పి భగవంతుని కృపకు పాత్రులవుతున్నారు వారందరికీ కూడా ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు ఆ తర్వాత కార్యక్రమంలో మహా అన్నప్రసాదం వితరణ జరిగినది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎర్ర జగన్ మోహన్ రెడ్డి దుబ్బా రమేష్ వేమిశెట్టి శ్రీనివాస్ వీరమనేని వెంకటేశ్వరరావుబండారి దామోదర్ దంపతులుగా మరియు శింగిరికొండ కొండ రవీందర్ చింతల నిరంజన్ రామగొని సుధాకర్ బాల్నేసర్వేశం రేమిడి కట్టయ్య అర్చకులు ముడుంబై కృష్ణమా చార్యులు వెంకటాచార్యులు మాధవాచార్యులు రామానుజా చార్యులు పాలాయి శ్రీనివాస్ ఎర్ర యాకోబు రెడ్డి నల్ల మనోహర్ రెడ్డి తక్కలపల్లి రవీంద్రరావు వేముల సాంబయ్య గౌడ్ ఓర్స్ తిరుపతి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పరివార బృందాలు డాక్టర్ అంద్రు రాజేంద్రప్రసాద్ రెడ్డి అయ్యప్ప దేవాలయ, శివాంజనేయ వేణుగోపాల వెంకటేశ్వర స్వామి ద్వారక పేట ఆలయాల చైర్మన్లు శింగిరికొండ కొండ మాధవశంకర్ గుప్తా నల్ల మనోహర్ రెడ్డి గంధం నరేందర్ గుప్తా సైఫా సురేష్ చింతల కమలాకర్ రెడ్డి చెకులం కృష్ణమూర్తి ఇరుకుల్ల వీరలింగం బృందం భక్తులు మహిళలు వృద్ధులు, విద్యార్థిని విద్యార్థులు ప్రముఖ వ్యాపారవేత్తలు పలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# ఆరు గ్యారంటీ అమలు కోసం చర్లలో ప్రెస్ మీట్

## న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మధు

**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ :** కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కారు అధికారంలోకొచ్చే ముందు ఆరు గ్యారంటీలను ప్రజలకు ఇచ్చింది, అధికారంలోకి వచ్చిన 100 రోజులల్లో ప్రకటించింది ఈ ఆరు గారంటీని అమలు చేస్తానని చెప్పి ప్రకటించింది ఇందులో ఏ ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఇంటింట సౌభాగ్యం అంటూ తెలంగాణ ప్రజానీకానికి పాటించిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు చేసిన వాగ్దానాలు సంవత్సరంకు పైగా అవుతున్న ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు తయారైంది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు 15000 ఇస్తానని ఇది అమలు చేయలేదు పంట రుణాలను సగం మందికి ఇచ్చి చేతులు కౌలు రైతులకు రైతు హక్కులను గుర్తించి అమలు చేస్తానని చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కింది ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తానని ఏ ఒక్క చోట కూడా అమలు చేయలేదు పేదవాడికి వైద్యం అందించడంలో వైపర్యత చెందింది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2500 ప్రకటించింది అమలు చేయలేదు యువ వికాసం పేరిట విద్యార్థులకు ఇస్తామన్న 5 లక్షల విద్యా భరోసా కార్డు భరోసా పథకాన్ని వెంటనే ప్రారంభించడంలో వైఫల్యత చెందిందన్నారు. రాజు ఆరోగ్యశ్రీ పథకం అంతట అమలు చేస్తానని చేసిన వాగ్దానాన్ని తుంగలో తొక్కి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వడంలో పూర్తి చెందింది. ఆరు గారంటీలతోపాటు ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతానని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది ఈ 6 గ్యారంటీ అమలుకై సిపిఐ ఎంఎల్





న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ చలో హైదరాబాద్ ఈనెల 20న కదిలి రమ్మని ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా ఈ ప్రెస్ మీట్ నిర్వహించాం హైదరాబాద్ కార్యక్రమం జయప్రదం కోరుతూ ఈనెల 11న వ్యక్తిగత దరఖాస్తుల తోని చర్ల ఎమ్మార్వో ఆఫీస్ కి కదిరావాల్సిందిగా ప్రజల్ని కోరుతున్నామని ఈ ప్రెస్ మీట్ లో పాల్గొన్న డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 15 లక్షలకు ఐదు ఇచ్చినప్పుడు 30లక్షలకు ఎన్ని ఇవ్వాలి

## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** 15లక్షలకు ఐదు ఇచ్చినప్పుడు 30లక్షలకు ఎన్ని ఇవ్వాలి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 11 శాతం రాకపోతే ఏ లెక్క ప్రకారం 9 శాతం ఇచ్చారో చెప్పాల్సిన అవసరం ఉంది అని తెలిపారు. దళిత జనాభాలో మొదటి వరుసలో మదిగలున్నారు . ఆ తర్వాత మాల, నెక్స్ట్ నేతకానిలున్నారు. A, b ,c d లుగా ఉన్న దాన్ని a, b, c లుగా మార్చారు.. దళితుల జనాభా 4 వ అతిపెద్ద బుగడ జంగ్గలకు అన్యాయం..ఇది కుట్ర బుద్ధి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దరెండు కులాలు కలిస్తే 1లక్ష 65 వేలు, ఇంకో ఒక కులం కలిపితే 2లక్షలు అవుతారు. B గ్రూప్ లో మహారాష్ట్ర కి సంభందించిన రెండు కులాలు ఉంటాయి. రిజర్వేషన్ ఫలాలు మాలలే దోచుకుంటున్నారు. శాసనసభలో ఎవరైతే వర్గీకరణను వ్యతిరే





కిస్తున్నారో మరి నా నేతకని వర్గానికి ప్రత్యేక గుర్తింపు కోరడం లేదు అని తెలిపారు. మొదటి గ్రూప్ లో 15కులాల్లో 13 కులాలు బలహీన కులాలు అని కమిషన్ ని ప్రభావితం చేసే విధంగా ఉంది అన్నారు. నా నేతకానిలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడం లో ప్రభుత్వం మెడలు వంచి అయిన నా సాయశక్తుల ప్రయత్నం చేస్తా అని, ఈ విషయం లో సబ్ కమిటీ చైర్మన్ నీ కలిసి మా విజ్ఞాపులు, ప్రతిపాదనలు పెడతాము అని చెప్పారు. అందరి ఆకాంక్షలను గౌరవించే వ్యక్తిగా ముందుకు పోతానని, నిన్నటి వరకు వర్గీకరణను వ్యతిరేకించే వారే ఈ రోజు కుట్ర చేస్తున్నారు. వర్గీకరణను వ్యతిరే కించే ఏ పార్టీకి తెలంగాణ లో మనుగడ ఉండదు. వర్గీకరణ పోరాటాన్ని అణిచివేసే కుట్ర జరుగుతోంది. దాడులు చేసినోళ్ళు , హత్యలు చేసిన వాళ్ళు , మీసాలు మెలేసి నోళ్ళు, వర్గీకరణ కోరితే తొక్కుకుంట పోతం అన్న వాళ్ళు క్షమాపణ చెప్పాలి. ఏడ పడుకున్నారు దళిత లీడర్స్...మేము చేసే పోరాటం న్యాయం అని సుప్రీం కోర్టు ఒప్పుకుంటే లీడర్స్ ఎందుకు ఇండ్ల పడుకుంటారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా దళితుల్లో 3వ అతిపెద్ద కులం అయిన నేతకనీలకు అన్యాయం జరగకుండా చూస్తా అని తెలిపారు.

# కన్నాయిగూడెం బ్యాంకు నిర్మాణం చెయ్యాలని కలెక్టర్ ను కలిసిన బీజేపీ నేతలు



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ :** కన్నాయిగూడెం : ఫిబ్రవరి 7 శుక్రవారం రోజున కన్నాయిగూడెం బీజేపీ అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క ఆధ్వర్యంలో కన్నాయిగూడెం మండలకేంద్రంలో బ్యాంక్ నిర్మాణం చేసి రైతులకు సేవలు అందేవిదంగా చూడాలని కలువడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి డా జాడి రామరాజునేత మాట్లాడుతూ కన్నాయిగూడెం మండలం లో బ్యాంకు లేక పోవడం వలన ఆదివాసీ దళిత బహుజన వర్గాల రైతులు అనేక ఇబ్బందులకు గురిఅవుతున్నారని అన్నారు. అదేవిదంగా గతం లో 1992ముందు కన్నాయిగూడెం లో ఉన్నా బ్యాంక్ ను భద్రత కారణం తో ఏటూరునాగారం మండలకేంద్రానికి తరలించి నాటి నుండి నేటి వరకు కన్నాయిగూడెం మండలప్రజలకు బ్యాంకు సేవలు అందిస్తున్నారాని అన్నారు కానీ కన్నాయిగూడెం మండలప్రజలు 40 కిలోమీటర్లు నుండి వస్తే ఏటూరునాగారం బ్రాంచి లో నెట్వర్క్ లేకుండ ఉంటే15 రోజులు బ్యాంకు చుట్టూ తిరగడం వలన అనేక ఇబ్బందులకు గురివుతున్నారు. కాబట్టి కన్నాయిగూడెం మండలకేంద్రం బ్యాంకు నిర్మాణం ఆదివాసీ దళిత బహుజన వర్గాల ప్రజలకు రైతులకు అందేవిదంగా చూడాలని సబ్ కలెక్టర్ మహేందర్ జి కీ మెమో రెండం ఇవ్వడం జరిగిందన్నారు. సబ్ కలెక్టర్ సాను కులాంగాస్పందించి కన్నాయిగూడెం మండలం లో త్వరలోనే బ్యాంకు సేవలు అందేవిదంగా చూస్తామని చూస్తామని హామీయిచ్చారని తెలిపారు. ఈ సమావేశం లో మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి సత్యం, మహిళా మోర్చా అధ్యక్షురాలు పానుగంటి సంగీత, యువమోర్చా అధ్యక్షులు జనగాం ఆనంద్ పాల్గొన్నారు.


# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం - సుఖేందర్ రెడ్డి



**తెలంగాణ సేన :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని తాజా మాజీ సర్పంచ్ సుఖేందర్ రెడ్డి అన్నారు శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశలవారీగా నెరవేరుస్తూ, ప్రజాదరణ పొందుతూ, ప్రజా పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ మీద ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నాయి అని, కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అన్ని, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేపించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

# మున్సిపల్ కార్మికులకు ప్రొఫెషనల్ టాక్సీ (వృత్తి పన్ను) రద్దు చేయాలి

## BRTU వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల వేతనాల్లో కోత పెడుతున్న ప్రొఫెషనల్ టాక్స్ రద్దు చేయాలని BRTU జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. ఈ రోజు తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (BRTU అనుబంధ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట లిమున్సిపల్ ఆర్ ఐ సంపత్ కుమార్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ నాగరాజు గార్లకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బి.ఆర్.టి.యు జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో దళిత బహుజన బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనులు చేస్తున్నారని వారి దగ్గర నుండి ప్రొఫెషనల్ టాక్స్ వసూలు చేయడం ములిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ఉందని అన్నారు 15 వేల నుండి 20 వేల మధ్య వేతనం తీసుకునే కార్మికుడు దగ్గర నుండి నెలకు 150 రూపాయలు, 20వేల పైగా తీసుకునే కార్మికుల దగ్గర నుండి నెలకు 200 రూపాయలు చొప్పున వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం సమ్మయ్య, కార్మికులు గజ్జెల మహేందర్, అలువాల రాజు, మాదాసి ప్రవీణ్, పుట్టపాక రవీందర్, కొల్లూరి రంజిత్, గౌతం, పుష్ప ,కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.


# కెనాల్ ద్వారా నీటిని వెంటనే విడుదల చేయాలి

## శ్రీరామ్ కనకరాజు



**తెలంగాణ సేన :** కొండపోచమ్మ రిజర్వాయర్ నుండి సంగారెడ్డి వెళ్లే కెనాల్ కు నీటిని వెంటనే విడుదల చేయాలని సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన బిజెపి యువ నాయకుడు శ్రీరామ్ కనకరాజు అన్నారు శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామంలో కెనాల్ వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన బిజెపి గ్రామ శాఖ బూత్ అధ్యక్షుడు శ్రీరామ్ కనకరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాం లో కొండ పోచమ్మ జలాశయం నుండి కెనాల్ ద్వారా చెరువులు, కుంటలు నింపడం వల్ల భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగి, పంటలు బాగా పండాయని. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కెనాల్ ద్వారా నీరు విడుదల చేయక పోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి రైతులకు నష్టం వాటిల్లుతుందని, రైతు బాగుంటే దేశం బాగుంటుందని కాంగ్రెస్ ప్రభుత్వం కొండ పోచమ్మ జలాశయం నుండి సంగారెడ్డి వెళ్లే కెనాల్ కు వాటర్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలలో పోచయ్య, రమేష్, కిష్టయ్య,కళ్యాణ్,రైతులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పలు శుభకార్యాలకు హాజరైన మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ :** మండలం లోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన ములుగు సహకార సంఘం వైస్ చైర్మన్ మర్రి రాజు గారి కూతురి కర్ణ వేదన కార్యక్రమానికి అదే విధంగా జంగాల పల్లి లో రెడ్ మిక్స్ ప్లాంట్ ను ప్రారంభించిన మంత్రి వర్యులు సీతక్క. గోవిందరావుపేట గార్డెన్ లో సమ్మిరెడ్డి కూతురి వివాహానికి, ఏటూరునాగారం యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బండారి లక్ష్మణ్ బాబు (లక్కీ) వివాహానికి హాజరై నూతన వదు వరులను ఆశీర్వదించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా అవసరం

## టీఎస్ జేయు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచిత ప్రమాద బీమా పత్రాలు అందజేత

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ :** ములుగు : ఫిబ్రవరి 7 టీ.ఎస్.జే.యు రాష్ట్ర అధ్యక్షుడు నారగోని పురుషోత్తం గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ టీఎస్ జేయు యూనియన్ సభ్యులందరికీ ఐదు లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అందజేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో దీనికి సంబంధించిన బీమా పత్రాలను జిల్లా కలెక్టర్ సత్య శారదా చేతుల మీదుగా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. టీఎస్ జెయు ఆధ్వర్యంలో జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా కల్పించడం నిజంగా అభినందించదగ్గ విషయం అని అన్నారు. కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం గౌడ్ నారగోని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల నరేష్, జిల్లా అధ్యక్షులు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి, ఉపాధ్యక్షులు లింగబత్తిని కృష్ణ, కందికొండ గంగరాజు, ఈద శ్రీనాథ్, బత్తుల సత్యం, వల్లెపు భాగ్యరాజ్ సభ్యులు కౌడగాని మోహన్ రావు, నీరుటి శ్రీహరి, అడుప అశోక్, మంతెన సురేష్, అవినాష్, బొక్క రాజు తదితరులు పాల్గొన్నారు.

# నన్ను చంపేస్తారేమో.. ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

**మహబూబ్ నగర్, తెలంగాణ సేన న్యూస్ :** మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు ఆ పెద్దవాళ్లు నన్ను చంపేస్తా రేమో. జడ్చర్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రైతుల కోసం నేను పోరాటం చేస్తున్నన్నారు. ఖైదీ నెంబర్ 150 సినిమాలో రైతుల భూములు ధనవంతులు లాక్కుంటారు. దానిపైన కొట్లాడిన హీరో చిరంజీవి పైన తప్పుడు ఆరోపణలు చేసి జైలుకు పంపిస్తారు. నా పైన అలాంటి ఆరోపణలే వస్తూ వస్తున్నాయన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుక్స్,పెన్నులు పంపిణీ



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం అంగడి కిష్టపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ప్రముఖ వ్యాపారవేత్త కళ్లెపు నవీన్ రావు,బి ఆర్ ఎస్ యువ నాయకుడు చెప్యాల రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో బుక్స్,పెన్నులు పంపిణీ చేశారు అనంతరం వారు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని విద్యార్థిని విద్యార్థులకు బుక్ మెటీరియల్ అందజేయడం జరిగిందని విద్యార్థిని విద్యార్థులు చిన్ననాటి నుంచి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, గ్రామానికి తల్లి తండ్రులకు మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ లక్ష్మి రాములు గౌడ్,పాఠశాల చైర్మన్ బాలరెడ్డి,పాఠశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ సేన



# కాలం ముందుకే వెనక్కే


ఇన్ఫోగ్రాఫిక్





మానవాళి దైనందిన జీవితం అంతా సూర్య గమనం మీదే ఆధారపడి ఉంది. తూర్పు కనుమల్లో సూర్యుడు ఉదయించింది మొదలు పడమటి కోనలోకి జారుకునే వరకు మానవాళి జాగృతమై ఉంటుంది. అయితే సూర్యోదయం, అస్తమయం, రాత్రి, పగటి వేళలు ఒక్కోదేశంలో ఒక్కోరకంగా ఉంటాయి. ప్రాంతాలను బట్టి వీటిల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. సూర్యుడి శక్తిని సంపూర్ణంగా వినియోగించుకోవాలనే లక్ష్యంతో కొన్ని దేశాల్లో గడియారంలో కాలాన్ని ముందుకీ, వెనక్కీ మార్చేస్తుంటాయి. దాన్నే 'డే లైట్ సేవింగ్ టైమ్' అని పిలుస్తుంటారు. అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా సుమారు 72 దేశాలు ఈ 'డే లైట్ సేవింగ్ టైమ్' విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రతి సంవత్సరం వేసవిలో ఈ దేశాల వాళ్లు గంట ముందుంటారు. మళ్లీ శీతకాలం ప్రారంభంలో మళ్లీ యథాప్రకారం కాలాన్ని సెట్ చేసుకుంటారు. అమెరికాలో మార్చి నెల రెండో ఆదివారం అర్ధరాత్రి 1.59.59 గంటల తర్వాత రెండు గంటలు కాకుండా గడియారంలో సమయాన్ని 3 గంటలుగా మారుస్తారు. అలా ఒక గంట సమయాన్ని ముందుకు జరుపుతారు. మళ్లీ నవంబర్ మాసం మొదటి ఆదివారం 1.59.59 గంటల తర్వాత సమయాన్ని మళ్లీ ఒంటిగంటకు సెట్ చేస్తారు. డే లైట్ సేవింగ్ టైమ్ విధానాన్ని అనుసరిస్తున్న దేశాలన్నీ కాస్త అటూఇటూగా ఇదే నెలల్లో సమయాన్ని ముందుకీ, వెనక్కీ జరుపుతుంటాయి. గడియారాల్లో మాన్యువల్‌గా సమయాన్ని మారుస్తారు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్ లాంటి పరికరాల్లో టైమ్ ఆటోమేటిక్‌గా మారిపోతుంది. ప్రజలు పగటి సమయాన్ని, సూర్యకాంతిని విస్తృతంగా ఉపయోగించుకోవాలని ఆయాదేశాలు ఈ విధానాన్ని పాటిస్తున్నాయి. సాధారణంగా ఉద్యోగులు, కార్మికులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తారు. వేసవిలో సమయాన్ని గంట ముందుకు జరపడం వల్ల ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పని చేసి తొందరగా ఇంటికి వెళ్తారు (గడియారం పరంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు). సాయంత్రం ఇంకా వెలుగు ఉంటుంది కాబట్టి కుటుంబంతో బయటికి విహారానికి వెళ్తారు. తద్వారా ఇండ్లలో విద్యుత్ వినియోగం తగ్గుతుంది. అలాగే సాయంత్రం వేళ విహారానికి వెళ్లే కుటుంబాల వల్ల మార్కెట్‌లో కొనుగోళ్లు పెరుగుతాయి. అలా ఆర్థిక వ్యవస్థ కూడా మెరుగవుతుంది. ఈ ఉద్దేశంతోనే పలు దేశాలు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. 1895 సంవత్సరంలో జార్జ్ హడ్సన్ అనే శాస్త్రవేత్త ఈ విధానాన్ని ప్రతిపాదించాడు. వేటకు వెళ్లడం ఆయన అభిరుచి. ల్యాబ్‌లో పనిముగిసే సమయానికి చీకటి పడుతుండటం ఆయనకు విసుగు తెప్పించింది. దీంతో గడియారంలో సమయాన్ని ఓ గంట ముందుకు జరిపితే.. సాయంత్రం పెందరాలే పని ముగించుకొని వెలుతురు ఉన్నప్పుడే వేటకు వెళ్లొచ్చని భావించాడట. అలా 'డే లైట్ సేవింగ్ టైమ్'కు శ్రీకారం చుట్టాడు. 1784 ప్రాంతంలో అమెరికాకు చెందిన శాస్త్రవేత్త, రాజకీయ నాయకుడు 'డే లైట్ సేవింగ్ టైమ్'ను ప్రతిపాదించాడని కొందరు చెబుతారు. 'డే లైట్ సేవింగ్ టైమ్' విధానాన్ని తొలిగా అమలుపరిచిన దేశం జర్మనీ అని చెబుతారు. 1916లో మొదటిసారి ఈ సమయ మార్పులను అమలుచేసింది. తర్వాత ఆస్ట్రియా, అమెరికా, యూరప్ దేశాలు కూడా ఈ పాలసీని పాటించడం మొదలుపెట్టాయి. ఇప్పటికీ మార్చి, నవంబర్ నెలల్లో టైమ్ అడ్జెస్ట్‌మెంట్ చేస్తున్నాయి. ఇండియా సహా ఆసియా, ఆఫ్రికా దేశాలేవీ దీన్ని పాటించడం లేదు. అమెరికాలోని ఆరిజోనా, హవాయి రాష్ట్రాలు కూడా ఈ 'డే లైట్ సేవింగ్ టైమ్'ను పాటించడం లేదు.

# ఆక్స్‌ఫర్డ్ హెచ్చరిక బ్రెయిన్ రాట్



అలా ఫోన్ చూస్తూ కూర్చుంటే మెదడు పుచ్చిపోతుంది అనే తిట్లు ప్రతి ఇంట్లో వినిపిస్తూనే ఉంటాయి. ఫోన్ ఎక్కువ సేపు చూస్తున్నావంటూ పెద్దలు.. పిల్లల్ని తిట్టినప్పుడల్లా 'హోంవర్క్ కోసం' అని వాళ్లు సర్దిచెప్పే ప్రయత్నం చేయడం కామన్. 'నువ్వు కూడా ఫోన్ చూస్తున్నావ'ని పిల్లలు పెద్దల్ని నిలదీసినప్పుడు 'అది ఆఫీసు పని మీద అని మభ్యపుచ్చడమూ' చూస్తున్నాం! ఒక్క మాట మాత్రం వాస్తవం. లోకం అంతా ఇప్పుడు ఫోన్ అనే వ్యసనంతోనే జీవిస్తున్నది. డేటా చవకగా మారిపోవడంతో ఆ వ్యసనం నానాటికీ విస్తరిస్తున్నది. ఇంతకీ ఈ తెలిసిన విషయాన్నే మళ్లీ గుర్తుచేసుకోవడానికి ఓ కారణం ఉంది. ఆంగ్ల నిఘంటువుల్లో తలమానికం అయినా ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాన్ని సూచించే 'బ్రెయిన్ రాట్' అనే పదాన్ని 'వర్డ్ ఆఫ్ ది ఇయర్'గా ప్రకటించింది.

### ఏమిటీ వర్డ్ ఆఫ్ ది ఇయర్?

నిఘంటు నిర్మాణంలోనో, భాష చుట్టూ అల్లుకునో పనిచేసే చాలా సంస్థలు ఏటా ఒక ముఖ్యమైన పదాన్ని 'వర్డ్ ఆఫ్ ది ఇయర్'గా ప్రకటిస్తుంటాయి. దాదాపు 50 ఏళ్ల క్రితం మొదలైన ఆనవాయితీ ఇది. కేంబ్రిడ్జ్, కొలిన్స్, వెబ్‌స్టర్‌లతోపాటుగా ఆక్స్‌ఫర్డ్ కూడా ఏటా ఈ ప్రక్రియ చేపడుతుంది. గత ఏడాదిలో ఆ పదాన్ని ఉపయోగించిన తీరు, భావప్రకటన సంస్కృతులను అది ప్రతిబింబించిన విధానం ఆధారంగా ఈ పదాన్ని నిర్ణయిస్తారు. ఆక్స్‌ఫర్డ్ కోసం నిష్ణాతులైన సంపాదకులు, భాషా నిపుణులు ఉన్నప్పటికీ వేల మంది పాఠకుల నుంచి వచ్చిన ఓటింగ్ ఆధారంగానే ఈ పదాన్ని నిర్ణయిస్తారు. డెమ్యూర్, డైనమిక్ ప్రైసింగ్, స్లాప్, లోర్ లాంటి ఎన్నో పదాలను దాటుకుని 'వర్డ్ ఆఫ్ ది ఇయర్ కిరీటాన్ని' అందుకుంది బ్రెయిన్ రాట్. 2000 సంవత్సరం తర్వాత పెరుగుతున్న ఇంటర్నెట్ వాడకానికి దీన్ని అన్వయించడం మొదలుపెట్టారు. 2023తో పోలిస్తే గత ఏడాది ఈ పదం వాడకం 230 శాతం పెరగడం గమనించారు. దీన్ని కేవలం ఓ నిందగానే కాకుండా, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలను సూచించడానికి కూడా వాడటం మొదలుపెట్టారు. అందుకే ఈ పదం వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది.

### కొత్తదేమీ కాదు!

బ్రెయిన్ రాట్ అనే పదాన్ని ఈమధ్య కాలంలో విస్తృతంగా వాడుతున్నారు కానీ, దీనికి 170 ఏండ్ల చరిత్ర ఉంది. ప్రముఖ రచయిత, తత్వవేత్త హెన్రీ డేవిడ్ థోరో తన వాల్డెన్ పుస్తకంలో ఈ పదాన్ని ఉపయోగించారు. ఆలోచనా స్థాయి రోజురోజుకీ దిగజారడానికి సూచనగా ఈ పదాన్ని వాడారు. అయితే 2000 సంవత్సరం తర్వాత పెరుగుతున్న ఇంటర్నెట్ వాడకానికి దీన్ని అన్వయించడం మొదలుపెట్టారు. 2023తో పోలిస్తే గత ఏడాది ఈ పదం వాడకం 230 శాతం పెరగడం గమనించారు. దీన్ని కేవలం ఓ నిందగానే కాకుండా, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలను సూచించడానికి కూడా వాడటం మొదలుపెట్టారు. అందుకే ఈ పదం వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది.

### దీని భావమేమి?

ఏమీ తోచడం లేదనో, చేతిలో ఫోన్ ఉందనో, అలవాటు మానుకోలేకనో సోషల్ మీడియాను అలా గంటల తరబడి చూస్తూ ఉండిపోవడం నేటి తరం రివాజుగా మారింది! ఎలాంటి ఆలోచనలూ, అనుభూతులూ లేకుండానే ఫోన్ మీద వేలును ఆడిస్తూ స్తబ్ధుగా ఉండిపోవడం పిల్లల నుంచి పెద్దల వరకూ అలవాటైంది. ఎంత పనిలో ఉన్నా.. ఒక్కసారి రీల్స్‌లోకి తలదూరిస్తే.. అరగంట స్వాహా! నిద్ర ముంచుకొచ్చే వేళ ఒక్క షార్ట్ కంటపడిందా.. ఇక అంతే సంగతులు. స్మార్ట్ స్క్రీన్ మీద వేలు తైతక్కలాడటమూ, షార్ట్స్ పరంపర కొనసాగటమూ పరిపాటుగా మారింది. దీని వల్ల పనికిరాని కంటెంట్ కూడా మెదడులోకి చేరిపోతున్నది. ప్రతికూల విషయాలూ మనసును కబళించేస్తున్నాయి. అది వ్యక్తుల ఆరోగ్యం మీద, సమాజం పోకడ మీద ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న భయాన్ని ప్రకటించేదే ఈ బ్రెయిన్ రాట్. ఆక్స్‌ఫర్డ్ ప్రకటించే వర్డ్ ఆఫ్ ది ఇయర్‌కి ఓ ప్రత్యేకత ఉంది. అది కేవలం ప్రచారంలో ఉన్న పదం మాత్రమే కాదు. సమాజంలో వస్తున్న మార్పులకు కూడా చిహ్నంగా నిలుస్తుంది. అందుకే ట్క్లైమెట్ ఎమర్జెన్సీ, గోబ్లిన్ మోడ్, రిజ్ ఇలా ఏటా ప్రకటించే ఆక్స్‌ఫర్డ్ పదాలను లోకం జాగ్రత్తగా గమనిస్తుంది. ఆ విషయంలో కాస్త అవగాహన మొదలవుతుంది. అలా బ్రెయిన్ రాట్ కూడా డిజిటల్ వ్యసనం గురించి అందరినీ హెచ్చరిస్తుందని భావిద్దాం. బ్రెయిన్ రాట్ నుంచి బయటపడి శారీరకంగా, మానసికంగా రాటుదేలాలని ఆశిద్దాం!!

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కమిటీలు కీలకం

**అధికారులు ఇందిరమ్మ కమిటీలను కలుపుకొని పోవాలి**

**కమిటీ సభ్యులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు**

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ**



**జడ్చర్ల, తెలంగాణ సేన న్యూస్ :** ఇందిరమ్మ కమిటీల ఆమోదంతోనే అధికారులు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు. కమిటీ సభ్యులు లేకుండా గ్రామాలలో లబ్దిదారుల గురించి విచారణ, సర్వే కార్యక్రమాలు కూడా చేయకూడదని స్పష్టం చేసారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసే క్రమంలో కొన్ని గ్రామాల్లో అధికారులను ఇందిరమ్మ కమిటీ సభ్యులను పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధంగా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించిన ప్రాంతాల్లో కమిటీ సభ్యులు నిరసన తెలిపారని కూడా తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలోనూ, అనర్హులను ఏరివేయడంలోనూ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కీలకమని అనిరుధ్ రెడ్డి గుర్తు చేసారు. ఇందిరమ్మ కమిటీ సభ్యుల ప్రమేయం లేకుండా అధికారులు సిద్ధం చేసిన ఇందిరమ్మ గృహ లబ్దిదారుల జాబితాలు ఫైనల్ కాదని మరోసారి పునరుద్ఘాటించారు. అధికారులు అన్ని ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కలుపుకొని పోవాలని సూచించారు. కమిటీ సభ్యులను అదికారులు నిర్లక్ష్యం చేసే సహించేది లేదని పేర్కొన్నారు.

# గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**అందోల్,తెలంగాణ సేన న్యూస్ :** రాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నర్సమ్మ అడివయ్య నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో అందోల్ మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చేవేళ్ళ విఠల్, వీరభద్రేశ్వర టెంపుల్ మాజీ చైర్మన్ సంగమేశ్వర్ పాటిల్, మండల యూత్ అధ్యక్షులు అంజిముదిరాజ్, తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు,కాశీబస్వరాజ్పాటిల్,మాజీ,విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, మండల యువ నాయకులు జైపాల్ రెడ్డి,నరేష్,నాగేష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**అందోల్,తెలంగాణ సేన న్యూస్ :** రైయికోడ్ మండలం లో రాయిపల్లి గ్రామానికి చెందిన బుర్జుకాడి మహమూద్ ఇళ్లు కరెంటు షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోవటం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆందోల్ మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ వారి కుటుంబాన్ని పరామర్శించి,ప్రభుత్వ పరంగా వచ్చె ఆర్థిక సహాయాన్నిఅందిచాలని,అధికారులను ఆదేశించారు,ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చేవేళ్ళ విఠల్,వీరభద్రేశ్వర టెంపుల్ మాజీ చైర్మన్ సంగమేశ్వర్ పాటిల్, మండల యూత్ అధ్యక్షులు,అంజి ముదిరాజ్,తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు, కాశీ బస్వరాజ్ పాటిల్, మాజీ, విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ అడివయ్య, మహిపాల్ రెడ్డి,మండల యువ నాయకులు జైపాల్ రెడ్డి,నరేష్,నాగేష్,కుమ్మరి అశోక్,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు





సార్వత్రిక ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ రాకపోవడంతో బీజేపీ ఈసారి 'ఒకే దేశం ఒకే ఎన్నిక' వంటి క్లిష్టమైన కార్యాలను తలకెత్తుకోదని అనుకున్నారు. సంకీర్ణ సర్కారు ఏర్పాటు చేయాల్సిరావడమే అందుకు కారణం. అయితే, ఈ అంచనాలను పటాపంచలు చేస్తూ ప్రధాని మోదీ గత ఆగస్టు 15 నాటి ప్రసంగంలో ఏకకాల ఎన్నికల గురించి ప్రస్తావించారు. అంతులేని ఎన్నికల చక్రభ్రమణంలో నుంచి దేశాన్ని బయటపడేయాల్సి ఉందని నొక్కిచెప్పారు. అన్నట్టే బిల్లులను సిద్ధం చేసి ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడం, సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపడం చకచక జరిగిపోయాయి. అయితే, నాలుగు చట్ట సవరణలు, 18 రాజ్యాంగ సవరణలు చేస్తే గానీ జమిలి ఎన్నికలు సాధ్యం కావనే విషయం గమనార్హం. మాజీ రాష్ట్రపతి కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ, గత మార్చిలో సమర్పించిన నివేదికలో 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' భావనను బలంగా సమర్థించింది. ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల పాలనాపరమైన సుస్థిరత, విధానపరమైన స్పష్టత ఏర్పడి దేశానికి మేలు కలుగుతుందని ఆ కమిటీ అభిప్రాయపడింది. ఈ ప్రక్రియ ఓటర్లకు సౌకర్యంగా ఉంటుందని, అనవసరమైన హైరానా తప్పుతుందని, అధిక ఓటింగ్ నమోదుకు అవకాశం ఉంటుందని, దేశంపై ఎన్నికల నిర్వహణ వ్యయభారం కూడా తగ్గుతుందని ఆ కమిటీ సూచించింది. పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని, అదేవిధంగా 100 రోజులలోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సిఫారసు చేసింది. సూత్రప్రాయంగా అనేక పార్టీలు ఈ మార్పులకు అనుకూలమే అయినప్పటికీ అవి జరిగే తీరుతెన్నులపైనే అనేక అనుమానాలున్నాయి. వాటి నివృత్తికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. బిల్లులు ఓటింగ్‌కు వచ్చేది బడ్జెట్ సమావేశాల్లోనే కనుక దేశంలోని అన్ని వర్గాల అభిప్రాయాలను రాబట్టాలి. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల అనుసంధానం ఎప్పుడు, ఎలా జరుగుతుందనే విషయంలో స్పష్టత రావాలి. అందుకు దేశవ్యాప్తంగా లోతైన చర్చ జరగాలి. నిజానికి ఏక కాల ఎన్నికల విషయమై దేశంలో ఏకాభిప్రాయం లే దు. దీన్ని సమర్థించేవారు ఉన్నట్టుగానే వ్యతిరేకించేవారు కూడా బహుళ సంఖ్యలో ఉన్నారు. ఎన్నికల వ్యయం తగ్గడం మొదలుకొని ప్రభుత్వ పరిపాలనా సౌలభ్యం దాకా పలు కారణాలను దీని సమర్థకులు చూపిస్తుంటారు. ప్రాంతీయ అస్తిత్వాలు, ఆకాంక్షలు వెనుకతట్టు పడతాయని, సమాఖ్యవాదానికి ముప్పు ఏర్పడుతుందని, లోక్‌సభతో పాటు అసెంబ్లీలకూ ఎన్నికలు జరిపితే జాతీయవాద ఎజెండా ముందుకువచ్చి రాష్ట్రాల ప్రాధాన్యాలు నిర్ణయాత్మకం కాకుండా పోతాయనేవి వ్యతిరేకుల ప్రధాన అభ్యంతరాలు. ఈ నేపథ్యంలో జమిలి వంటి సుదూర పర్యవసానాలు కలిగిన మార్పుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆచితూచి అడుగువేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

### ముందు ఈసీకి ఎన్నికలు పెట్టండి

'ఒకే దేశం- ఒకే ఎన్నిక' సంగతి తర్వాత గానీ, ముందు ఎలక్షన్ కమిషన్‌కు ఎన్నికలు నిర్వహించండి. రాష్ట్రపతిని ఎన్నికల ద్వారా నియమిస్తున్నప్పుడు ఎన్నికల కమిషనర్లను ఎందుకు ఎన్నుకోకూడదు?

# ఈ ఎలుకలు డ్యామ్ కట్టేస్తాయి!















ఇదిగో ఇక్కడ కనిపిస్తుందే ఆ డ్యామ్ కట్టేసరికి తలప్రాణం తోకకి వచ్చిందనుకో అన్నది తోకను నిమురుకుంటూ ఓ పెద్ద ఎలుక. ముఖ్యంగా పిల్లర్ల కోసం ఆ పెద్ద దుంగలు నరికే సరికి.. సారీ కొరికే సరికి దుంప తెగిందనుకో అంది మరో మధ్య వయసు నారింజ పండ్ల ఎలుక. ఏదేమైనా అందరం కట్టగట్టుకొని ఆనకట్ట కట్టడం భలే ఆనందం అబ్బా ఇంక మన ఇండ్లకు ఏ కాలమైనా సమస్యే లేదు అంది ఓ చిట్టి ఎలుక. ఇదేం కార్టూన్ సినిమా కథ కాదండీ. నిజంగానే ఈ ఎలుకలు సమష్టిగా పనిచేసి నదుల దగ్గర డ్యామ్‌లు కడతాయి. జీవావరణ ఇంజినీర్లుగా వీటికి పేరుంది. ఇంతకీ ఇవి ఎందుకిలా చేస్తాయో ఇక్కడి చిత్రాల్లో కనిపిస్తున్న ఎలుకలను బీవర్‌లుగా పిలుస్తారు. అమెరికాతో పాటు, యురేషియా ప్రాంతంలో అంటే ఉత్తరార్ధగోళంలో ఎక్కువగా నివసించే వీటి నైపుణ్యాలు అచ్చెరువొందిస్తాయి. పారే నదులు, నదీ పాయలు, సెలయేళ్లలో ఇవి నివసిస్తాయి. డోమ్‌ల ఆకృతిలో ఉండే వీటి ఇండ్లను నిర్మించుకోవడం కోసం తామే ఆ ధారలో ఓ చోట మడుగులను ఏర్పాటు చేసుకొంటాయి. అందుకోసం నదీ ప్రవాహ వేగాన్ని తగ్గించేందుకు ముందుగా నీటి ప్రవాహం అంచున ఉన్న పెద్దచెట్లను తన బలమైన నారింజ రంగు పండ్లతో కొరికి నేల కూలుస్తాయి. ఇవి తమ పళ్లతో 148 అడుగుల ఎత్తు, 45 అంగుళాల చుట్టుకొలత కలిగిన పెద్ద చెట్లను సైతం పడేసినట్టు రికార్డులున్నాయి. వీటి పళ్లలో ఇనుము ఎక్కువగా ఉండటం వల్ల వీటికా రంగు వస్తుందట. ఆ తర్వాత అన్నీ కలిసి ఆ దుంగలను నీటి ప్రవాహం వైపు నెట్టుకొస్తాయి. దుంగలు నిలబడటానికి తమ రెండు చేతులతో గుండ్రాళ్లు, మట్టిని పోగుచేసి ఒక దగ్గరికి తెస్తాయి. అవన్నీ కుదురుకుని నీటి ప్రవాహం నెమ్మదించాక చెట్ల కొమ్మలు, గులక రాళ్లు, ఇసుక, పుల్లలు, గడ్డి ఇలా అన్నింటినీ వేస్తూ ఒక ఆనకట్టను నిర్మిస్తాయి. దీంతో ఆ భాగం ఇండ్లు కట్టుకోవడానికి అనుకూలంగా మారుతుంది. ఇందులో పుల్లలు, రాళ్లూ ఏరుకొచ్చి బోర్లించిన గూడులా తమ ఇండ్లను కట్టుకుంటాయి. తినడానికి, ఉండటానికి, చలికాలం ఆహారం నిల్వ చేసుకునేందుకు వీలుగా విడివిడి భాగాలుగా నిర్మించుకుంటాయి. వీటి ద్వారాలు మాత్రం నీటిలోపలి నుంచి వెళ్లగలిగేలా మాత్రమే ఉంటాయి. అంటే నేల మీది వీటి శత్రువుల నుంచి తప్పించుకోవడానికన్నమాట. ఇక, ఇలా ఆనకట్ట కట్టి నీటి కొలను ఏర్పరచుకోవడం వల్ల నీటి మట్టం నియంత్రణలో ఉంటుంది. దాంతో గడ్డకట్టే చలిలోనూ అడుగున నీరు ఉండి వీటి రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ఇవి ఇలా ఆనకట్ట కట్టడం వల్ల ఆ ప్రాంతంలో చేపలు, కప్పలు, పురుగులతో చక్కటి జీవావరణ వ్యవస్థ కూడా ఏర్పడుతుందట. చలికాలం ముందు డ్యామ్ మెయింటెనెన్స్ పనులను చేసుకుంటాయట బీవర్లు. ప్రకృతిలో ఎన్ని వింతలో కదూ!

# మానని గాయానికి మందు




వినాశనం, విస్ఫోటనం మధ్య చిక్కుకున్నది మానవ జీవితం. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా చిక్కుకున్నామని ఒక్కసారి మనల్ని మనం ప్రశ్నించుకుంటే.. మనుషులకు మధ్య దూరం ఎలా పెరిగిందో సులభంగా అర్థమవుతుంది. మనిషి మూర?త్వ ఆలోచనలే ఇందుకు కారణం. దీనివల్ల ఈ ఆధునిక కాలంలో కూడా కొన్ని సమూహాలు ఇంకా నలిగిపోతూనే ఉన్నాయి. అలాంటి వారి గాయాలకు పసునూరి కథలు మందు రాస్తాయనడంలో సందేహం లేదు. పసునూరి రచనల్లో శ్రమైక జీవన సౌందర్యం ఉన్నది. కథల్లో జీవం ఉన్నది కాబట్టే అతని రచనలు అంత చిక్కగ ఉంటాయి. శ్రమజీవుల నుంచి పుట్టిన ప్రతీ వాక్యం సజీవంగా ఉంటుంది. కొన్నేండ్ల పాటు కాదు, కొన్ని తరాలనే శాసిస్తుంది. అట్లా పసునూరి రచించిన 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలోని కథలు ఆధునిక దళితుల గోసలను కండ్ల ముందుంచుతాయి. 2జీ నుంచి 5జీకి వచ్చినా మారిందేమీ లేదు. జనరేషన్ మారిందే తప్పా.. మనిషిలో ఇసుమంత కూడా మార్పు రాలేదు. ఇక్కడ కులోన్మాదం అనే మాయరోగం కరోనా కంటే వేగంగా విస్తరిస్తోందనే చేదునిజాన్ని చాటుతున్నాయి 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలోని కథలు. పాదం కింద ఒక నినాదం మొలుస్తుందనేది అక్షర సత్యం. ఊరు కాని ఊరు. దేశం కాని దేశం దాటి మనుషులను ముక్కలుగా చేస్తుంది. మనిషికి మనిషికి మధ్య దూరాన్ని పెంచుతోంది. ప్రయోగశాలలు, వైద్యాలయాల్లో కూడా అంటరానితనం ఇంకా అలానే ఉందనడంలో సందేహం లేదు. అద్దె గర్భం ద్వారా పుట్టే బిడ్డను కూడా కులమతాలతో వేరు చేస్తున్నారు ఈ కులోన్మాదులు. అమ్మతనాన్ని సైతం మైక్రోస్కోప్‌తో పరీక్షించే తరహాలో ఉంది నేటి సమాజం. తన కులానికి చెందినవారి ద్వారానే దాన్ని కొనేందుకు ప్రయత్నిస్తుంది కులోన్మాదం. కడుపుకే కనులుంటే కడుపు కోత అనుభవించేదా? అని ప్రశ్నించేదే ఇందులోని 'కండీషన్స్ అప్లయ్' కథ. ఊరిలో అంబేద్కర్ విగ్రహం పెట్టనివ్వకుండా దొర కుట్ర చేస్తే బహుజనులు తిప్పికొట్టిన ఒక ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది 'ధమ్కీ' కథ. ఆకలిని తట్టుకోలేక ఆకులు తిన్న లింగడిని ఆదుకోవాల్సింది పోయి, అతని ఆకలిని దైవత్వంతో పోల్చడం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. ఇలాంటి సంఘటనను చూపించిందే 'లీఫ్ మ్యాన్' కథ. పల్లె నుంచి పట్నం దాకా, పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు కులోన్మాద విషం ఎంతలా విస్తరించిందో 'ప్యూర్లీ నాన్ వెజిటేరియన్' కథ వివరిస్తుంది. కట్టుకథలు, అసత్య ప్రచారాలతో మతకల్లోలాలు జరుగుతాయని చెప్పేదే 'వాట్సప్ స్టేటస్' కథ. ఇట్లా 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలో మొత్తం 19 కథలున్నాయి. మొదటి కథ 'లీఫ్ మ్యాన్' కాగా, ఆఖరిది 'వెంటాడే పాట'. నిన్ను నువ్వు నిరూపించడానికి సాహసిస్తే, నువ్విక ఒంటరిగా మిగలవంటూ ధైర్యాన్నిస్తాయని చెప్తుందీ పుస్తకం.

# ఇది కదా ఐలమ్మ ఆశయం!



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికావడంతో ఇటీవల ఘనంగా విజయోత్సవాలు జరుపుకొన్నది. అధికారంలోకి రాగానే చే(ఆరు) గ్యారెంటీల అమలుపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ సర్కార్ వాటిలో ఒక్కటి, రెండు మాత్రమే, అవి కూడా అరకొరగా అమలుచేసింది. దీంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పాలకులం కాదు, సేవకులమని కాంగ్రెస్ నాయకులు మొదటినుంచీ చెప్తున్నారు. తమది ప్రజా పాలన అని చెప్తూ ప్రజాదర్బార్‌లు కూడా నిర్వహించారు. ఇది ప్రజాపాలనకు నిదర్శనమని వందిమాగధులు వంత పాడుతున్నారు. ముఖ్యమంత్రి కూడా ప్రజల్లో కాంగ్రెస్‌ప్రాబల్యం తగ్గకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నా రు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం న్యూయార్క్ వలె మారబో తున్నదని ప్రకటించారు. అంతేకాదు, మన దేశంలోని రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో తాము పోటీ పడుతున్నామని కూడా సెలవిచ్చారు. గత ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ల ద్వారా 55 వేల ఉద్యోగాలు భర్తీచేసి అపాయింట్‌మెంట్ ఆర్డర్లకు ఎల్బీ స్టేడియాన్ని అడ్డాగా మార్చారు. అయితే, మాటలు చెప్పడం సులువే, అమలు, ఆచరణే కష్టం. చాకలి ఐలమ్మ వర్ధంతి సభలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా ఆమె మనమరాలును నియమిస్తున్నామని సీఎం ప్రకటించారు. ప్రతిష్టాత్మక కోఠి మహిళా కళాశాలకు ఐలమ్మ పేరు పెట్టడం ఆమెకు నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు ఇది కొంతవరకు ఊరటే. దొరల గడీలను బద్దలుకొట్టి, పెత్తం దారీతనానికి పాడె కట్టిన ధీరవనిత ఐలమ్మ. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఆమె పోరాడారు. భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించాలనే లక్ష్యంతో పోరు సలిపారు. ఐలమ్మకు కావాల్సింది పేరు కాదు, వట్టి హామీలు, మాటల గారడీతో ఈ వర్గాలను మభ్యపెట్టడం అసలు కానే కాదు, ఆయా వర్గాలకు భూములు పంచి, జీవనోపాధి కల్పించి వారి సామాజిక హోదాను పెంచడమే ఐలమ్మ సంకల్పం. అయితే, ఈ వర్గాల బలహీనతలను సొమ్ము చేసుకొని అసలైన అధికారాన్ని భూస్వాములైన పెట్టుబడిదారులు అనుభవిస్తున్నారు. భూమిని పునఃపంపిణీ చేయడం ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించవచ్చు. తద్వారా భూ యాజమాన్యంలో ఉండే అసమానతలను రూపుమాపవచ్చు. అందుకే, 'ఒట్టి మాటలు కట్టిపెట్టవోయి గట్టిమేలు తలపెట్టవోయి' అన్న గురజాడ మాటల సాధన చాకలి ఐలమ్మకు అసలైన నివాళి. అదే ఆమె ఆశయం కూడా. 1948 సెప్టెంబర్‌లో భారత్‌లో తెలంగాణ విలీనమైనప్పటికీ, ఎస్టేట్ల చట్టం రద్దయినప్పటికీ, 1973లో అప్పటి కాంగ్రెస్ సర్కార్ భూ పంపిణీ చట్టాన్ని తీసుకువచ్చి, 1975లో ఆ చట్టాన్ని అమలుచేసింది. ఈ రెండేండ్లలో భూస్వాములందరూ తమ భూములను బినామీ పేర్లపై మార్చుకున్నారు. తద్వారా చట్టాల పరిధిలోకి భూములు రాకుండా తప్పించుకున్నారు. దీనికి అప్పటి అధికార, ఉద్యోగ యంత్రాంగం తోడ్పడింది. ప్రస్తుతం పట్టణ భూ పంపిణీ చట్టాలను పూర్తిగా రద్దుచేశారు. దీంతో కొంతమంది భూస్వాములు వందల ఎకరాలను ఆక్రమించి ఫ్యాక్టరీలు, ఫామ్‌హౌజ్‌లు నిర్మించుకొని భూమిని అట్టిపెట్టుకున్నారు. అదే సమయంలో కార్పొరేట్ సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఇది పాతకాలం నాటి జమిందారీ వ్యవస్థను తలపిస్తుంది. ధరల నిర్ణయంతో పాటు, భూముల కేంద్రీకరణ అంశం ఈ కార్పొరేటీకరణలో ప్రధానంగా ముందుకువచ్చింది. దీన్ని సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు కూడా తీసుకువచ్చాయి. తెలంగాణలో ఎస్సీలు సుమారు 14.28 శాతం మంది ఉన్నారు. బీసీలు 40 శాతానికి పైగా ఉన్నారు. ఇతర బలహీనవర్గాలు 20 శాతం వరకు ఉండవచ్చు. మొత్తంగా ఈ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల జనాభా 75 శాతం వరకు ఉంటుంది. కానీ, వీరిలో 29.97 శాతం మంది చేతుల్లో అసలు భూమే లేదు. అయితే, మిగిలిన 45 శాతం మంది చేతుల్లో 30 శాతం సేద్యపు భూమి మాత్ర మే ఉన్నది. మిగిలిన 70 శాతం సేద్యపు భూమి 25 శాత మే ఉన్న భూస్వాముల చేతుల్లో ఉన్నదని సెస్సు ఒక అధ్యయనంలో వెల్లడించింది. ఇది భూస్వామ్య వ్యవస్థను పరిరక్షించడమే. ప్రపంచంతో పోటీ పడాలంటే దక్షిణ కొరియాలో మాదిరిగా భూ గరిష్ఠ పరిమితిని ఏడున్నర ఎకరాలుగా నిర్ణయించాలి. చైనా వలె 17 రోజుల్లో భూ పంపిణీ చట్టాలను అమలుచేయండి. మన దేశంలో పంచిన మొత్తం భూమిలో ఒక్క పశ్చిమబెంగాల్‌లోనే 20 శాతం పంచా రు. మన రాష్ట్రంలో వామపక్ష సిద్ధాంతాలకు కాలం చెల్లకుండా ఉండాలంటే భూ పంపిణీపై పోరాటం చేయాలి. అదే చాకలి ఐలమ్మకు అసలైన నివాళి. భూ పంపిణీ చేసి సామాజిక తెలంగాణ తేవాలి. అప్పుడే ఐలమ్మ ఆశయం నెరవేరుతుంది.

# వారంపాటు అసెంబ్లీ శీతాకాల సమావేశాలు?

అసెంబ్లీ శీతాకాల సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నెల 9న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పటికీ, సోమవారం వరకు వాయిదా పడిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం సమావేశాలు పునఃప్రారంభమైన తర్వాత తొలుత సభ్యుల మౌఖిక ప్రశ్నోత్తరాలు నిర్వహించనున్నారు. అనంతరం బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం కానున్నది. సభను ఎన్ని రోజులు నిర్వహించాలి? ఏయే బిల్లులు ప్రవేశపెట్టాలి? వంటి అంశాలపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సభ సమావేశాలను వారంపాటు నిర్వహించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. పంచాయతీరాజ్, మున్సిపల్ వ్యవహారాలు సహా పలు శాఖల బిల్లులు సభకు వచ్చే అవకాశాలున్నట్టు తెలిసింది. కాగా, గత సోమవారం సమావేశాల ప్రారంభం రోజే తెలంగాణతల్లి నూతన విగ్రహం, రూపురేఖలు వంటి అంశాలపై సభలో చర్చించారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులను ఉభయసభల్లోకి ఉద్దేశపూర్వకంగానే రాకుండా చేసి, ప్రభుత్వం చర్చ పెట్టిందనే విమర్శలు వినిపించాయి. తెలంగాణ ప్రజలు ఆరాధించిన తల్లిని కాదని, అభయహస్తం తల్లిని ఉద్దేశపూర్వకంగా రుద్దాలనే కుట్రను ప్రభుత్వం చేసిందని, ఆ బండారం అంతా తాము బయటపెడతామనే భయంతోనే తమను ముందస్తుగానే సభకు రాకుండా అరెస్టు చేయించిందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలపై సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠ నెలకొన్నది.



## నేడు క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రివర్గం సోమవారం భేటీ కానున్నది. శాసనసభ ప్రాంగణంలోని అసెంబ్లీ కమిటీ హాల్-1లో మధ్యాహ్నం రెండు గంటలకు క్యాబినెట్ సమావేశం కానున్నది. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న పలు బిల్లులపై క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదించనున్నారు.

# మనసూ.. మస్తిష్కాలను మేల్కొల్పే కథ



మనిషి మాటలు నేర్చినప్పుడే కథ పుట్టింది. అక్షరాలతో పెరిగింది. అమ్మ చెప్పింది కథ. ఊహాశక్తికి రెక్కలు తొడిగింది కథ. బతుకుకు అద్దం పట్టింది కథ. ఇంతకూ కథాక్రమం బెట్టిదనిన.. సాహిత్యాన్ని కాలం, రచనా విధానాల ఆధారంగా చూసినప్పుడు అది ప్రాచీన, ఆధునిక సాహిత్యంగా విభజించబడుతుంది. కథా సాహిత్యంపై పూర్తి అవగాహన లేనివారు కథను ఆధునిక సాహిత్యంగానే పరిగణిస్తారు. అలా కథా పరిధిని, సాహిత్యంలో దాని స్థాయిని సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. ఒక అంశం/ విషయం గురించి వివరించాలంటే దానిగురించి కొంత తెలిస్తే సరిపోతుంది. కానీ, ఒక అంశాన్ని విమర్శించాలంటే మాత్రం దాని పుట్టుక, పరిధి, విస్తృతి గురించి క్షుణ్ణంగా తెలుసుకోగలగాలి. అప్పుడే ఆ విమర్శకు విలువ ఉంటుంది. కథ గురించి పూర్తి అవగాహన రావాలంటే మొదట దాని పుట్టుక గురించి తెలుసుకోవాలి. అందరూ అనుకుంటున్నట్టుగా కథ అనేది ఆధునిక సాహిత్యం కాలంలో పుట్టిన పసిపాప కాదు. సాహిత్యం ఊపిరి పోసుకోవటానికి ముందే పుట్టి, ప్రపంచాన్ని, ప్రజల మనో సామ్రాజ్యాన్ని పాలించిన నిత్యనూతన అమర చక్రవర్తి. కథ గురించిన మొదటి ప్రస్తావన మనకు అగ్ని పురాణంలో కనపడుతుంది. అందులో సహజమనిపించే అసహజమే కథ అని వర్ణించబడింది. దీన్నిబట్టి చూస్తే కథ అనేది లిఖిత పురాణేతిహాస సాహిత్యం కంటే ప్రాచీనమైనదని తెలుస్తుంది. అంతేకాకుండా అందులో కథను ఏడు రకాలుగా వర్గీకరించారు. అవి కథ, ఆఖ్యాయిక, పరికథ, ఖండ కథ, ఉప కథ మొదలైనవి. ఇందులో ఆఖ్యాయిక వాస్తవిక ఇతివృత్తం గలది అని, కథ అంటే కల్పిత ఇతివృత్తం కలది అని వర్ణించబడింది. అక్షరయుత భాష సైతం నేర్వకమునుపే భావప్రసారమే సాధనంగా ఉండే కాలంలో మానవుడు తనలోని కళాత్మకతను వ్యక్తీకరించడానికి ఎన్నుకున్న సాధనమే కథ. తను చూసిన విడివిడి పూసల వంటి సన్నివేశాలు, సంఘటనలకు తనలోని ఊహాశక్తి సూత్రాన్ని జోడించి దాన్ని ఒక మంచి హృదయాకర్షణీయమైన రూపంగా సృష్టించగలిగాడు. ఆ ఊహాశక్తి కథకుడి ఆలోచనలకు సంతృప్తి ఇచ్చినప్పటికీ, ఎక్కువ కాలం శ్రోతల మనసును ఆకట్టుకోలేకపోయింది. అందువల్ల అతడు కథను మరింత రసవత్తరంగా తీర్చిదిద్దేందుకు అందులో సందర్భోచితంగా అందమైన, మనసును ఆకట్టుకునే అల్లికలను, వర్ణనలను మిళితం చేయసాగాడు. అలా కథకు రూపం ఇచ్చే అల్లికలు 'రచయిత మెదడుకు సానపడుతూ, శ్రోత మనసును మరింతగా ఆకట్టుకోసాగాయి'. కథకు ప్రాణం పోసే వర్ణనలు 'రచయిత మనసులోని అనుభూతులకు ఒక సజీవ రూపాన్ని కల్పిస్తే, శ్రోతను ఊహా లోకంలోకి ఎత్తుకెళ్లి, మధుర జ్ఞాపకాలను అందించసాగాయి.' అంతేకాక కథ ప్రసరణ ముఖ్యంగా ఆశు రూపంలోనే సాగుతుంది. అలా కథ సారాంశాన్ని గుర్తుంచుకొని, తమదైన ఊహల్ని, అనుభూతులను, తమలోని చిలిపి ప్రణయ భావాలను కొత్తగా జత చేస్తూ, దానిని నిరంతరం సరికొత్తగా ముస్తాబు చేస్తుంటారు. అందుకే కథ అనేది 'మనసు (అనుభూతులు) %-% మెదడు (ఆలోచనలు)ల మేలిమలుపుగా' అభివర్ణించబడుతుంది. మొదట్లో వచనం రూపేణా మాత్రమే ప్రసరణ జరిగిన కథ తదనంతర కాలంలో క్రమబద్ధమైన పదవిరుపుల చేత లయను పొంది, మధురమైన గాత్రరూపేణా పాటలుగా తన ఉనికిని మెరుగుపరుచుకుంది. అలా కథ జనాకర్షణకు అవసరమైన మార్పులను అందిపుచ్చుకుంటూ, తన అస్తిత్వాన్ని పదిలపరుచుకున్నది. ఇదంతా అక్షర రూపం పొందని భాషా ప్రయోగం కంటే ముందే జరిగింది. అంటే కథ అనేది లిఖిత సాహిత్యం కంటే ప్రాచీనమైనది, సంఘ మానవుని తొలి కళాభివ్యక్తి రూపంగానూ ప్రసిద్ధమైనది. కథ అంటే వర్ణనలు, కథనం కూర్చటమే కాదు, కాలాతీతంగా మనసులను హత్తుకోగలిగి ఉండాలి. బృహత్కథ, చందమామ, పేదరాశి పెద్దమ్మ, భట్టి విక్రమార్క కథలే అందుకు ఉదాహరణ. నిర్మాణాత్మకత దృష్ట్యా మరికొన్ని కథలు కథకు నిదర్శనంగా గుర్తుండిపోతాయి. అందులో తొలి వరసలో నిలువదగినది బృహత్కథ. తెలుగువాడైన గుణాఢ్యుడు రాసిన బృహత్కథ ప్రపంచ కథా సాహిత్యానికే నడకలు నేర్పిన సూత్రప్రాయ ఉద్గ్రంథం. లిఖిత అక్షర జ్ఞానం పొందిన తర్వాత పురాణేతిహాసాలు కావ్యాదులు వెలువడ్డాయి. పురాణేతిహాసాలలో దైవత్వ అంశాలు, ఆముష్మిక జీవితాంశాలు ప్రధాన ఇతివృత్తాలుగా, కారణజన్ములు, చక్రవర్తుల జీవితాలు, ప్రణయ తత్వాలు ఇతివృత్తాలుగా కావ్యాదులు వెలువడ్డాయి. అంతేకాక ఈ సాహిత్యం జటిల గ్రాంథిక భాషలో ఉండటం, సామాన్యుల ప్రజల జీవితాలను స్పర్శించకపోవడం వల్ల ఇవి సామాన్య జన బాహుళ్యంపై అంతగా ప్రభావం చూపలేకపోయాయి. దాంతో సామాన్యుల జీవితాలను, వారి సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడానికి, లిఖిత సాహిత్య జ్ఞానాన్ని సామాన్యులకు పరిచయం చేయడానికి సాహిత్యకారులకు కనపడిన ఒకే ఒక్క మార్గం కథ. అలా మొదటగా కథలు కావ్య ప్రక్రియలో ప్రవేశించి, కథా కావ్యాలుగా పరిణతి చెందాయి. ఆ పరంపరలో తొలిసారి కేతన దశ కుమార చరిత్ర అనే కావ్యంను కథా రూపేణా అనువదించారు. కథలను కావ్యాలలో ప్రవేశపెట్టి కథా కావ్యాలుగా మార్చే క్రమంలో ఒక పెద్ద సవాలు ఎదురైంది. అదే అటు లిఖిత సాహిత్యకారులను, ఇటు నిరక్షరాస్యులను ఆకట్టుకోవాల్సి రావటం. అందుకోసం రచనా ప్రకారం అందులో సాహిత్య నియమాలను జొప్పించి అటు శిష్ట సాహిత్యవేత్తలను, ఇతివృత్తంలో సామా న్య జీవన విధానాలను, వారి సంస్కృతి సంప్రదాయాలను మిళితం చేస్తూ, ఇటు జానపదులను మెప్పించటంలో కథా కావ్యాలు మరింత సఫలమయ్యాయనే చెప్పవచ్చు. అందుకు జక్కన రాసిన విక్రమార్క చరిత్రను సజీవసాక్షంగా చూపించవచ్చు. విక్రమార్కుడి జీవితాన్ని అద్భుతమైన వర్ణనలతో వివరిస్తూనే, అతడి సాహస గాథలను, అద్భుతమైన మానవాతీత శక్తులను సామాన్య జీవన విధానం, సంస్కృతులతో సందర్భోచితంగా ముడిపెడుతూ ఎంత గొప్ప కథాకావ్యంగా తీర్చిదిద్దారంటే ఎన్ని శతాబ్దాలు గడిచినప్పటికీ విక్రమార్కుని పేరు తెలియనివారు ఉండరనటం అతిశయోక్తి కాదు అనేంతలా. అలా ప్రజాదరణ కోసం, తమ అస్తిత్వాన్ని పదిలపరుచుకోవడం కోసం అనేక ప్రక్రియలు, రచనలు కథారూపంలోకి మార్చబడినాయి. ఉదాహరణకు రాజశేఖరుడి విద్ధసాల భంజిక అనే నాటకం తర్వాతి కాలంలో మంచన కేయూరబాహు చరిత్రగా, భాగవత పురాణం జన వ్యవహారంలో హరికథలుగా మారడమే. తొలినాళ్లలో పురాణేతిహాస కావ్య ప్రబంధాల వలనే కథలో కూడా కొన్ని రసాలు నిబద్ధం చేయబడ్డాయి. అవి ఆది- భయానక, మధ్య-కరుణ, అంత్యంలో అద్భుతం. కానీ, జానపదులు వీటితో పాటు మరో రసం కూడా కథలో చేర్చుకున్నారు. అదే వీర రసం. ఒక రకంగా చెప్పాలంటే అదే వారి కథల్లో ప్రధానాంశం. సమాజంలో ఉన్న అన్యాయాన్ని ఎదిరించినవారిని, మంచి కోసం, సమాజం కోసం, జన్మభూమి కోసం ప్రాణాలు సైతం లెక్కచేయక పోరాడిన వీరులను దేవుళ్లుగా అభివర్ణిస్తూ, వారి సాహసాలను, పోరాటాలను, పూర్తి జీవితాన్ని ఒక కథగా కూర్చుతూ, భవిష్యత్తు తరాలకు ఉగ్గు పాలతో నేర్పిస్తారు. అవే వీరగాథలు. ఉదాహరణకు పండుగ సాయన్న మియ్యాసాబ్ కథలు. వీరు ఆ వీరుల త్యాగాలను, స్ఫూర్తిని మరుగున పడకుండా, వారు చూపిన ధైర్య సాహసాలను భావితరాలు అలవర్చుకోవాలని వాటిని గానం కట్టి పాటలుగా పాడుతారు, అవే వీరగాథ గేయాలు. తర్వాత వాటిని ప్రదర్శన రూపాలుగా మలిచి, రంగస్థలంపై కూడా ప్రదర్శించసాగారు. ఆ వీరగాథ ప్రదర్శన కళారూపమే బుర్రకథ. ప్రాచీనకాలంలో వర్ణన ప్రధానంగా సాగిన సాహిత్యం తర్వాతికాలంలో భావ ప్రధానంగా పరిణామం చెందింది. అలాగే వర్ణన ప్రధానంగా ఉన్న కథ కూడా నవల రూపేణా విషయ ప్రధానంగా మారి, కథానికగా పరిణతి చెందింది. నాటి అద్భుత, వీర సమన్వయ గర్భిత కాలం నుంచి నేటి విషయ వ్యక్తీకరణ కాలం వరకు కథ భౌతిక రూపంలో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ రచన, కూర్పు, వ్యక్తీకరణ, పాఠక ఆకర్షణ మొదలైన అంశాల సఫలత అనేది మనసు (అనుభూతులు)- మెదడు (ఆలోచనలు)లతో పెనవేసుకున్న అవినాభావ సంబంధాన్ని మాత్రం అవిరళంగా కొనసాగిస్తూనే ఉన్నది.

# బతుకమ్మ లేని తల్లిని ఊహించలేం

'ఉద్యమకారులు, కవులు, కళాకారులు, మేధావుల ఏకాభిప్రాయంతో 'తెలంగాణ తల్లి' ఇలా ఉండాలని నిర్ణయించి నాడే ఆ తల్లిని హుందాగా రూపొందించారు. నేడు ఆ ఆకృతిని బోసిపోయినట్టుగా మార్చడం రాష్ట్రానికే సిగ్గుచేటు. కేసీఆర్ ఆనవాళ్లను లేకుండా చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్టుంది' అని తెలంగాణ ఉద్యమకారుడు, నాగర్‌కర్నూల్‌కు చెందిన కవి వనపట్ల సుబ్బయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు.



**తెలంగాణ తల్లి మార్పు విషయంలో ఓ కవిగా మీ అభిప్రాయం ఏమిటి?**

వనపట్ల సుబ్బయ్య: బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ఓ అభిమానిగా, ఓ కవిగా ఊహించుకోలేకపోతున్నా. ఓ రాజకీయ పార్టీనో లేక ఓ రాజకీయ నాయకుడో పెట్టింది కాదు బతుకమ్మ. తెలంగాణ లో అనాది నుంచి వారసత్వంగా వస్తున్న సంప్ర దాయం. 50 ఏండ్ల పాటు తెలుగు తల్లిగా ఉన్నటువంటి తెలంగాణలో మనకంటూ ఒక 'తెలంగాణ తల్లి' ఉండాలనే ఆలోచన చేసిన మొట్ట మొదటి వ్యక్తి కేసీఆర్. అలాంటి తెలంగాణ తల్లి విగ్రహంలో నాటి ఉద్యమకారులు బతుకమ్మకు ప్రముఖ స్థానం కల్పించారు. అలాంటి బతుకమ్మను నేటి తెలంగాణ తల్లి నుంచి వేరు చేయడం సిగ్గుచేటు.

**తెలంగాణ తల్లి విగ్రహం ఎప్పుడు వెలుగులోకి వచ్చింది? ఎప్పుడు, ఎక్కడ ఆవిష్కరించారు?**

తన చేతిలో బతుకమ్మ పెట్టుకొని ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం తొలిసారిగా 2006లో కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో ఆవిష్కరింపబడింది. ఆ త ర్వాత తెలంగాణ తల్లి మనకు ఆరాధ్య దైవమైంది. ఏ తల్లయినా బట్టలు చినిగిపోయి ఉండాలని కోరుకోదు. అందుకే నాటినుంచి ఆభరణాలు, కిరీటం చేయించి అమ్మగా కొలుచుకుంటున్నాం.

**తెలంగాణ తల్లి రూపుమార్చాలనే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఎందుకొచ్చిందంటారు.?**

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మీరు అధికారంలో ఉండి పెట్టలేకపోయారు. అందుకే, ఇప్పుడు మేము పెడుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలకు పోతున్నది. కానీ అది వాస్తవానికి విరుద్ధం. 2006లోనే రాష్ట్ర వ్యాప్తంగా వేలకొద్దీ తెలంగాణ తల్లి విగ్రహాలు కొలువుదీరాయి. అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటుచేసిన విగ్రహం కావచ్చు, ప్రపంచ తెలుగు మహాసభలలో ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా పూజలందుకున్న తెలంగాణ తల్లి కావచ్చు.. ఇవన్నీ గతంలో ఏర్పాటుచేసినవే. రాష్ట్రంలో మూలమూలన తెలంగాణ తల్లి విగ్రహాలున్నప్పటికీ మళ్లీ పెట్టాలనే ప్రభుత్వ ఆలోచన వెనుక కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేయాలనే కుట్రలు కనపడుతున్నాయి.

**అంటే సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడమే మంచిదని మీ అభిప్రాయమా?**

నూటికి నూరు శాతం నా అభిప్రాయం అదే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ఎదురుగా ప్రతిష్ఠించుకుందామనుకొని, అందుకోసం స్థలాన్ని కూడా సేకరించుకొని పెట్టుకున్నది. ఆలోపు అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ పనికి ఆగిపోయింది. ఆ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ కి అవకాశం ఇచ్చారు. ఆ అవకాశాన్ని కాంగ్రెస్ నాయకులు సద్వినియోగం చేసుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అందుకు ఉదాహరణే సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రతిష్ఠాపన. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాల్సిన చోట, అసలు తెలంగాణకు, తెలంగాణ ఉద్యమానికి ఏ మాత్రం సంబంధంలేని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం తెలంగాణ అస్తిత్వాన్ని అణగదొక్కాలని చూడటమే. దానితోనే ఆగకుండా తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని కూడా మార్చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. తెలంగాణ తల్లి, బతుకమ్మలను వేరు చేయడం ఇంకా విచారకరమైన విషయం.

**కాంగ్రెస్ రూపొందించిన తెలంగాణ తల్లి మీకెందుకు నచ్చడం లేదు?**

సచివాలయంలో పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో అభయహస్తం ఉంది, అది చేయిగుర్తును పోలినట్టుగా ఉన్నది. ఆ చేతిలో బతుకమ్మ ఉంటే మాకు, తెలంగాణ ప్రజలకు గౌరవంగా ఉంటుంది. బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ఒక కవిగా నేను ఊహించుకోలేకపోతున్నా.

**ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠించిన కొత్త తెలంగాణ తల్లి విగ్రహం వెనుక పరాయి కుట్రలేమైనా దాగున్నాయని మీకు అనిపిస్తున్నదా?**

వంద శాతం అనిపిస్తున్నది. తెలంగాణ ఉద్యమ సమయంలో రెండు కండ్ల సిద్ధాంతాన్ని ప్రదర్శించిన చంద్రబాబు ప్రస్తుతం ఆంధ్రప్రదే శ్‌కు సీఎంగా ఉన్నాడు. ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి గా ఉన్నారు. గత పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి ఆనవాళ్లను ఈ ఇద్దరు కలిసి తుడిచేయాలనే కుట్రలు చేస్తున్నట్టు ప్రస్ఫుటంగా అర్థమవుతున్నది. ఆ కుట్రలో భాగమే ఉద్యమ సమయంలో తయారు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్చివేసి అబాసుపాలవుతు న్నది.

**సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడం మంచి నిర్ణయమేనా?**

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడమనేది హర్షించదగిన విషయం ఎంతమాత్రమూ కాదు. ఎందుకంటే రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు నగరానికి వస్తుంటారు, పోతుంటారు. ఆ తల్లి విగ్రహాన్ని చూడాలనుకున్నప్పుడు సచివాలయ పోలీసు సిబ్బంది వారిని లోపలికి అనుమతించే ఆస్కారం ఉండదు.

**అమరజ్యోతి గురించి మీరేమైనా చెప్పదలచుకున్నారా?**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలనే కోరిక నాదే కాదు, నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలది కూడా. అరువై ఏండ్లు పోరాడినా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించకపోవడంతో, ఇక తెలంగాణ రాష్ట్రం రాదేమోనని, మేము ఆత్మబలిదానాలు చేసుకుంటేనైనా తెలంగాణ ప్రకటిస్తారేమోనన్న ఆశతో కొంతమంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారు, అగ్నికి ఆహుతయ్యారు. వారి ఆశయాలకనుగుణంగా ఇవ్వాళ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అలాంటి తెలంగాణ రాష్ట్రంలో బంగారు బాటగా దూసుకెళ్తున్న క్రమంలో పరాయి శక్తులు మళ్లీ తెలంగాణపై పడ్డాయి. అందులో భాగంగానే తెలంగాణ తల్లి విగ్రహ రూపంలో మార్పు, ఆ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేయడమే. ఇది తెలంగాణకు క్షేమదాయకం కాదు. ప్రభుత్వం ఇకనైనా పునరాలోచించుకొని తెలంగాణ తల్లి విగ్రహ మార్పులో వెనక్కి తగ్గాలి. లేకుంటే తెలంగాణ ప్రజలు సహించరు.

తెలంగాణ సేన





## మహిళలను పీడిస్తున్న బోన్‌లాస్ అస్థికి సుస్తీ

కొద్దిపాటి బరువు ఎత్తినా, బలం ప్రయోగించి పని చేసినా, చిన్న దెబ్బ తగిలినా కొంతమందికి ఎముక పుటుక్కుమంటుంది. ఆ పని కష్టమైనది కాదు. కానీ, ఎముక ఏ పనికీ సహకరించలేనంత బలహీనంగా మారిపోతే అలా జరుగుతుంది. అప్పటి దాకా ఏ నొప్పీ లేకుండా ఉన్న ఎముక ఎప్పటి నుంచో బలహీనపడుతూ వస్తుందని విరిగాకే తెలుస్తుంది. ఎందుకిలా జరుగుతుందో? ఎవరికిలా జరుగుతుందో? ఈ వారం ఊపిరిలో తెలుసుకుందాం. పుట్టినప్పటి నుంచి ఎముక పెరగడమే కాదు బలంగా తయారవుతూ ఉంటుంది. సుమారు పాతికేళ్ల వయసుకు అటూ ఇటూ రెండు, మూడేళ్ల తేడాతో ఎముక బలపడటం ఆగిపోతుంది. ఇది అందరిలో జరిగేదే. ఎముకలు క్యాల్షియంతో తయారవుతాయి. ఆ క్యాల్షియం సాంద్రత ఎంత ఎక్కువ ఉంటే ఎముకలు అంత బలంగా ఉంటాయి. క్యాల్షియం సాంద్రత తగ్గుతూ ఉంటే ఎముకల్లో సూక్ష్మ రంధ్రాలు ఏర్పడుతూ ఉంటాయి. అప్పుడు ఎముక స్పాంజ్‌లా మారిపోతుంది. కాబట్టి దీనిని ఆస్టియోపోరోసిస్ అని వైద్యులు పిలుస్తున్నారు. దీనిని బోలు వ్యాధి అని కూడా అంటారు. బోలు వ్యాధి వల్ల ఎముకలు పటుత్వం కోల్పోతాయి.

**ఆస్టియోపోరోసిస్ లక్షణాలు:**

ఎముకలు విరిగే వరకు తెలియదు.

వెన్నుపూస వంగిపోతుంది.

రోగి ఎత్తు తగ్గిపోతుంది.

బోలు వ్యాధికి కారణాలను బట్టి వైద్యులు దీనిని రెండు రకాలుగా పరిగణిస్తారు.

1. ప్రైమరీ ఆస్టియోపోరోసిస్
2. సెకండరీ ఆస్టియోపోరోసిస్

ప్రైమరీ ఆస్టియోపోరోసిస్

కొంతమంది రోగాల బారినపడినప్పుడు వాడిన మందుల ప్రభావం వల్ల క్యాల్షియాన్ని శరీరం సంగ్రహించలేదు. కొన్ని రోగాల బారినపడినప్పుడు హార్మోన్ల సమస్యలు వస్తాయి. వాటివల్ల ఎముకలు గుల్ల బారిపోతే దానిని 'ప్రైమరీ ఆస్టియోపోరోసిస్' అంటారు. ఇది ఎముకల ఫార్మేషన్ తగ్గిపోవడం, రిసాప్షన్ వల్ల వస్తుంది. ఈ ప్రైమరీ ఆస్టియోపోరోసిస్ వ్యాధిని రెండు రకాలు.. ఒకటి 'పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపోరోసిస్', రెండోది 'ఫెనాయిల్ ఆస్టియోపొరోసిస్'.

**1. పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపోరోసిస్**

పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా బోలు వ్యాధి బారిన పడుతున్నారు. దీనిని మహిళలకు సాధారణంగా వచ్చే వ్యాధిగా వైద్యులు పరిగణిస్తున్నారు. మహిళల్లో రుతుస్రావం ఆగిపోయిన మహిళల్లో ఈస్ట్రోజన్ (స్త్రీ లింగ హార్మోన్స్) తగ్గిపోతుంది. హార్మోన్‌ల విడుదలలో జరిగే మార్పుల వల్ల బోన్ రిసాప్షన్‌కు గురవుతుంది. అప్పుడు ఎముకల్లోని క్యాల్షియం శరీరంలోకి చేరుతుంది. ఎముకల్లోని క్యాల్షియం సాంద్రత తగ్గుతుంది. అందువల్ల ఆస్టియోపోరోసిస్ బారినపడతారు. సాధారణంగా 50 ఏళ్లు దాటిన మహిళల్లో ఈ విధమైన మార్పులు మొదలవుతాయి. పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపోరోసిస్ రోగిలో ఎలాంటి లక్షణాలు బయటపడవు. ఏదైన దెబ్బ తగిలినా లేదా కింద పడినా ఎముక విరగడం వల్ల ఈ వ్యాధి బయటపడుతుంది. కొంతమందిలో 45-50 ఏళ్ల మధ్య వయలోనే రుతుక్రమం ఆగిపోతుంది. మెనోపాజ్‌కు దగ్గరవుతున్న (రుతుక్రమానికి దూరమవుతున్న) మహిళల్లో ఎముకలు పటుత్వం కోల్పోయి, బలహీనమవుతాయి. మహిళలు 50 ఏళ్లకు ముందే మెనోపాజ్ దశకు చేరుకుంటే, పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపోరోసిస్ కూడా ముందే వచ్చేస్తుంది.

**చికిత్సా పద్ధతి**

పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపోరోసిస్ రోగులకు హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపి (హెచ్‌ఆర్‌టి) ద్వారా చికిత్స అందిస్తారు. ఇది కాకుండా పారా థైరాయిడ్ హార్మోన్‌తో కూడా చికిత్స చేయవచ్చు. ఈ చికిత్స పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపోరోసిస్‌తో పాటు ఫెనాయిల్ ఆస్టియోపోరోసిస్ రోగులకు సైతం ఇవ్వవచ్చు. ఈ చికిత్సలో ఇచ్చే హార్మోన్ల వల్ల ఎముకల నుంచి క్యాల్షియం బయటికి పోకుండా అడ్డుకోవచ్చు. ఆస్టియోపోరోసిస్‌ని నియంత్రించవచ్చు. ఇది సైలంట్ ఎపిడిమిక్ అయినందున వ్యాధి పట్ల అవగాహనతో జీవన విధానంలో మార్పులు చేసుకుంటే దీని నుంచి తప్పించుకోవచ్చు.

**2. ఫెనాయిల్ ఆస్టియోపోరోసిస్**

ఫెనాయిల్ ఆస్టియోపోరోసిస్ వయసుతో సంబంధం ఉన్న వ్యాధి. పురుషులు, మహిళలు దీని బారినపడతారు. వయసు 30 ఏళ్లు దాటిన తర్వాత ఎముకల బలపడే స్థితి ఉండదు. 70 ఏళ్ల నుంచి ఎముక తయారీ తగ్గుతుంది. వృద్ధాప్యంలో ఎముకలు క్రమంగా బలహీనపడటాన్ని ఫెనాయిల్ ఆస్టియోపోరోసిస్ అంటారు.

**సెకండరీ ఆస్టియోపోరోసిస్**

కొన్ని రకాల జబ్బుల కారణంగా వచ్చే ఆస్టియోపోరోసిస్ లేదా బోలు ఎముకల వ్యాధిని 'సెకండరీ ఆస్టియోపోరోసిస్' అంటారు. లుకేమియా, డయాబెటిస్, ఉదరకుహర (సెలియక్) వ్యాధి, హైపర్ థైరాయిడిజం, మూత్రపిండ వ్యాధులు, అనోరెక్సియా, ఎస్టియోజెనెసిస్, సిస్టిక్ ఫైబ్రోసిస్ వంటి వ్యాధులతో బాధపడే వాళ్లలో ఎముకలు గుల్లబారే ప్రమాదం ఉంది. దీనిని సెకండరీ ఆస్టియోపోరోసిస్ అంటారు. ఈ సెకండరీ ఆస్టియోపోరోసిస్ వ్యాధి పిల్లల్లోనూ కనిపిస్తుంది. ఇలా పిల్లల్లో కనిపించే ఆస్టియోపారోసిస్‌ను 'జువెనైల్ ఆస్టియోపోరోసిస్' అంటారు. మెనోపాజ్‌తో సంబంధం లేకుండా నడి వయసులో రావడానికి గల కారణాలు శరీరంలో క్యాల్షియం జీవక్రియ తగ్గడం డి-విటమిన్ లోపం ఆహారంలో క్యాల్షియం లేకపోవడం వ్యాయామం చేయకపోవడం మద్యపానం, ధూమపానం నియంత్రణలేని థైరాయిడ్, మధుమేహం స్టిరాయిడ్స్ వాడకం నిర్ధారణ పరీక్షలు ఆస్టియోపోరోసిస్ వ్యాధిని గుర్తించేందుకు ముందుగా రోగి ఆరోగ్యస్థితిపై మెడికల్ ఎగ్జామిన్ చేయాలి. ఆ తర్వాత వారి కుటుంబంలో ఎవరికైనా వ్యాధి ఉన్నదేమో తెలుసుకోవాలి. అనంతరం రోగికి 'డెక్సా స్కాన్' ద్వారా ఏ రకమైన ఆస్టియోపారాసిస్ వ్యాధి ఉందోకచ్చితంగా నిర్ధారించవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఈ వ్యాధిని టి-స్కోర్ ద్వారా నిర్ధారిస్తారు. ముందస్తు జాగ్రత్తలు క్యాల్షియం ఉండే ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలి. రోజూ ఉదయం 20 నుంచి 25 నిమిషాల పాటు చర్మానికి సూర్యరశ్మి సోకేలా ఉండాలి. 45 నిమిషాలు వ్యాయామం చేయాలి. లేదా ఆటలు ఆడాలి. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి 40 ఏళ్లు దాటిన మహిళలు క్రమం తప్పకుండా 'బోన్ హెల్త్ చెకప్' చేయించుకోవాలి.

**పీక్ బోన్ మాస్..**

ఫెనాయిల్ ఆస్టియోపోరోసిస్, పోస్ట్ మోనోపాజ్ ఆస్టియోపోరోసిస్ సమస్యలను అధిగమించాలంటే 'పీక్ బోన్ మాస్' కీలకం. 'పీక్ బోన్‌మాస్' అంటే ఎముకల సాంద్రత గరిష్ఠ స్థాయికి చేరుకోవడం. అంటే ఎముకల ఎదుగుదల గరిష్ఠ స్థాయిలో జరగడమన్నమాట. ఈ పీక్ బోన్ మాస్ అనేది 30 ఏళ్ల వయసులో వస్తుంది. స్త్రీ, పురుషుల్లో వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలపడుతుంటాయి. ఎముకల ఎదుగుదల 30 ఏళ్ల నాటికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే 30 ఏళ్లకు ఎముకల్లో క్యాల్షియం నిలువలు అధిక మొత్తంలో డిపాజిట్ అవుతాయి. అందుకే ఈ వయసులో ఏర్పడిన ఎముకల ఎదుగుదలను బ్యాంక్ డిపాజిట్‌లా భావిస్తారు. దీనివల్ల ఏర్పడిన ఎముకల పటుత్వం మహిళల్లో మెనోపాజ్ తర్వాత, పురుషుల్లో 70 ఏళ్లు పైబడిన తర్వాత ఏర్పడే ఆస్టియోపోరోసిస్ అధిగమించడానికి దోహదపడుతుంది. ఫెనాయిల్ దశలో బోన్ ఫార్మేషన్ తగ్గిపోయినప్పుడు పీక్ బోన్‌మాస్ ఆదుకుంటుంది. దీనివల్ల ఆస్టియోపొరోసిస్ నుంచి తప్పించుకోవచ్చు. పీక్ బోన్‌మాస్ అనేది ప్రధానంగా నాలుగు అంశాలపై ఆధారపడి ఉంటుంది. అందులో 1. పౌష్టికాహారం 2. శారీరక శ్రమ 3. జన్యు కారణాలు 4. గొనాడల్ యాక్టివిటిస్ అంటే కొన్ని రకాల హార్మోన్‌ల పనితీరు.


**నడి వయసు దాటక ముందే..**

ఈ మధ్యకాలంలో 78 శాతం మహిళలు 50 ఏళ్లలోపే ఆస్టియోపొరాసిస్ (బోలు ఎముక వ్యాధి), కీళ్ల నొప్పులకు గురవుతున్నారు. దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది మహిళలు తమ ఆరోగ్య సంరక్షణపై దృష్టిపెట్టకపోవడం. రెండోది.. ముందే మెనోపాజ్ దశకు చేరుకోవడం.

**పీక్ బోన్‌మాస్ సమృద్ధిగా ఉండాలంటే**


వయసు పెరిగేకొద్ది ఎముకల్లో క్యాల్షియం నిలువలు అధికస్థాయిలో జమవుతుంటాయి. అతి తక్కువ స్థాయిలో విత్‌డ్రా అవుతాయి. 30 ఏళ్ల వరకు ఇలా జరుగుతుంది. 30 ఏళ్ల తరువాత ఎముకల్లో క్యాల్షియం జమ కావడం క్రమంగా తగ్గుతుంది. విత్‌డ్రా కావడం పెరుగుతుంది. ఎముకల్లో క్యాల్షియం నిలువలు అధికంగా ఉండాలంటే బాల్య దశ నుంచే పౌష్టికాహారం, క్యాల్షియం అందించే ఆహారంతో పాటు చర్మానికి సూర్యరశ్మి సోకేలా పిల్లలను ఎండలో కనీసం 20 నిమిషాల పాటు ఉంచాలి. దీని వల్ల శరీరంలో విటమిన్-డి సమృద్ధిగా ఉత్పత్తి అవుతుంది. వీటితో పాటు శరీరానికి మంచి వ్యాయామం కల్పించే ఆటలు ఆడించాలి. వయసు 30 ఏళ్లు వచ్చేసరికి వారిలో పీక్ బోన్‌మాస్ స్థాయులు గరిష్ఠంగా ఉంటాయి. సహజంగానే





# మేధావుల గొంతులో ఆర్బీఐ వెలక్కాయ

తెలంగాణలో మేధావులు అనబడేవారు ఏ విషయం గురించి ఏమంటారా అని సమాజం ఎదురుచూస్తుంటుంది. ఆ విధంగా, 2014-15 నుంచి 2023-24 మధ్య పదేండ్ల కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయమై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తన హ్యాండ్‌బుక్‌లో కొద్దిరోజుల క్రితం పేర్కొన్న వివరాల గురించి వారు ఏమంటారోనని కూడా సమాజం ఆసక్తిగా ఎదురుచూస్తూనే ఉండి ఉంటుంది. కానీ, కనీసం ఇంతవరకైతే వారి నుంచి ఎటువంటి వ్యాఖ్యానాలు వినిపించలేదు. హ్యాండ్‌బుక్ చెప్పిన లెక్కలను ఇంకా పరిశీలిస్తున్నారో, లేక వారి మౌనానికి మరేదైనా కారణం ఉందో తెలియదు. ''రిజర్వ్ బ్యాంక్ నివేదికపై మేధావుల అభిప్రాయాలను సమాజం తెలుసుకోవాలనుకోవటానికి సాధారణమైన ఆసక్తి మాత్రమే గాక ఒక ప్రత్యేక కారణం ఉన్నది. పైన పేర్కొన్న పదేండ్ల కాలంలో పాలించిన బీఆర్ఎస్ కాలంలో చాలా అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ చెప్తుండగా, జరిగిందంతా సర్వనాశనం, ఆర్థిక విధ్వంసం, అంతా అప్పుల కుప్ప, యాభై ఏండ్లు వెనుకకుపోవటమని కాంగ్రెస్ విమర్శిస్తూ వస్తున్నది. ప్రజల స్వానుభావాలు ఏమిటన్నది అట్లుంచితే, ఇటువంటి పరస్పర విరుద్ధ ప్రచారాలు వారిలో కొందరికి అయోమయాన్ని సృష్టించాయి. అట్లాంటి పరిస్థితి తలెత్తినప్పుడు, తటస్థులుగా, సమాజం పక్షాన నిలిచేవారిగా, స్వతంత్ర పరిశీలనలు చేసి ప్రజలకు వాస్తవాలను తెలియజేసే బాధ్యత మేధావులు అనబడే వారిపై ఉంటుంది. తమ నుంచి సమాజం ఆశించేది అదే. ఆ పని చేయనప్పుడు వారి ఉనికికే అర్థం ఉండదు. లేదా వారు కపటపు మేధావులనే పేరు తెచ్చుకుంటారు. కనుక, మేధావి బృందాలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటూ, రిజర్వ్ బ్యాంక్ నివేదికపై రాగల రోజులలోనైనా తమ ఆలోచనలను వెల్లడించగలరని ప్రజలు ఆశిస్తారు. అయితే, గత పదేండ్లుగా వారి రికార్డులను గమనించినప్పుడు మాత్రం అటువంటి ఆశాభావం అంతగా కలగటం లేదు. ఈ మాట అనేందుకు కొన్ని కారణాలున్నాయి. మొదటిది, బ్యాంక్ వారు పదేండ్ల లెక్కలన్నింటిని క్రోడీకరించి హ్యాండ్‌బుక్ రూపంలో ఇప్పుడు ప్రకటించి ఉండవచ్చు. కానీ, ఆ వివరాలు ఇప్పుడు అకస్మాత్తుగా వెలుగులోకి వచ్చినవి కావు. జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాలు ఆ కాలమంతా ఎప్పటికప్పుడు కండ్ల ఎదుట కనిపిస్తుండినవే. అప్పటి ప్రభుత్వం ప్రకటిస్తూ వచ్చినవే. అదిగాక, ఆర్బీఐ తరహాలోనే కేంద్ర ఆర్థిక శాఖ, ఇతర కేంద్ర మంత్రిత్వ శాఖలు, నీతి ఆయోగ్, పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలు, ప్రైవేట్ వ్యాపారసంస్థల సంఘాలు, వాటి ప్రముఖులు చెప్తూ వచ్చినవే. ఈ సమస్తం కూడా నిజం కాదని ఒకవేళ మేధావులు భావించి ఉంటే తమ వైపు నుంచి స్వతంత్ర పరిశీలనలు చేసి వాస్తవాలేమిటో ప్రజల ముందు ఉంచవచ్చు. వారికి ఒకవైపు పబ్లిక్ డొమెన్‌లో డేటా కుప్పలుతెప్పలుగా ఉంది. మరొకవైపు క్షేత్రస్థాయి పరిశీలనలకు గ్రామాలు, పట్టణాలు ఎదురుగా ఉన్నాయి. కానీ, వారు అటువంటివేమీ ఎప్పుడూ చేయలేదు. మేధావుల రికార్డు అంటున్నవాటిలో ఇది ఒక అంశం కాగా, వారు మరొక అడుగు ముందుకువెళ్లి కాంగ్రెస్ ఏమి చెప్తే అది తలపై మోసుకుంటూ అప్పటి ప్రభుత్వంపై నానా ప్రచారాలన్నీ చేశారు. సంక్షేమం అరకొర అన్నారు, అభివృద్ధి శూన్యమన్నారు అప్పులు భయంకరంగా పెరిగాయన్నారు. కొందరు మహాశయులైతే, పరిస్థితి ఇంతకన్న ఉమ్మడి రాష్ట్రంలో బాగుండేదని, తెలంగాణ రాకపోయినా బాగుండేదేమోనని అనేంతవరకు వెళ్లా రు. ఇటువంటి గ్యాంగ్‌లో ఎవరెవరున్నారో అందరికీ తెలిసిందే గనుక ఆ పేర్లు ఇక్కడ




రాయటం లేదు. మొత్తానికి ఇది రెండవ అంశం కాగా, ఈ బృందం మేధావులు గత ఎన్నికల్లో ఏకంగా కాం గ్రెస్ ప్రచార రథాలకు జెండాలూపే స్థాయికి పతనమయ్యారు. తమ తీరును తమ హక్కుల వేదికలకే చెందిన ఇతర ప్రముఖులు, సభ్యులు వ్యతిరేకించినా వెనక్కి తగ్గలేదు. ఇది మూడవ అంశం. చివరిదైన నాల్గవ అంశం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంగా వారు తీసుకుంటూ వస్తున్న వైఖరి ఏమిటన్నది. వందరోజుల గడువుతో బాండ్ పేపర్లపై సంతకాలు చేసి ఇంటింటికీ తిరిగి పంచిన హామీల అమలు విషయంలో గాని, ఈ సరికి ఏడాది కాలం కూడా పూర్తయిన పరిస్థితిలో గాని, ఈ మధ్య కాలంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పింఛన్లు, విద్య, వైద్యరంగాలు, సంక్షేమ హాస్టళ్లు, మానవహక్కులు, హైడ్రా, గిరిజనుల భూములు, ఛప్పన్నారు ఇతర హామీలు, నిరంతరం అసత్యపు మాటలు, బుకాయింపుల వంటి విషయాలలో గాని వీరు అసలేమైనా మాట్లాడారా? మాట్లాడితే ఏమిటన్నది ప్రశ్న. వీటన్నింటిలో రెండే రెండు మాత్రం చూద్దాం. వంద రోజుల గడువు హామీల గురించి ఆ తర్వాత కొన్ని నెలలు గడిచిన మీదట ఈ బృందంలోని ఒక ప్రముఖుడిని ఒక పాత్రికేయుడు ప్రశ్నించగా, తలదించుకుని నీళ్లు నములుతూ, వినిపించీ వినిపించని స్వరంతో, ఆర్థిక ఇబ్బందుల గురించి, గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల భారం గురించి మాట్లాడారు. అమలు చేయలేకపోవటానికి తన మేధావితనంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సాకులు వెతికిపెట్టబూనారు. ఇక్కడ రెండు ప్రశ్నలు తలెత్తుతాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందంటూ ఎన్నికల సమయంలో హోరెత్తించిన ప్రస్తుత పాలకులకు వారి మద్దతుదారులైన ఈ మేధావులకు, వాటి అమలుకు నిధులు కష్టమని అప్పుడు తెలియలేదా? పోతే, అప్పుల భారమన్న ప్రచారమే అబద్ధమని ఇప్పుడు ఆర్బీఐ రిపోర్టుతో తేలుతున్నప్పుడు, ఏలినవారు దిక్కులు చూస్తుండవచ్చుగాని ఈ ఘనమైన మేధావులు ఏమంటారు? ఇక రెండవ ది నిరుద్యోగుల సమస్య. జరుగుతున్నదానిని అదే మేధావితో ప్రస్తావించగా అదేవిధంగా నేల చూపు లు చూస్తూ, ఇది ప్రమాదకరంగా ఉంది, ఏమవుతుందోనని నసుగుతారు. మరొక మేధావి, ఏమి జరుగుతుందో చూసి వచ్చే ఎన్నికల సమయంలో మాట్లాడతామంటారు! ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అసాధ్యమని వారికి ముందు తెలియదా? నిజాయితీ లేని వారిని అసలు మేధావులు అనవచ్చునా అనే మౌలికమైన సందేహాలు అట్లుంచితే, ప్రస్తుతం తెలంగాణ సమాజం ఎదుట గల రిజర్వ్ బ్యాంక్ హ్యాండ్ బుక్ గణాంకాల గురించి ఈ మేధావి గణాలు ఏమనేదీ వినాలని ఎంతో ఉత్సుకతగా ఉంది. అవి వారి గొంతులో పచ్చి వెలక్కాయ వలె మింగలేని, కక్కలేని విధంగా ఇరుక్కుని ఉన్నాయా? లేక , ఆ లెక్కలన్నీ తప్పంటూ తమ ప్రియమైన పార్టీని, ప్రభుత్వాన్ని ఏ విధంగా సమర్థించాలా అని మేధోమథనాలు చేస్తున్నారా? లేక కనీసం ఇప్పటికైనా నిజాయితీపరులుగా పరివర్తన చెంది తెలంగాణ ప్రజలకు నిజాలను చెప్తూ, తమ ఇంతకాలపు నిజాయితీరాహిత్యానికి క్షమాపణలు ప్రకటిస్తారా? ఆర్బీఐ నిర్ధారించిన వివరాలనేకం ఇదే పత్రిక లో ఈ శని, ఆది, సోమవారాలలో వెలువడినవే అయినందున, అవి ఇక్కడ మళ్లీ రాయవలసిన అవసరం ఉందని భావించటం లేదు. అయినప్పటికీ కొండగుర్తుల వలె రెండు మాటలు చెప్పుకోవాలంటే, ఏడు లక్షల కోట్ల అప్పులనేవి తప్పు లెక్క, అది మూడు లక్షల చిల్లర మాత్రమేనన్న వాస్తవంతో సహా అనేక విషయాలు, ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వపు సోకాల్డ్ శ్వేతపత్రంపై అసెంబ్లీ చర్చ సందర్భంగా మాజీ ఆర్థికమంత్రి హరీశ్‌రావు వెల్లడించినవే. అట్లా వివిధ రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వాన సాధించిన అభివృద్ధి లెక్కలన్నింటికి కూడా బీరుపోని తీరులో ఇప్పుడు రిజర్వ్ బ్యాంక్ తన ఆమో ద ముద్రను వేసిందన్నది ఈ మేధావులు తమ రెండు కళ్ళూ తెరుచుకొని చూస్తారా? వంద రోజుల గడువు హామీల గురించి ఆ తర్వాత కొన్ని నెలలు గడిచిన మీదట ఈ బృందంలోని ఒక ప్రముఖుడిని ఒక పాత్రికేయుడు ప్రశ్నించగా, తలదించుకుని నీళ్లు నములుతూ, వినిపించీ వినిపించని స్వరంతో, ఆర్థిక ఇబ్బందుల గురించి, గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల భారం గురించి మాట్లాడారు. అమలు చేయలేకపోవటానికి తన మేధావితనంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సాకులు వెతికిపెట్టబూనారు.

# ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేండ్లకు కాంగ్రెస్ పార్టీ 'మార్పు' పేరిట ప్రజలను ఏమార్చి అధికారాన్ని చేజిక్కించుకున్నది. ఏడాది అయితే కానీ కాంగ్రెస్ పార్టీ తమను మోసం చేసిందనే విషయం ప్రజలకు తెలియలేదు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి అన్నీ విఫల ప్రయోగాలే. తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొన్న చరిత్ర ఆయనకు లేకపోగా, ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన చరిత్ర తనది. ఇక పాలనా విషయానికి వస్తే కనీసం మంత్రిగా చేసిన అనుభవం కూడా లేదు. ఉద్యమంలో తెలంగాణ వ్యతిరేకులతో అంటకాగిన ఆయనకు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఏ మాత్రం తెలియవనేది నూటికి నూరుపాళ్లు నిజం. అందుకే, ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డది. అందులో భాగమే తెలంగాణ అధికారిక చిహ్నంలో కాకతీయ తోరణాన్ని, చార్మినార్‌ను తొలగించే ప్రయత్నం చేయడం. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి తొలి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేసింది. బోనాలు, బతుకమ్మ వంటి తెలంగాణ పండుగలకు ప్రాముఖ్యం ఇచ్చింది. అంతేకాదు, తెలంగాణ వంటలు సైతం ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలంగాణ కట్టూ బొట్టు ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. హైదరాబాద్ అంటే మొదటగా గోల్కొండనే గుర్తుకువస్తుంది. అలాంటి గోల్కొండ కోట మీద భారతీయ త్రివర్ణ పతాకం జెండా రెపరెపలాడింది. ఉద్యమ నాయకుడు కేసీఆర్ తెలంగాణ కోసం బయల్దేరితే ప్రజలు ఆయన వెన్నంటే నడిచారు. విధిలేక అన్ని రాజకీయ పార్టీలు 'జై తెలంగాణ' అని నినదించక తప్పనిసరి పరిస్థితి నెలకొన్నది. ఆ సమయంలోనే ఉద్యమకారులు, రాజకీయవేత్తలు, మేధావులు కలిసి 'తెలంగాణ తల్లి'ని రూపొందించారు. అయితే తెలంగాణ తల్లి తలపై కిరీటంతో పాటు ఒక చేతిలో మక్కజొన్న కంకి, మరో చేతిలో బతుకమ్మను ఏర్పాటుచేశారు. ఆ తల్లిని చూస్తే యువతలో రక్తం ఉరకలెత్తింది. ఆ తల్లి రూపం ఒక చైతన్య దీపికగా నాటి పోరాటానికి స్ఫూర్తిగా నిలిచింది. అలాంటి తెలంగాణ తల్లి రూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం ప్రజలను ఏమార్చడమే. పైగా కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి నుంచి తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన బతుకమ్మను వేరు చేయడం నిజంగా సిగ్గుచేటు. ఏ వ్యక్తి అయినా తమ తల్లిని గొప్పగా చూడాలనే తపిస్తాడు కానీ, హీనంగా చూడాలని కోరుకోడు. తల్లి వైభవంగా కనిపిస్తే ఆ కుటుంబం సుభిక్షంగా వర్ధిల్లుతున్నట్టే లెక్క. అట్లా ఉన్న తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలో పడేసింది. నేటి తెలంగాణ తల్లి పట్టుచీరలో కాకుండా ముతకచీరలో ఉన్నది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన, తెలంగాణకు గర్వకారణమైన పోచంపల్లి, గద్వాల్ పట్టుచీరలు కట్టుకునే అర్హత మన తెలంగాణ తల్లికి లేదా? ఇది చేనేత పరిశ్రమలను, మన నేతన్నలను అవమానపరిచినట్టు కాదా? బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ప్రజలు ఆమోదించలేకపోతున్నారు. అంతేకాదు, 'జయ జయహే తెలంగాణ' పాటను ఒక ఆంధ్రా ప్రాంతానికి చెందిన సంగీత దర్శకుడితో, అది కూడా ఒక సినీ పాట తరహా రాష్ట్రగీతంగా ప్రకటించ డం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇది లా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవాలు చూసిన తర్వాత తెలంగాణ ఆనవాళ్లు క్రమంగా కనపడకుండా పోతాయేమోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. రాష్ట్రంలోని ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే విజయోత్సవాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు చేసుకోవడమే విడ్డూరం అంటే, వేదికలపై గాయకులతో సినిమా పాటలు పాడించటం ఆంధ్రప్రదేశ్‌లోని రికార్డు డ్యాన్స్ సంప్రదాయాలను చూసినట్టే ఉన్నది. అంతేకాదు, ఈ సంబురాలు తెలంగాణ సంస్కృతిని అవమానించినట్టుగా ఉన్నాయి. కాబట్టి తెలంగాణ సమాజం జాగృతమై కాంగ్రెస్ నేతల కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఉద్యమ సారథి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని వింత పోకడలకు పోతున్న సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆనవాళ్లను కనుమరుగు చేయడానికి ప్రయత్నిస్తున్నారనడంలో సందేహం లేదు. ఆయన పాలన తెలంగాణ అస్తిత్వానికే ప్రమాదం తెచ్చేలా ఉన్నది. తెలంగాణ ప్రజలు అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు మళ్లీ ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం వస్తుందేమో.

# ఇంకెన్నాళ్లు రైతుల నిర్బంధం?

చట్టం ముందు అందరూ సమానమే. ఈ సంగతి ఎన్నో న్యాయ పోరాటాల్లో నిగ్గుదేలిన సంగతి తెలిసిందే. కానీ, సమానత్వం అనేది చట్టానికి భాష్యం చెప్పే తీర్పరి వ్యవస్థ మీద కొంత, దానిని ప్రభావితం చేసే ప్రభుత్వ వ్యవస్థల మీద కొంత ఆధారపడి ఉంటుంది. ఆ రెండింటి ప్రభావంతో కొన్నిసార్లు హెచ్చుతగ్గులు కనిపిస్తుంటాయి. ముఖ్యంగా బెయిలు విషయంలో ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తుంటుంది. నెలరోజులకు పైగా జైలులో మగ్గుతున్న లగచర్ల రైతుల విషయంలో ఈ వ్యత్యాసం మరోసారి మన ముందుకువచ్చింది. సర్కారు వెన్నుపోటు పొడిచిందనే ఆగ్రహంతో తిరగబడ్డందుకు నెల రోజులకు పైగా 24 మంది రైతులు కటకటాల వెనుక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న సంగతి తెలిసిందే. మొన్నకు మొన్న ఓ రైతు ఖైదీకి గుండెజబ్బు వస్తే పశువులను సంతకు తోలినట్టు సంకెళ్లు వేసి దవాఖానకు తరలించిన దృశ్యం మనం మరచిపోలేం. నిర్బంధంలో వారు ఎదుర్కొంటున్న దుర్భర స్థితిని అది కండ్లకు కట్టింది. రైతులు తమ వద్దకు వచ్చిన అధికారులపై కోపం చూపారు. కానీ, అసలు సిసలు కారకులైన ప్రభుత్వ పెద్దలు మాత్రం తమ ఎజండాను తెరవెనుక నుంచి నడిపిస్తూనే ఉన్నారు. దాడి వల్ల సమస్య తీరకపోగా కేసులు మెడకు చుట్టుకొని రైతుల బతుకు నరకమైపోయింది. రైతుల కుటుంబాల పరిస్థితి ఎక్కే మెట్లు, దిగే మెట్లు అన్నట్టుగా తయారైంది. బెయిలు ఇవ్వడం తప్పనిసరి, జైలుకు పంపడం అనేది మినహాయింపుగా ఉండాలని సుప్రీంకోర్టు పదే పదే చెప్తున్నది. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కేసులోనూ, ప్రొఫెసర్ సాయిబాబా కేసులోనూ ఇదే సంగతిని పునరుల్లేఖించింది. ఈ లగచర్ల రైతుల బెయిలు కోసం ఎంతగా ప్రయత్నిస్తున్నా లభించడం లేదు. ప్రముఖులు ఇలా వెళ్లి అలా తిరిగివస్తారు. కానీ,



అమాయకులైన అన్నదాతలు మాత్రం దిక్కులేని పక్షుల్లా జైలు గోడల వెనుక దిగులుగా గడుపుతున్నారు. పలుకుబడి కలిగిన వ్యక్తులకు బెయిలు ఇవ్వడంపై ఎవరికీ అభ్యంతరం ఉండదు. లగచర్ల రైతులకు ఎందుకివ్వడం లేదు అనేదే ప్రశ్న. రైతులు కేసును తారుమారు చేస్తారా? నీరవ్ మోదీలా, విజయ్ మాల్యాలా దేశం విడిచి పారిపోతారా? ఊరు దాటితే ఒడ్డున పడ్డ చేపలే కదా.. పోలీస్ స్టేషన్లో, కోర్టులో ధాటిగా మాట్లాడనైనా మాట్లాడలేరు. రేపు న్యాయస్థానం విచారణ జరిపి ఏ శిక్ష వేసినా ఎవరూ కాదనలేరు. దేనికైనా ముందు చార్జిషీటు దాఖలు కావాలి. కానీ, ప్రభుత్వం కుంటిసాకులతో సాగదీత ధోరణి అనుసరిస్తున్నది. బలమైన ఆధారాలుంటే చార్జిషీటు ఎందుకు దాఖలు చేయరనే వాదనలూ వినిపిస్తున్నాయి. తన అభీష్టాన్ని ప్రశ్నించి, ప్రతిఘటించినందుకు వీలైనన్ని రోజులు రైతులను జైల్లోనే మగ్గబెట్టాలనే మంకుపట్టుతో ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నది. ఇది ఏ మాత్రం క్షమార్హం కాదు. సామాజిక మాధ్యమాల్లోనూ దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అంతా సమానమే కానీ, కొంతమంది కొంచెం ఎక్కువ సమానమన్న వ్యంగ్యోక్తికి అద్దం పట్టేలా తయారైంది లగచర్ల రైతుల కేసు. సర్కారు ఇప్పటికైనా తన మొండి వైఖరి మార్చుకొని బెయిలుకు మోకాలడ్డు పెట్టడం మానుకోవాలి. తాను వ్యవహరిస్తున్నది సామాన్యులైన రైతులతోననే సోయి తెచ్చుకుంటే మంచిది.

తెలంగాణ సేన

శనివారం 08 - 02 - 2025

# ‘ చిత్రహింసలు పెట్టారు, విమానంలోకి ఎక్కగానే కాళ్లు, చేతులు కట్టేశారు’

అమెరికా, పంజాబ్, అక్రమ వలసదారులు

తన పాస్‌పోర్టు మీద వేసిన ముద్ర వల్ల తాను ఇక ఎన్నటికీ అమెరికా వెళ్లలేనని కుష్‌ప్రీత్ సింగ్ చెప్పారు.

సైనిక విమానంలో అమెరికా స్వదేశాలకు తిప్పి పంపిన భారతీయులలో పంజాబ్‌లోని ఫతేగఢ్ చురియాన్ పట్టణానికి చెందిన జస్పాల్ సింగ్ ఒకరు.



ఆయన బీబీసీ ప్రతినిధి గురుప్రీత్ చావ్లాతో మాట్లాడారు. “అమెరికా అనే కల శాశ్వతంగా మూసుకుపోయింది” అని ఆయన బరువెక్కిన హృదయంతో చెప్పారు.అమెరికా చేరుకునేందుకు ఆయన ప్రయాణం రెండున్నరేళ్ల కిందట ప్రారంభమైంది. ఆ కలను నిజం చేసుకునే ప్రయత్నంలో ఆయన రూ. 40 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పుడవన్నీ నష్టపోయినట్లే.జనవరి 29న అమెరికా 104 మంది భారతీయుల్ని సైనిక విమానంలో భారత దేశానికి పంపించింది. ఆ 104మందిలో జస్ప్రీత్ ఒకరు.2022లో తాను విజిటర్ వీసా మీద ఇంగ్లండ్ వెళ్లానని అక్కడ స్పెయిన్ నుంచి వచ్చిన పంజాబీ ఏజంట్‌ను కలిశానని జస్పాల్ సింగ్ చెప్పారు. 2024 జులైలో ఆయన యూరప్ చేరుకున్నారు. అక్కడ వివిధ దేశాల్లో ఆరు నెలలు గడిపిన తర్వాత పనామా అడవుల గుండా అమెరికా వెళ్లే మార్గాన్ని కనుక్కున్నారు.“అక్రమ మార్గంలో (డంకీరూట్) అమెరికా చేరుకునే ప్రయాణం చాలా ప్రమాదకరంగా ఉంది. ఆ మార్గంలో మగవాళ్లే కాకుండా ఆడవాళ్ల మృతదేహాలు కూడా చూశాను. కొన్ని అస్థిపంజరాలు కూడా కనిపించాయి” అని జస్పాల్ సింగ్ చెప్పారు.“కొండల్ని ఎక్కే సమయంలో, తినేందుకు మాకు చిన్న రొట్టెముక్క, ఒకటి లేదా రెండు బిస్కెట్లు మాత్రమే ఇచ్చేవారు” అని ఆయన చెప్పారు.అమెరికా సరిహద్దులు దాటి ఆ దేశంలో అడుగు పెట్టిన తర్వాత అమెరికా ఆర్మీ తమను అదుపులోకి తీసుకుందని జస్పాల్ సింగ్ అన్నారు.“వాళ్లు మమ్మల్ని అనేక రకాలుగా చిత్రహింసలు పెట్టారు. విమానంలోకి ఎక్కించిన తర్వాత చేతులు, కాళ్లు కట్టేశారు. ఆ విమానం అనేక ప్రాంతాల్లో ఆగింది. మేము అమృత్‌సర్ చేరుకున్న తర్వాత చేతులు, కాళ్లకున్న కట్లు ఊడదీశారు” అని ఆయన చెప్పారు.

**అమెరికా: అక్రమ వలసదారులంటూ సైనిక విమానాల్లోనే ఎందుకు వెనక్కి పంపుతోంది?**

హరియాణాలోని కురుక్షేత్రకు సమీపంలో ఉన్న ఇస్మాయిలాబాద్‌లో ఉండే రాబిన్ హండా తన కలలను నిజం చేసుకునేందుకు ఏడు నెలల కిందట అమెరికా వెళ్లారు.ఆయనను కూడా అమెరికా వెనక్కి పంపించింది. రాబిన్ కంప్యూటర్ ఇంజనీరింగ్ చేశారు. మెరుగైన భవిష్యత్‌ను వెతుక్కుంటూ అమెరికా వెళ్లారు.‘ నెలరోజుల ప్రయాణంలో వివిధ ప్రాంతాల్లో ఆగాను. మార్గంలో అనేక కష్టాలు ఎదురయ్యాయి. కొన్నిసార్లు తినడానికి ఏమీ ఉండేది కాదు. సముద్రాల్లో, పడవ ప్రయాణాల్లో అనేక కష్టాలు పడ్డాను. కొంతమంది నా దగ్గరున్న డబ్బులు తీసుకెళ్లారు. అనేక సమస్యలు ఎదుర్కొన్నాను” అని హరియాణా బీబీసీ ప్రతినిధి కమల్ సైనీతో చెప్పారు రాబిన్.“జనవరి 22న నేను సరిహద్దుల్ని దాటి అమెరికాలో ప్రవేశించాను. ఆ తర్వాత న్యాయప్రక్రియ ద్వారా మమ్మల్ని సైన్యానికి అప్పగించారు. అక్కడ నుంచి వాళ్లు మమ్మల్ని ఒక క్యాంపుకు తీసుకెళ్లారు. క్యాంపులో వారు మమ్మల్ని నేరస్తుల్లా చూశారు” అని కన్నీటి పర్యంతం అయ్యారు.“క్యాంప్ నుంచి మమ్మల్ని ఎక్కడకు తీసుకెళుతున్నారో కూడా చెప్పలేదు. మా కాళ్లు చేతులు చైన్లతో కట్టేశారు. మా ముందున్న సైనిక విమానాన్ని చూడగానే మేము షాక్ తిన్నాం” అని హొండా వివరించారు.ఏజెన్సీ మోసం అయితే 6-7 నెలలు మేము వీధుల్లోనే గడపాల్సి వచ్చింది. వాళ్లు మమ్మల్ని చిత్రహింసలు పెట్టారు. మాకు కరెంట్ షాకులిచ్చారు” అని రాబిన్ చెప్పారు.“వాళ్లు మా పిల్లల్ని కొడుతున్న వీడియోలు మా దగ్గర ఉన్నాయి. పిల్లల్ని పంపించేందుకు అనేకమంది తల్లితండ్రులు ఇక్కడ భూముల్ని అమ్మారు. పిల్లలకు మంచి ఉద్యోగం వస్తుందని అనుకున్నాం. కానీ అలా జరగలేదు” అని రాబిన్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు.ఆ సమయంలో ఉద్వేగ భరితంగా కనిపించారు. ‘భూమి అమ్మేసిన తర్వాత నా కొడుకుకు పని లేకుండా పోయింది. నా పిల్లలు ఆకలి, దాహంతో చనిపోతారు’ అంటూ ఆమె కన్నీరు పెట్టుకున్నారు.ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలోని కహాన్‌పురా గ్రామంలో జస్విందర్ సింగ్ 2024 అక్టోబర్‌లో అమెరికా వెళ్లారు.“రాత్రి పూట బాగా పొద్దు పోయిన తర్వాత జస్విందర్ సింగ్‌ను పోలీసులు తీసుకొచ్చి ఇంట్లో వదిలి వెళ్లారు” అని ఆయన మామ కర్నైల్ సింగ్ చెప్పారు.“మా చేతులకు బేడీలు వేసి మమ్మల్ని అమెరికా నుంచి ఇక్కడకు తీసుకువచ్చారు” అని తన కుటుంబ సభ్యులకు చెప్పారు జస్విందర్.జస్విందర్ సింగ్‌ను అమెరికన్ అధికారులు అరెస్ట్ చెయ్యడానికి 22 రోజుల ముందు ఆయన అమెరికా చేరుకున్నారు.“ఇంటికి వచ్చేటప్పటికి జస్విందర్ ఆరోగ్యం బాగా దెబ్బ తింది. మానసికంగా తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడు” అని కర్నైల్ సింగ్ చెప్పారు.తర్వాతి రోజు ఉదయం జస్విందర్ సింగ్ హటాత్తుగా అనారోగ్యం పాలవడంతో ఆయనను లుథియానా ఆసుపత్రిలో చేర్చారు.“క్యాంపులో తినడానికి తనకేమీ ఇవ్వలేదు, అప్పుడప్పుడూ సగం యాపిల్ లేదా ఏదైనా జ్యూస్ ఇచ్చేవారు” అని జస్విందర్ తన కుటుంబ సభ్యులకు చెప్పారు.జస్విందర్‌కు సోదరుడు ఉన్నారు. ఇద్దరూ గతంలో వ్యవసాయం చేసేవారు.2024లో ఆయనకు ఓ ఏజంట్ పరిచయం కావడంతో అమెరికా వెళ్లాలని భావించారు.జస్విందర్ అమెరికా వెళ్లేందుకు తమ కుటుంబం రూ. 50 లక్షలు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.“బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి, బంధువుల దగ్గర అప్పులు చేసి ఈ సొమ్ము సమకూర్చాం” అని వారు వెల్లడించారు.అమెరికా నుంచి భారతీయులను ప్రత్యేక విమానాలలో ఎందుకు తిప్పి పంపుతున్నారు, ట్రంప్ వచ్చాక ఏం జరగనుంది?

**భారతీయుల్ని తిప్పి పంపడంపై అమెరికా ఏమంటోంది?**

“అక్రమ వలసదారుల విమానం గురించి మా దగ్గర ఎలాంటి సమాచారం లేదు” అని భారతదేశంలో అమెరికా రాయబార కార్యాలయ అధికార ప్రతినిధి బీబీసీతో చెప్పారు.“అమెరికన్ల సంక్షేమం, జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని అమెరికన్ వలస చట్టాలను అమలు చెయ్యడం తప్పనిసరి. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారి విషయంలో అమెరికా చట్టాలకు లోబడి వ్యవహరిస్తున్నాం” అని ఆయన చెప్పారు.

**విదేశాంగమంత్రి రాజ్యసభలో ఏం చెప్పారు?**

“అక్రమ వలసల్ని ప్రోత్సహించడానికి మేము వ్యతిరేకం” అని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రాజ్యసభలో చెప్పారు. “అక్రమ వలసల్లో అనేక ఇతర అక్రమ విధానాలు ముడిపడి ఉన్నాయి” అని ఆయన అన్నారు.“అక్రమంగా అమెరికాకు వెళ్లి పట్టుబడిన భారతీయులు ఇతర నేరాలకు పాల్పడుతూ దొరికారు. వారు అమానవీయ పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వచ్చింది” అని జై శంకర్ అన్నారు.“అక్రమ వలసదారుల్ని తిప్పి పంపడం అంతర్జాతీయంగా ఆమోదం పొందిన విధానం కాదు. అసలు వెనక్కి పంపే ప్రక్రియ లేదు. ఇది అనేక ఏళ్లుగా జరుగుతోంది. 2009 నుంచి అమెరికా తిప్పి పంపిన భారతీయుల గురించి సమాచారం నేను అందించాను” అని విదేశాంగమంత్రి చెప్పారు.“అక్రమ వలసదారుల్ని వెనక్కి పంపే ప్రక్రియలో వారి చేతులకు బేడీలు వేస్తారు. అయితే మహిళలు, పిల్లల విషయంలో అలా చెయ్యడం లేదని వారు మాకు చెప్పారు. మార్గంలో అవసరమైన వారందరికీ ఆహారం, వైద్య సాయం అందిస్తామని అమెరికా సమాచారమిచ్చింది” అని జై శంకర్ రాజ్యసభకు వివరించారు.“పౌర విమానాలకు అమలు చేసే నియమావళి సైనిక విమానాలకు కూడా వర్తిస్తుంది. భారతీయుల్ని క్షేమంగా తీసుకువచ్చేందుకు మేము నిరంతరం అమెరికా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాం. అక్రమ వలసల్ని అరికట్టేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న ఏజంట్లపై కఠినంగా వ్యవహరిస్తాం. అమెరికా నుంచి తిరిగి వచ్చిన భారతీయుల ద్వారా వారి సమాచారాన్ని సేకరిస్తున్నాం” అని జై శంకర్ చెప్పారు.అమెరికా తిప్పి పంపుతున్న భారతీయుల చేతులకు బేడీలు వెయ్యడాన్ని ఖండిస్తూ పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ “ఎక్స్”లో మెసేజ్ పోస్ట్ చేశారు.“అమెరికా తీరు తీవ్రంగా అక్షేపించదగిన అంశం. మన దేశ పౌరుల చేతులకు బేడీలు, ఇనుప గొలుసులు వేసి పంపించడం మన దేశానికి అవమానకరం. మానసికంగా, ద్వారా గాయాలపై కారం చల్లినట్లు వ్యవహరిస్తోంది” అని తన సందేశంలో రాశారు.ఈ వ్యవహారాన్ని ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీనిపై చర్చను చేపట్టాలని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ నోటీస్ ఇచ్చారు. ఇది అమానవీయమని ఆయన వ్యాఖ్యానించినట్లు ది హిందూ పత్రిక పేర్కొంది.లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ వాయిదా తీర్మానం ఇచ్చారు.అమృత్ సర్ ఎంపీ గురుజిత్ సింగ్ అహ్లూజా ఈ వ్యవహారంపై సమాచారం ఇవ్వాలని విదేశాంగ మంత్రి జై శంకర్ నోటీస్ ఇచ్చారు.అమెరికా భారతీయుల్ని అమానవీయ రీతిలో వెనక్కి పంపిందని ఆయన ఆరోపించారు. వారి కాళ్లు, చేతులకు బేడీలు వెయ్యడం దారుణం అన్నారు.“విమానం లోపల వారిని అలా ఉంచడం సిగ్గు చేటు. భారతీయుల కాళ్లు, చేతులకు బేడీలు వేసి, చైన్లతో కట్టేసి పంపడం అవమానకరం. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం” అహ్లూజా విమర్శించారు.

# షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటిని తగలబెట్టిన ఆందోళనకారులు

హసీనా భారత్ నుంచి కుట్ర చేస్తున్నారంటూ ఆరోపణలు

షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటిని తగులబెట్టిన ఆందోళనకారులు



బంగ్లాదేశ్‌లో మరోసారి హింస చెలరేగింది. మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రత్యర్థులు ఢాకాలోని ఆమె తండ్రి ఇల్లు ధాన్‌మండి-32కి నిప్పుపెట్టారు.బుధవారం రాత్రి (ఫిబ్రవరి 5) ఈ ఘటన జరిగింది.షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌కు చెందిన ఇతర నాయకుల ఇళ్లనూ ఆందోళనకారులు ధ్వంసం చేశారు.గోడలపై ఉన్న షేక్ ముజిబుర్ రెహమాన్ చిత్రాలనూ వారు వదిలిపెట్టలేదు.ప్రస్తుతం భారత్‌లో ఉన్న షేక్ హసీనా ఆన్‌లైన్‌లో అక్కడి వారిని ఉద్దేశించి మాట్లాడాల్సిన కార్యక్రమం ప్రారంభం కావడానికి కొద్ది సమయం ముందు ఈ హింస మొదలైంది.షేక్ హసీనా బంగ్లాదేశ్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆందోళనకారులు ఈ హింసాత్మక చర్యలకు దిగినట్లు బంగ్లాదేశ్‌లోని ప్రధాన న్యూస్ పేపర్లలో ఒకటైన ‘ద డైలీ స్టార్’ రాసింది.భారత్‌లో కూర్చుని షేక్ హసీనా బంగ్లాదేశ్ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఆమె ప్రత్యర్థులు ఆరోపించారు.గత ఏడాది బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళన తర్వాత షేక్ హసీనా తన దేశాన్ని వీడారు. ఆగస్టు 5న ఆమె భారత్ వచ్చారు.

**షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటిని నిరసనకారులు ధ్వంసం చేశారు.**

షేక్ హసీనా పార్టీ స్టూడెంట్ విభాగం ‘ఛాత్ర లీగ్’ ఒక ఆన్‌లైన్ ప్రోగ్రామ్ నిర్వహించాలని భావించింది. ఆ కార్యక్రమంలో భాగంగా షేక్ హసీనా ఫేస్‌బుక్ వేదికగా మాట్లాడాల్సిఉంది. రాత్రి 9 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించాలని భావించారు.ఈ కార్యక్రమం గురించి సమాచారం తెలిసిన వెంటనే నిరసనకారులు “బుల్డోజర్ ప్రదర్శన”కు పిలుపునిచ్చారు. వారి కార్యక్రమాన్ని కూడా 9 గంటలకే తలపెట్టాలని నిర్ణయించారు.అయితే 8 గంటల సమయంలోనే వివక్ష వ్యతిరేక ఉద్యమం కన్వీనర్ హస్నత్ అబ్దుల్లా పిలుపు మేరకు వందలమంది నిరసనకారులు పారలు, సుత్తులతో ధాన్‌మండి-32లో ప్రవేశించారు.ఆందోళనకారులు మొదట షేక్ ముజిబుర్ రెహమాన్ చిత్రాలను ధ్వంసం చేశారని ప్రత్యక్ష సాక్షులను ఉటంకిస్తూ ‘ద డైలీ స్టార్’ తెలిపింది.రాత్రి తొమ్మిదిన్నర గంటలకు భవనానికి నిప్పుపెట్టారని వార్తాపత్రిక తెలిపింది. తర్వాత ఒక క్రేన్, ఎక్స్‌కవేటర్ అక్కడకు చేరుకున్నాయి.అర్ధ రాత్రి దాటాక రెండు గంటల సమయంలో భవనంలో కొంత భాగం ధ్వంసం చేశారు.మ్యూజియంగా ఉన్న ఆ ఇల్లు ‘ఫాసిజం’కు ప్రతీకగా మారిందని అందుకే తాము దాన్ని ధ్వంసం చేసి తగులబెట్టామని ఓ నిరసనకారుడు బీబీసీతో చెప్పారు.

**‘ఫాసిజానికి ప్రతీక.. అందుకే ధ్వంసం చేశాం’**

షేక్ ముజిబ్ రెహమాన్ ఇల్లు ‘ఫాసిజానికి పవిత్ర భూమి’ అని, దాన్ని ధ్వంసం చేయాలని హస్నత్ అబ్దుల్లా తన ఫేస్‌బుక్ పోస్టులో పిలుపునిచ్చారు.ఫాసిజానికి ప్రతీకగామారిన ఇంటిని ధ్వంసం చేయాల్సిన అవసరముందని, అందుకే తాను నిరసనలో భాగమయ్యానని మహముదుర్ రెహమాన్ అనే విద్యార్థి చెప్పారు.షేక్ హసీనా ప్రభుత్వం సంరక్షించిన మ్యూజియాన్ని కొనసాగించాల్సిన అవసరం లేదని మొహమ్మద్ అర్ఫిన్ అనే మరో నిరసనకారుడు చెప్పారు.విప్లవం ద్వారా తాము కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకున్నామని, ఆ భవనాన్ని ధ్వంసం చేయడంలో ఎలాంటి ముప్పు వాటిల్లదని అన్నారు.షేక్ ముజిబుర్ రెహమాన్‌ను బంగ్లాదేశ్ పితామహుడిగా పేర్కొంటారు. పాకిస్తాన్ నుంచి విడిపోయి 1971లో బంగ్లాదేశ్ ఏర్పడింది. అనంతరం ముజిబుర్ రెహమాన్ 1975లో హత్యకు గురయ్యారు.షేక్ హసీనా తన రాజకీయ ప్రత్యర్థులను హతమార్చారని, దేశంలో భారీ ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఆమె వ్యతిరేకులు ఆరోపిస్తున్నారు.ధాన్‌మండి-32ధ్వంసానికి తాత్కాలిక ప్రభుత్వ మద్దతు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే భవనం కూల్చివేతకు ఆదేశాలిచ్చినట్టు తమకు ఎలాంటి



సమాచారం లేదని ఢాకా మెట్రోపాలిటన్ పోలీస్ ప్రతినిధి తాలిబుర్ రెహమాన్ చెప్పారు.భద్రతా అధికారులు నిరసనకారులను ఆపివేశారని నిరసనల్లో భాగమైన విద్యార్థి టౌరికల్ ఇస్లామ్ చెప్పారు. అయితే కూల్చివేత మొదలైన తర్వాత వాళ్లు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. సైనికులు పెట్రోలింగ్ చేస్తున్నారని, కానీ వారు విద్యార్థులతో మాత్రమే మాట్లాడారని తెలిపారు.

**షేక్ హసీనాను అప్పగించాలని భారత్‌కు బంగ్లాదేశ్ లేఖ, రెండు దేశాల మధ్య అలాంటి ఒప్పందం ఉందా**


అవామీ లీగ్ నాయకుల ఇళ్లు ధ్వంసం ధాన్‌మండి-32తో పాటు షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌కు చెందిన కొందరు నాయకుల ఇళ్లనూ ఆందోళనకారులు ధ్వంసం చేశారు.ధాన్‌మండి-32కి నిప్పుపెట్టిన సమయంలోనే షేక్ హసీనా బంధువులు, ఖుల్నాలోని అవామీ లీగ్ నేతలు షేక్ హిలాలుద్దీన్, షేక్ జివెల్ ఇళ్లను ఆందోళనకారులు ధ్వంసం చేశారు.ఢాకానా, ఢిల్లీ ఢాకానా, ఢాకా, ముజీబాబాద్ ముర్దాబాద్ అంటూ వందలమంది ఆందోళనకారులు అవామీలీగ్ నేతల ఇళ్లముందు నినాదాలు చేశారని డైలీ స్టార్ తెలిపింది.కుస్తియాలో మాజీ ఎంపీ, అవామీ లీగ్ జాయింట్ జనరల్ సెక్రటరీ మహ్‌బూబ్ అలమ్ హనిఫ్, అవామీ లీగ్ అధ్యక్షుడు సదర్ ఖాన్ ఇంటిని కూడా నాశనం చేశారు.షేక్ హసీనా ఆన్‌లైన్ ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ చిట్టగాంగ్‌లో ఆందోళనకారులు నిరసనలు తెలిపారు.

**భవనాలు మాత్రమే తగలబెట్టగలరు..చరిత్రను చెరపలేరు**

ధాన్‌మండి-32ని తగలబెట్టడంపై షేక్ హసీనా తీవ్రంగా స్పందించారు. “దేశ స్వేచ్ఛను కొన్ని బుల్డోజర్లతో ముగించే అధికారం వారికి లేదు. వాళ్లు భవనాన్ని ధ్వంసం చేయగలరు..కానీ చరిత్రను చెరపలేరు” అని షేక్ హసీనా అన్నారు.బంగ్లాదేశ్ అవామీ లీగ్ ఫేస్‌బుక్ పేజ్ ద్వారా ఆమె ప్రసంగం ప్రసారమైంది.షేక్ హసీనా ప్రభుత్వం పతనమై ఆరు నెలలు గడిచిపోయాయి.

**షేక్ హసీనాను బంగ్లాదేశ్ పంపించాలి**

షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు తిరిగి తీసుకురావాలని అనుకుంటున్నట్టు మొహమ్మద్ యూనస్ అన్నారు. తన ప్రభుత్వం వందరోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన టీవీలో మాట్లాడారు.విద్యార్థి ఉద్యమం సమయంలో జరిగిన హింసలో మరణాలకు బాధ్యులైన షేక్ హసీనాను, ఇతరులను తమ ప్రభుత్వం విచారించాలనుకుంటున్నదని ఆయన తెలిపారు.గత ఏడాది ఆగస్టు నుంచి భారత్‌లో ఉంటున్న షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ తీవ్రంగా ఒత్తిడితెస్తోంది.



## ట్రంప్ అంటే భయమా?
## హార్లీ డేవిడ్‌సన్‌పై ఇండియాలో సుంకాల తగ్గింపు



ఇండియా గత వారం మోటార్ సైకిళ్లపై దిగుమతి సుంకాలు తగ్గించింది. 1600సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం గల ఇంజిన్లతో అధిక బరువు ఉండే బైక్‌లపై టారిఫ్ 50 నుంచి 30 శాతానికి.. చిన్న బైకులపై సుంకం 50 నుంచి 40 శాతానికి తగ్గించింది.హార్లీ డేవిడ్‌సన్ బైక్స్ భారత్‌లోకి ప్రవేశించడాన్ని సులభతరం చేయడానికి ఈ చర్యలు ప్రోత్సాహాన్నిస్తాయి.అమెరికా చేస్తున్న సుంకాల బెదిరింపులను తిప్పికొట్టాలని భారత్ భావిస్తోంది.గత ఏడాది అమెరికా నుంచి భారత్‌కు రూ. 26 కోట్ల విలువైన మోటార్ సైకిళ్లు ఎగుమతి అయ్యాయి.పొరుగు దేశాలు, మిత్ర దేశాలు, అలాగే అతిపెద్ద ప్రత్యర్థిగా భావించే చైనా వంటి దేశాలపైనా డోనల్డ్ ట్రంప్ వాణిజ్యపరమైన చర్యలు తీసుకుంటున్నారు.అయితే ఈ ప్రభావం ఇంతవరకు భారత్‌పై లేదు.భారత్ ఇప్పటికే సుంకాల తగ్గించడంతో ట్రంప్ సంతృప్తి చెందారా? లేదంటే భారత్‌పై పన్నుల భారం మోపేందుకు సిద్ధమవుతున్నారా అనేది తేలాల్సి ఉంది.“కెనడా, మెక్సికో నిజానికి అమెరికాకు రెండు చేతుల్లాంటివి. ట్రంప్ ఆ రెండు దేశాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే...భారత్‌పై కూడా చాలా తేలిగ్గా అలాంటి చర్యలు తీసుకోగలరు” అని దిల్లీకి చెందిన థింక్ ట్యాంక్ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(జీటీఆర్ఐ) ఫౌండర్ అజయ్ శ్రీవాస్తవ చెప్పారు.గత నెల చివరి వారంలో ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలో.. వాణిజ్య సమతుల్యత కోసం అమెరికా నుంచి భారత్ మరిన్ని ఆయుధాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేశారు.మొదటిసారి అధ్యక్షునిగా ఉన్న సమయంలో ట్రంప్ భారత్ సుంకాలపై విమర్శలు గుప్పించారు.హార్లీ డేవిడ్‌సన్‌పై వందశాతం సుంకం విధించడంపై ట్రంప్ పదే పదే విమర్శలు చేశారు. అది ఆమోదయోగ్యం కాదన్నారు.భారత్‌ను “సుంకాల రాజు”గా ట్రంప్ గతంలో ఆరోపించారు.వాణిజ్య సంబంధాల విషయంలో భారత్ భారీగా దుర్వినియోగానికి పాల్పడుతుందని విమర్శలు చేశారు.అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా భారత్ వాణిజ్య మిగులు సాధిస్తోంది. 2023లో ద్వైపాక్షిక వాణిజ్యం 16 లక్షల కోట్ల రూపాయలు (190 బిలియన్ డాలర్లు) దాటింది.2018 నుంచి అమెరికాకు వస్తువుల ఎగుమతులు 40శాతం పెరిగి రూ. 10 లక్షల కోట్లకు (123 బిలియన్ డాలర్లు) చేరుకున్నాయి.సేవల వాణిజ్యం 22 శాతం పెరిగి రూ. 5.7 లక్షల కోట్లకు (66 బిలియన్ డాలర్లు) చేరుకున్నాయి.అదేసమయంలో భారత్‌కు అమెరికా ఎగుమతులు రూ. 6.1 లక్షల కోట్లు (70 బిలియన్ డాలర్లు)గా ఉన్నాయి.మరోవైపు భారత్ శాటిలైట్ గ్రౌండ్ ఇన్‌స్టలేషన్ల మీద దిగుమతి పన్నులు వసూలు చేయడం లేదు.2023లో అమెరికా నుంచి భారత్‌కు ఈ ఎగుమతుల విలువ రూ. 800 కోట్లు (92మిలియన్ డాలర్లు).2023లో భారతదేశానికి అమెరికా చేసిన ఎగుమతుల్లో ముడి చమురు, రూ. 12 లక్షల కోట్లు విలువైన పెట్రోలియం ఉత్పత్తులు సహా ఎల్ఎన్‌జీ, బొగ్గు, వైద్య పరికరాలు, శాస్త్రీయ పరికరాలు, స్క్రాప్ లోహాలు, టర్బోజెట్‌లు, కంప్యూటర్లు, బాదం పప్పులు ఉన్నాయి.“భారత్ సుంకాల విధానాలను ట్రంప్ విమర్శించినప్పటికీ, తాజా తగ్గింపులు వివిధ రంగాలలో అమెరికా ఎగుమతులను పెంచేందుకు తోడ్పడతాయి” అని శ్రీవాస్తవ చెప్పారు.“ ప్రపంచ వాణిజ్య వాతావరణం ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ ...టెక్నాలజీ, ఆటోమొబైల్స్, పారిశ్రామిక, వ్యర్థాల దిగుమతులపై కీలకమైన సుంకాల కోతలతో భారతదేశం వాణిజ్యాన్ని సులభతరం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు కనిపిస్తోంది” అని ఆయనన్నారు.వస్త్రాలు, ఔషధాలు, ఇంజనీరింగ్ వస్తువుల నుంచి పెట్రోలియం ఆయిల్స్, యంత్రాలు కట్ డైమండ్స్ వరకు విభిన్నమైన వస్తువులను భారత్ ఎగుమతి చేస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లు, ఆటోపార్ట్స్, రొయ్యలు, బంగారు ఆభరణాలు, పాదరక్షలు ఇనుము, ఉక్కును రవాణా చేస్తోంది. ప్రపంచ వాణిజ్యంలో భారత్ కీలక పాత్ర పోషిస్తుంది.




**మేక్ ఇన్ ఇండియాతో మళ్లీ సుంకాలు పెరిగాయంటున్న నిపుణులు**

**‘మేక్ ఇన్ ఇండియా’తో పెరిగిన సుంకాలు**


భారత్ ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత రక్షణాత్మక ఆర్థిక వ్యవస్థలలో ఒకటి. “విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నియంత్రించే పాలనా వ్యవస్థల్లో భారత్ ఒకటి” అని 1970లలో, అమెరికన్ రాజకీయ శాస్త్రవేత్త జోసెఫ్ గ్రికో అభివర్ణించారు.ఈ విధానం ప్రపంచ వాణిజ్యంలో భారతదేశ ఎగుమతి వాటాలో తగ్గుదలకు దారితీసింది.

**1948లో 2.42గా ఉన్న వాటా 1991 నాటికి 0.51కి తగ్గిపోయింది.**

అయితే, 1990 తరువాత భారత్ ఎట్టకేలకు సుంకాలను తగ్గించడం మొదలుపెట్టింది. 1990లో 80శాతం ఉన్న సగటు సుంకాలను 2008నాటికి 13శాతానికి తగ్గించింది.అయితే భారతదేశంలో తయారీని పెంచడానికి మోదీ ప్రారంభించిన”మేక్ ఇన్ ఇండియా” విధానంతో సుంకాలు మళ్లీ 18 శాతానికి పెరిగాయి.చైనా, దక్షిణ కొరియా, ఇండోనేషియా, థాయిలాండ్ వంటి ఇతర ఆసియా దేశాలు నిర్ణయించిన సుంకాల కంటే ఇది ఎక్కువ.

**అమెరికా లక్ష్యం భారతేనా..?**

ట్రంప్ ‘అమెరికా ఫస్ట్’ విధానంలో భారత్ మొదటి లక్ష్యమని వాణిజ్య నిపుణులు బిశ్వజిత్ ధర్ నమ్ముతున్నారు.‘అమెరికా ఫస్ట్’ విధానంలో ఎక్కువ దిగుమతుల సుంకాలు విధించేవారిపై చర్యలు తీసకోవడం, వాణిజ్య విధానాలు మదింపు చేయడమనే అంశాలున్నాయని తెలిపారు.వ్యవసాయ మార్కెట్ అమెరికాకు ఇప్పటికీ ఒక సమస్యగా ఉందని ఆయన అన్నారు.అమెరికా నుంచి వచ్చే బాదం, ఆపిల్స్, శనగలు, పప్పుధాన్యాలు, వాల్‌నట్‌లపై సుంకాలను భారతదేశం తగ్గించింది. కానీ ట్రంప్ మరిన్ని వస్తువులపై సుంకాలు తగ్గించాలని డిమాండ్ చేసే అవకాశం ఉంది. అయితే, భారత్‌లో వ్యవసాయం చుట్టూ ఉన్న రాజకీయ సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని మనం దృఢంగా ఉండవచ్చు.“ఇక్కడే మనం గట్టిగా బేరమాడుతాం. అక్కడే సమస్యలు తలెత్తవచ్చు” అని ధార్ హెచ్చరిస్తున్నారు.అయితే, చైనాను ఎదుర్కొనే క్వాడ్ సభ్యదేశంగా అమెరికాతో భారతదేశ వ్యూహాత్మక సంబంధాలు ఘర్షణను తగ్గించడంలో సహాయపడతాయి. అమెరికా వెనక్కి పంపిస్తున్న సరైన పత్రాలు లేని భారతీయ వలసదారులను తిరిగి పంపించాలని భారత్ అనుకోకపోవడం కూడా సానుకూల సంకేతాన్ని పంపిందని ధర్ విశ్లేషించారు.ట్రంప్‌తో మోదీకి ఉన్న వ్యక్తిగత అనుబంధం కూడా ప్రయోజనం కలిగిస్తుందని నిపుణులు అంచనావేస్తున్నారు. ట్రంప్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఈ నెలలో అమెరికాలో పర్యటించనున్నట్టు తెలుస్తోంది. ఈ పర్యటనలో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.



తెలంగాణ సేన

శనివారం 08 - 02 - 2025

# ఐటీ కంపెనీ బంపరాఫర్: ఉద్యోగులకు రూ.14.5 కోట్ల బోనస్




దేశంలోని చాలా దిగ్గజ కంపెనీలు భారీ లాభాలను పొందినప్పటికీ.. ఉద్యోగులను తొలగించడం, జీతాలు పెంచక పోవడం వంటివి చేస్తుంటాయి. ఇలాంటి ఘటనలు గతంలో కోకొల్లలు. అయితే తాజాగా కోయంబత్తూరుకు చెందిన ఓ కంపెనీ మాత్రం తన ఉద్యోగులకు ఏకంగా రూ.14.5 కోట్ల బోనస్ ప్రకటించింది. దీని గురించి మరిన్ని వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.కోయంబత్తూరుకు చెందిన 'కోవై.కో' అనే కంపెనీ.. సంస్థలో మూడేళ్ళుగా పనిచేస్తున్న 140 మంది ఉద్యోగులకు 'టుగెదర్ వి గ్రో' చొరవ కింద రూ.14.5 కోట్లు విరాళం ప్రకటించింది. ఈ బోనస్‌ను డిసెంబర్ 31, 2022 నాటికి కంపెనీలో మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారికి పంపిణీ చేయనున్నట్లు సమాచారం. మూడేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులు వారి వార్షిక జీతంలో 50% బోనస్ పొందుతారు. ఇది వారి కృషి, అంకితభావానికి నిదర్శనం. ఇప్పటికే మొదటి దశలో 80 మందికి పైగా ఉద్యోగులు ఇప్పటికే వారి జనవరి జీత చెల్లింపులలో భాగంగా బోనస్‌లను అందుకు న్నారు. కంపెనీ వృద్ధికి, విజయానికి సహాయపడే ఉద్యోగు లకు సంస్థ పొందిన లాభాలలో వాటా ఇవ్వడం నా కల. అందుకే ఉద్యోగులకు బోనస్‌లు ఇస్తున్నట్లు కోవై.కో వ్యవస్థాపకుడు.. సీఈఓ శరవణ కుమార్ అన్నారు. 2023లో కంపెనీ గణనీయమైన లాభాలను ఆర్జించింది. బెంగళూరుకు చెందిన ఫ్లోయిక్‌ను కొనుగోలు చేసిన తరువాత సంస్థ వేగంగా అభివృద్ధి చెందిందని ఆయన అన్నారు.ఉద్యోగులకు షేర్ రూపంలో ఇవ్వడం కంటే.. నగదు రూపంలో డబ్బు ఇవ్వడం వల్ల వారి ప్రయోజనాలను ఉపయోగపడుతుంది. బ్యాంక్ లోన్స్ చెల్లించడానికి లేదా ఇతర అవసరాలకు ఈ డబ్బు ఉపయోగపడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకునే బోనస్‌ను నగదు రూపంలో ఇవ్వాలని నిర్ణయించినట్లు శరవణ కుమార్ పేర్కొన్నారు. కంపెనీ తాము ఊహించినదానికంటే ఎక్కువ బోనస్ ఇచ్చినందులు ఉద్యోగుల ఆనందానికి అవధులు లేకుండా పోతోంది.

# గూగుల్ పేలో ఆటోపే.. సింపుల్‌గా క్యాన్సిల్ చేయండిలా

ఆన్‌లైన్ లావాదేవీలు వచ్చిన తరువాత.. దాదాపు చాలామంది గూగుల్ పే, ఫోన్ పే వంటివి విరివిగా ఉపయోగిస్తున్నారు. సబ్‌స్క్రిప్షన్‌లు, ఈఎంఐ వంటివి చెల్లించడానికి వీటినే వాడేస్తున్నారు. దీనికోసం గూగుల్ పేలోని 'ఆటోపే' సెట్ చేసుకుంటారు. ఇది ఆటోమాటిక్ చెల్లింపులకు ఉపయోగపడుతుంది. అయితే కొంతమంది ఆటోమాటిక్‌గా చెల్లించడానికి ఇష్టపడనప్పుడు 'ఆటోపే క్యాన్సిల్ చేసుకోవచ్చు.

**గూగుల్ పేలో ఆటోపే ఎలా నిలిపివేయాలంటే?**

యాప్ ఓపెన్ చేసిన తరువాత, ఎగువ భాగంలో కుడివైపు కనిపించే మీ ప్రొఫైల్ ఐకాన్ మీద క్లిక్ చేయాలి.ప్రొఫైల్ ఐకాన్ మీద క్లిక్ చేసిన తరువాత ఆటోపే ఆప్షన్స్ కనిపించే వరకు కిందికి స్క్రోల్ చేయాలి.ఆటోపే ఆప్షన్ కనిపించిన తరువాత.. దానిపైన క్లిక్ చేయాలి. క్లిక్ చేసిన తరువాత లైవ్ ట్యాబ్ కింద యాక్టివ్ మ్యాండేట్‌ల జాబితా కనిపిస్తుంది. మీరు తీసివేయాలనుకుంటున్న ఆటోపే మ్యాండేట్‌పై క్లిక్ చేయండి.ఆటోపే క్యాన్సిల్ చేయాలనుకున్నప్పుడు. క్యాన్సిల్ మీద క్లిక్ చేయాలి. ఆ తరువాత యూపీఐ పిన్ నెంబర్ ఎంటర్ చేయాలి.యూపీఐ ఎంటర్ చేయగానే ఆటోపే క్యాన్సిల్ అవుతుంది.

**మళ్ళీ ఆటోపే సెట్ చేసుకోవాలంటే?**

గూగుల్ పేలో మళ్ళీ ఆటోపే సెట్ చేసుకోవాలంటే.. మళ్ళీ యాప్ ఓపెన్ చేసి, ప్రొఫైల్ ఐకాన్ మీద క్లిక్ చేసి.. ఆటోపే ఆప్షన్స్ ఎంచుకోవాలి. ఉదాహరణకు నెట్‌ఫ్లిక్స్ కోసం ఆటోపే ఆదేశాన్ని సెటప్ చేసి, తరువాత దానిని రద్దు చేసి ఉంటే.. మీరు నెట్‌ఫ్లిక్స్‌లో చెల్లింపు పద్ధతిగా మీ యూపీఐ ఐడీని తిరిగి ఎంటర్ చేయాలి. ఆ తరువాత యథావిధిగా ఆటోపే యాక్టివేట్ అవుతుంది.

**ఆటోపే వల్ల ఉపయోగాలు**




బిజీ జీవితంలో అన్నింటిని గుర్తుపెట్టుకోవడం కొంత కష్టమైన పని. ఏదైనా చెల్లింపులు లేదా ఈఎంఐ వంటి చెల్లించడంలో ఆలస్యమైతే జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి జరిమానాల నుంచి తప్పించుకోవడానికి, సమయానికి చెల్లింపులు పూర్తి చేసుకోవడానికి ఆటోపే అనేది బెస్ట్ ఆప్షన్.

# హోమ్ లోన్ ఈఎంఐలు తగ్గుతాయ్.. ఎలాగంటే

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 6.50 శాతంగా ఉన్న రెపో రేటును 6.25 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తాజాగా ప్రకటించారు. దీని వలన వడ్డీ రేట్లు, ఈఎంఐలు తగ్గేందుకు ఆస్కారం కలిగింది.2019 అక్టోబర్ 1 తర్వాత మంజూరైన అన్ని రిటైల్ ఫ్లోటింగ్-రేట్ రుణాలు ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌తో అనుసంధానమై ఉంటాయి. చాలా సందర్భాలలో ఇదే రెపో రేటుగా ఉంటుంది. కాబట్టి రేటు తగ్గింపు గృహ రుణగ్రహీతలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తుంది. దేశంలోని గృహ రుణాలలో ఎక్కువ భాగం ఫ్లోటింగ్ వడ్డీ రేట్లను కలిగి ఉంటాయి. ఫలితంగా, వడ్డీ భారం, వాటి ఈఎంఐలు తగ్గుతాయి. దీంతో ఇంటి యజమానులకు ఉపశమనం కలిగిస్తుంది.దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత తొలిసారిగా ఆర్బీఐ రెపో రేటును తగ్గించింది. ఆర్బీఐ చివరిసారిగా 2020 మేలో రేట్లను తగ్గించింది. కోవిడ్-19 మహమ్మారి ప్రభావం నుండి ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి అప్పట్లో రెపో రేటును 4 శాతానికి తగ్గించింది. 2022 మే నుండి, పెరుగుతున్న ద్రవ్యోల్బణం,





సరఫరా గొలుసు అంతరాయాలు, ప్రపంచ ధరల పెరుగుదలను ఎదుర్కోవడానికి సెంట్రల్ బ్యాంక్ రెపో రేటును ఏడు సార్లు 6.5 శాతానికి పెంచింది.

**హోమ్ లోన్ కస్టమర్లకు భారీ ప్రయోజనాలు**

ప్రస్తుత రేట్ల తగ్గింపు వల్ల హోమ్ లోన్ కస్టమర్లకు ఎంత మేర ప్రయోజనం కలుగుతుందో ఒక ఉదాహరణ ద్వారా ఇప్పుడు చూద్దాం.. ఒక సంవత్సరం క్రితం 9 శాతం వడ్డీ రేటు, 20 సంవత్సరాల కాలపరిమితి (240 నెలలు) తో రూ. 50 లక్షల గృహ రుణాన్ని తీసుకున్నట్లయితే.. నెలవారీ ఈఎంఐ సుమారు రూ. 44,986 ఉంటుంది. రుణ కాలంలో చెల్లించే అసలు, వడ్డీ మొత్తం కలిపి రూ. 58 లక్షలు అవుతుంది.ఇప్పుడు 25 బేసిస్ పాయింట్ల రేటు తగ్గింపుతో గృహ రుణ వడ్డీ రేటు 9 శాతం నుండి 8.75 శాతానికి తగ్గుతుంది. ఫలితంగా అసలు, వడ్డీ మొత్తం చెల్లింపు సుమారు రూ. 53.6 లక్షలకు తగ్గుతుంది. దీని వలన రూ. 4.4 లక్షలు ఆదా అవుతుంది. అలాగే రుణ కాలపరిమితి 230 నెలలకు తగ్గుతుంది. దీని వలన రుణాన్ని 10 నెలల ముందుగానే తిరిగి చెల్లించవచ్చు.

# రెపో రేటు తగ్గించిన ఆర్బీఐ.. లోన్లు తీసుకున్నవారికి గుడ్ న్యూస్



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత మొదటిసారిగా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఇది 6.25 శాతానికి వచ్చింది. ఖర్చులను పెంచడానికి, వృద్ధిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో వ్యక్తిగత పన్ను రేట్లను తగ్గించిన క్రమంలోనే ఈ రేటు తగ్గింపు నిర్ణయం కూడా రావడం గమనార్హం.ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య విధాన కమిటీ ఫిబ్రవరి 5న మూడు రోజుల సమావేశాన్ని ప్రారంభించింది. శుక్రవారం వడ్డీ రేట్లపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటన చేశారు. పూర్వ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం ముగిసిన తర్వాత, సంజయ్ మల్హోత్రా గత డిసెంబర్ లో పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది మొదటి ద్రవ్య విధాన కమిటీ సమావేశం. మార్కెట్లు రేటు తగ్గింపు కోసం ఆసక్తిగా ఎదురుచూశాయి. అందరూ అంచన వేసినట్లుగానే ఆర్బీఐ రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో బెంచ్‌మార్క్ రుణ రేటు ప్రస్తుత 6.5 శాతం నుండి 6.25 శాతానికి తగ్గింది.

**జీడీపీ 6.7%**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రేటు నిర్ణయ ప్యానెల్ 2026 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధిని దాదాపు 6.7%గా అంచనా వేసిందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. అలాగే 2026 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం 4.2% వద్ద కొనసాగుతుందని ఆర్బీఐ ప్యానెల్ అంచనా వేసింది. కొత్త పంటల రాక నేపథ్యంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గుతుందని భావిస్తున్నట్లు ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తూ ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు.ఆర్‌బీఐ పూర్వ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో జరిగిన మునుపటి ఎంపీసీ సమావేశంలో రెపో రేటులో ఎటువంటి మార్పు చేయకుండా 6.5 శాతంగా యథతథంగా కొనసాగించారు. అయితే, నగదు నిల్వ నిష్పత్తి 50 బేసిస్ పాయింట్లు తగ్గించారు. నగదు ప్రవాహాన్ని పెంచడానికి ఆర్‌బీఐ బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ. 1 ట్రిలియన్లను చొప్పించింది. డిసెంబర్ పాలసీలో కీలకమైన చర్య నగదు నిల్వ నిష్పత్తి 50 బేసిస్ పాయింట్లు తగ్గించడం, బ్యాంకింగ్ వ్యవస్థలోకి రెండు విడతలుగా రూ. 1.16 లక్షల కోట్లు ఇంజెక్ట్ చేయడం.

**రెపో రేటు అంటే..**

రెపో రేటు అంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వసూలు వేసే వడ్డీ రేటు. రెపో రేటు పూర్తి రూపం రీపర్చేజ్ అగ్రిమెంట్ లేదా రీపర్చేజింగ్ ఆప్షన్. బ్యాంకులు అర్హత కలిగిన సెక్యూరిటీలను అమ్మడం ద్వారా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి రుణాలు పొందుతాయి.

# ఆశ్చర్యపరుస్తున్న రతన్ టాటా వీలునామా ఊహించని వ్యక్తికి ఆస్తిలో భారీ వాటా



దేశ పారిశ్రామిక ప్రగతికి ఎనలేని కృషి చేసిన రతన్ టాటా గతేడాది అక్టోబర్‌లో కన్ను మూశారు. కాగా ఇటీవల తెరిచిన రతన్ టాటా వీలునామా చాలా మందిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఎందుకంటే అందులో జంషెడ్‌పూర్‌కు చెందిన ట్రావెల్ రంగ ఎంట్రాప్రెన్యూర్ మోహినీ మోహన్ దత్తా అనే వ్యక్తికి ఆస్తిలో రూ. 500 కోట్లు (రతన్ టాటా మిగిలిన ఆస్తులలో దాదాపు మూడో వంతు) కేటాయించాలనే నిబంధన ఉంది. ఇది టాటా కుటుంబాన్ని మాత్రమే కాకుండా ఆయన సన్నిహితులను కూడా ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే మోహినీ మోహన్ దత్తా అనే వ్యక్తి గురించి అంతర్గతంగా కూడా ఎవరికీ పెద్దగా తెలీదు.

**ఎవరీ మోహినీ మోహన్ దత్తా?**

మోహినీ మోహన్ దత్తా జంషెడ్‌పూర్‌లో బాగా స్థిరపడిన వ్యాపారమైన స్టాలియన్ ట్రావెల్ ఏజెన్సీని కలిగి ఉన్న కుటుంబం నుండి వచ్చారు. 2013లో స్టాలియన్ ట్రావెల్ ఏజెన్సీని టాటా గ్రూప్ అనుబంధ సంస్థ అయిన తాజ్ సర్వీసెస్‌తో విలీనం చేశారు. స్టాలియన్‌లో దత్తా కుటుంబానికి 80% వాటా ఉండగా, మిగిలిన 20% వాటా టాటా ఇండస్ట్రీస్ యాజమాన్యంలో ఉంది. మరో విషయం ఏమిటంటే మోహినీ దత్తా థామస్ కుక్ మాజీ అసోసియేట్ కంపెనీ అయిన టీసీ ట్రావెల్ సర్వీసెస్‌కు డైరెక్టర్‌గా కూడా పనిచేశారు.

**టాటా-దత్తా సంబంధం**

మీడియా నివేదికల ప్రకారం.. మోహినీ మోహన్ దత్తా రతన్ టాటాతో దీర్ఘకాల అనుబంధాన్ని కొనసాగించారు. టాటా వ్యక్తిగత లేదా వృత్తిపరమైన సంబంధాల గురించి బహిరంగ చర్చలలో ఆయన పేరు ప్రముఖంగా లేకపోయినా, టాటా కుటుంబంతోపాటు ప్రైవేట్ సర్కిల్‌లోని ఎంపికచేయదగ్గ వ్యక్తులలో మోహినీ మోహన్ దత్తా ఒకరుగా ఉన్నారు.

**వీలునామా సందేహాస్పదం?**

టాటా ట్రస్ట్ మాజీ ఛైర్మన్ రతన్ టాటా మరణం తర్వాత తాజాగా ఈ వీలునామా బయటకు వచ్చింది. ఊహించని విధంగా మోహన్ దత్తాకు రూ.500 కోట్లు కేటాయించడంతో పాటు, మిగిలిన సంపదను ప్రధానంగా దాతృత్వ కార్యక్రమాల కోసం వినియోగించాలని అందులో పేర్కొన్నారు. వీలునామాను అమలు చేసే నలుగురు వ్యక్తులలో (డారియస్ ఖంబటా, మెహ్లి మిస్త్రీతో పాటు) ఉన్న ఆయన సవతి సోదరీమణులు షిరిన్, దినా జస్జీభోయ్ కూడా తమ వాటాలను దాతృత్వ కార్యక్రమాలకు విరాళంగా ఇవ్వడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు.కాగా ఈ పరిణామం గురించి వ్యాఖ్యానించడానికి మోహిన్ దత్తా నిరాకరించారు. అదేవిధంగా వీలునామా అమలు చేసేవారు వారు కూడా ఎటువంటి బహిరంగ ప్రకటనలూ జారీ చేయలేదు. ఆస్తి పంపిణీకి సంబంధించి ఆశ్చర్యకరమైన స్వభావం కారణంగా, ముఖ్యంగా బయటి వ్యక్తికి భారీ ఆస్తి కేటాయింపును పరిగణనలోకి తీసుకుంటే, వీలునామా పరిశీలనకు గురికావచ్చని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# బంగారం ధరలపై ఊరట.. ఆగిందా.. తగ్గిందా?



దేశంలో ఆగకుండా పెరుగుతున్న బంగారం ధరలు కొనుగోలుదారులకు ఊరట కల్పించాయి. వరుసగా మూడో రోజులుగా దూసుకెళ్లి హ్యాట్రిక్ కొట్టిన పసిడి ధరలు నేడు శాంతించాయి. దేశవ్యాప్తంగా పుత్తడి రేట్లు నిలకడగా కొనసాగుతున్నాయి.బంగారం ధరలు ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, నగల మార్కెట్‌లతో సహా అనేక అంతర్జాతీయ కారకాలపై ఆధారపడి ఉంటాయి. నేటి బంగారం ధరలు ఏయే ప్రాంతాల్లో ఎలా ఉన్నాయనేది ఈ కథనంలో తెలుసుకుందాం.

**తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 79,300, 24 క్యారెట్ల పసిడి రేటు రూ. 86,510 వద్ద ఉన్నాయి.

**ఇతర ప్రాంతాల్లో..**

దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.86,660 వద్ద, 22 క్యారెట్ల పసిడి ధర రూ.79,450 వద్ద ఉన్నాయి. చెన్నైలో బంగారం ధరల విషయానికి వస్తే.. ఇక్కడ 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 79,300 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 86,510 వద్ద కొనసాగుతున్నాయి. బెంగళూరు, ముంబై ప్రాంతాల్లోనూ ఇవే ధరలు ఉన్నాయి.

**వెండి ధరలు**

దేశవ్యాప్తంగా వెండి ధరల్లో నేడు ఎలాంటి కదలిక లేదు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ ధర రూ.1,07,000 వద్ద, ఢిల్లీలో రూ. 99,500 వద్ద నిలకడగా కొనసాగుతున్నాయి.

# మళ్ళీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



స్వల్ప లాభాల్లో మొదలైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి మళ్ళీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 211.41 పాయింట్లు లేదా 0.27 శాతం నష్టంతో 77,846.74 వద్ద, నిఫ్టీ 43.40 పాయింట్లు లేదా 0.18 శాతం నష్టంతో 23,559.95 పాయింట్ల వద్ద నిలిచాయి.టాటా స్టీల్, భారతి ఎయిర్‌టెల్, జేఎస్‌డబ్ల్యు స్టీల్, ట్రెంట్, హిందాల్కో ఇండస్ట్రీస్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ , ఐటీసీ కంపెనీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్రిటానియా ఇండస్ట్రీస్, అదానీ పోర్ట్స్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

**రెపో రేటు తగ్గించిన ఆర్‌బీఐ**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత మొదటిసారిగా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఇది 6.25 శాతానికి వచ్చింది. ఖర్చులను పెంచడానికి, వృద్ధిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో వ్యక్తిగత పన్ను రేట్లను తగ్గించిన క్రమంలోనే ఈ రేటు తగ్గింపు నిర్ణయం కూడా రావడం గమనార్హం.

# తగ్గిపోయిన ఐటీసీ లాభం

ITC Limited

డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 7 శాతం క్షీణించి రూ. 5,103 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 5,407 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 8 శాతంపైగా బలపడి రూ. 20,946 కోట్లను తాకింది.గత క్యూ3లో రూ. 19,309 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం 12 శాతం పెరిగి రూ. 14,414 కోట్లకు చేరాయి. కాగా.. రెడీ టు కుక్ ఫుడ్స్ విభాగంలోని ప్రసూమాలో 100 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు ఐటీసీ పేర్కొంది. ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. తొలుత 62.5 శాతం వాటాకుగాను రూ. 187 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది.తదుపరి మూడేళ్లలో దశలవారీగా మిగిలిన 37.5 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు వివరించింది. తొలుత ప్రసూమా మాతృ సంస్థ యాంపిల్ ఫుడ్స్ నుంచి 43.8 శాతం వాటాకు రూ. 131 కోట్లు వెచ్చించనుంది. ఈ బాటలో మరో రూ. 56 కోట్లతో వాటాను 62.5 శాతానికి పెంచుకోనున్నట్లు తెలియజేసింది. ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్ఈలో 1.5 శాతం క్షీణించి రూ. 441 వద్ద ముగిసింది.

# అరబిందో ఫార్మా లాభం రూ. 846 కోట్లు




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా నికర లాభం రూ. 846 కోట్లుగా నమోదైంది. గత క్యూ3లో ఇది రూ. 940కోట్లు. మరోవైపు తాజాగా ఆదాయం రూ. 7,352 కోట్ల నుంచి రూ. 7,979 కోట్లకు చేరింది. త్రైమాసికాలవారీగా చూస్తే అత్యధిక ఆదాయాన్ని నమోదు చేసినట్లు కంపెనీ ఎండీ కె. నిత్యానంద రెడ్డి తెలిపారు.కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం ఇందుకు దోహదపడినట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తయారీ సామర్థ్యాలను మరింతగా మెరుగుపర్చుకోనున్నామని, స్పెషాలిటీ.. ఇంజెక్టబుల్స్ వ్యాపారాన్ని విస్తరించనున్నామని నిత్యానంద రెడ్డి వివరించారు. దీనితో లాభదాయకత చెప్పుకోతగ్గ స్థాయిలో మెరుగుపడుతుందని చెప్పారు.సమీక్షాకాలంలో అమెరికా ఫార్ములేషన్ విభాగం సుమారు రెండు శాతం క్షీణించి రూ. 3,671 కోట్లుగా, యూరప్ ఫార్ములేషన్స్ 23 శాతం పెరిగి ఆదాయం రూ. 2,121 కోట్లుగా, గ్రోత్ మార్కెట్స్ విభాగం 39 శాతం వృద్ధితో రూ. 873 కోట్లుగా నమోదైంది. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై కంపెనీ రూ. 450 కోట్లు వెచ్చించింది. బీఎస్ఈలో కంపెనీ షేరు స్వల్పంగా క్షీణించి రూ. 1,184.50 వద్ద క్లోజయ్యింది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332